


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



శుక్రవారం | 11-8-2017 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 117 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: చవితి రా. 11.58 తదుపరి పంచమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 6.13 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: మ. 3.49-5.25; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.24; మ. 12.46-1.37; అమృతఘడియలు: రా. 1.26-3.02; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.40 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
విజయవాడ సిటీ
శుక్రవారం 11-8-2017



మైనారిటీలు భద్రమే!

ప్రపంచంలోకెల్లా వారు ఇక్కడే క్షేమం

ఓటు బ్యాంకు రాజకీయాలే సమస్య

కొత్త ఉపరాష్ట్రపతి వెంకయ్య స్పందన

నేటి ఉదయం 10.15కు ప్రమాణం

వెంకయ్య కార్యదర్శిగా ఐవీ సుబ్బారావు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: మైనారిటీలు అభద్రతలో ఉన్నారంటూ 'మాజీ' ఉపరాష్ట్రపతి అన్సారీ చేసిన వ్యాఖ్యలను కొత్త ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తిప్పికొట్టారు. అన్సారీ పేరు ప్రస్తావించకుండానే దీనిపై స్పందించారు. "మైనారిటీలు అభద్రతా భావంలో ఉన్నారన్నది కొందరి రాజకీయ ప్రచారం

మిగతా 18వ పేజీలో...

అన్సారీకి వీడ్కోలు సభలో హమీద్–వెంకయ్య పరస్పర అభినందనలు

• పోతూ పోతూ ఓ పంచ్..

ముస్లింలు అభద్రం!

ఇబ్బందికర పరిస్థితి ఉంది

ఈ సంగతి ప్రధానికీ చెప్పా

అన్సారీ సంచలన వ్యాఖ్య

ఇక మీరు స్వేచ్ఛగా మాట్లాడొచ్చు: ప్రధాని మోదీ 18

హమీద్‌కు ఘనంగా వీడ్కోలు



6

ఆయేషా కేసులో సిట్ చీఫ్‌గా శ్రీకాంత్

బృందంలో ముగ్గురు మహిళలు

నమ్మకం లేదు.. సీబీఐకే ఇవ్వాలి

ఆయేషా తల్లిదండ్రుల డిమాండ్

కాలుష్య సర్టిఫికెట్ ఉంటేనే బీమా రెన్యువల్

కేంద్రానికి సుప్రీం ఆదేశాలు 18

శిక్షణ లేకుంటే బోధనకు అనర్హులు

ప్రాథమిక స్థాయిలో డీఎడ్ ఉన్నవారే అర్హులు 16

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

ప్రైవేటు బడులకూ వర్తింపు

• వన్స్ మోర్..



నంద్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న విపక్ష నేత జగన్

బాబుకు ఉరిశిక్ష వేసినా

తప్పులేదు

ఆయనకు కళ్లు నెత్తికొచ్చాయి

మళ్లీ జగన్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఎన్నికల హామీలేవీ నెరవేర్చలేదు

ఇలాంటి సీఎంను ఏం చేయాలి?

నంద్యాలలో రోడ్‌షో

సంజాయిషీ అందింది

అభ్యర్థులు హుందాగా మెలగాలి: భన్వర్

కర్నూలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'మూడున్నరేళ్ల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చారా? 2014 ఆగస్టు 15న కర్నూలులో చేసిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు. రైతులు, మహిళలు, నిరుద్యోగ యువకులను మోసం చేసిన ఈ చంద్రబాబుకు ఉరిశిక్ష విధించినా తప్పు లేదు' అని వ్యాఖ్యానించారు. ఆ వెంటనే.. మనం ఈ మాటలంటే దిష్టిబొమ్మలు దహనం చేయిస్తారని పేర్కొన్నారు. కొద్దిరోజుల

మిగతా 16వ పేజీలో...

జగన్ కుసంస్కారి 16

ఓటమి భయంతోనే అనుచిత వ్యాఖ్యలు: ఉమ

దిగజారుడుతనానికి నిదర్శనం: అఖిలప్రియ

కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయింపు

సీఎంకు ప్రాణహాని.. సోమిరెడ్డి అనుమానం

• బాబు మాట

జాబ్స్.. జోష్

మన చెంతకే ప్రపంచ స్థాయి సంస్థలు

అందుబాటులోకి ఎన్నెన్నో కొలువులు

మెడికల్ హబ్‌గా రాజధాని



శంకుస్థాపన అనంతరం బీఆర్ఎస్ మెడిసిటీ నమూనా వద్ద సీఎం చంద్రబాబు, బీఆర్ శెట్టి తదితరులు

యువత ఇక ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేదు

ఎన్నెన్నో సంస్థలు ఇక్కడికే తరలొస్తాయి

తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరంలో గేమింగ్, వర్చువల్ స్టూడియోలు

అమరావతిలో రైతులే ప్రథమ పౌరులు

రాజధానిలో 27 టౌన్ షిప్పులు: సీఎం

బీఆర్ఎస్ మెడిసిటీకి శంకుస్థాపన

రాజధానిలో 12వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న బీఆర్ శెట్టి సంస్థలు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతికి కొలువులు కదలి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇకపై రాష్ట్రానికి చెందిన యువత ఉపాధి కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రపంచస్థాయి సంస్థలే మన వద్దకు తరలి వస్తాయని స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం దొండపాడులో ఏర్పాటు చేయనున్న బీఆర్ఎస్ మెడిసిటీకి గురువారం సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధానికి భూములు ఇవ్వాలని పిలుపునిస్తే రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారని, వారి దూరదృష్టి వల్ల అమరావతి అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన ప్రాంతమవుతోందని అన్నారు. అమరావతిలో రైతులే ప్రథమ పౌరులని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతాన్ని మెడికల్ హబ్‌గా

మిగతా 14వ పేజీలో...

రానున్నది కొలువుల పండగ

భారీ పరిశ్రమలు రాకతో ఎన్నో అవకాశాలు

మూడేళ్లలో 1.3 లక్షల ఉద్యోగాలు

సీమలో సింహభాగం.. సర్కారు అంచనా

వెయ్యి కోట్లతో జపాన్ సంస్థ టోరే 14

540 కోట్లతో హీరో అనుబంధ సంస్థ

ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు

కృష్ణమ్మపై మరో బ్యారేజీ!

డీపీఆర్ పంపండి.. పరిశీలిస్తాం.. సీఎంకు ఉమాభారతి లేఖ

కృష్ణమ్మపై మరో బ్యారేజీ నిర్మాణంపై కేంద్రంలో కదలిక వచ్చింది. ప్రకాశం బ్యారేజీకి దిగువన ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుపై సవివర నివేదిక (డీపీఆర్) పంపాలని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమా భారతి సూచించారు. 13



• డ్రై.. బ్రూట్స్!

బూజు తింటున్నాం

కుళ్లిన పప్పు తెచ్చుకొంటున్నాం

వాసనకొట్టే సరుకు కొంటున్నాం

కలవరపెడుతున్న 'కల్తీ' కహానీ 6

బయట నుంచి బల్క్‌గా నాసి సరుకు

మంచివాటితో కలిపి గుట్టుగా సేల్

ఫారిన్ బ్రాండ్లతో అధికారులకు మస్కా

బెజవాడలో ఆహారం విషతుల్యం

విజిలెన్స్ దాడులు.. వ్యాపారుల అరెస్టు



సరుకును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు



మత్తులో పాఠశాల విద్యార్థులు

గంజాయి, వైట్‌నర్‌ల వాడకం

విశాఖ నగరంలో విష సంస్కృతి.. స్వయంగా హెచ్చరించిన మంత్రి గంటా

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

తరగతి గదిని 'మత్తు' ఆవరిస్తోంది. ఆట-పాఠాలతో హాయిగా సాగాల్సిన వయసుకు కూడా కిక్కు ఎక్కుతోంది! ఇప్పటిదాకా కాలేజీలు, యూనివర్సిటీలు, ఇతర వర్గాలకే పరిమితమైందనుకున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం పాఠశాలల స్థాయికీ చేరిందని వెల్లడైంది. హైదరాబాద్‌లో కొన్ని 'ధనిక' పాఠశాలలకు డ్రగ్స్ వ్యాపించినట్లు గుర్తించగా... నవ్యాంధ్రలోని ఏకైక 'కాస్మోపాలిటన్' నగరమైన విశాఖలో పాఠశాలలకు మత్తు పదార్థాలు వ్యాపించినట్లు వెల్లడైంది. నాలుగు రోజుల క్రితం మధురానగర్ జీవీఎంసీ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య

మిగతా 6వ పేజీలో...

వడివడిగా విలీనం? 15

బీజేపీ హెచ్చరికతో అన్నాడీఎంకే వర్గాల్లో కదలిక

నేడు ఢిల్లీలో ఓపీఎస్–ఈపీఎస్ భేటీ?.. కమలనాథుల సమక్షంలోనే మంతనాలు

డిప్యూటీగా పన్నీర్?.. దినకరన్‌పై వేటు.. నియామకం చెల్లదని తీర్మానం

తమిళ రాజకీయం

తమిళనాడులో స్వల్ప విరామం తరువాత రాజకీయం తిరిగి జోరందుకుంది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల కథ కంచికి చేరగానే అమిత్‌షా దృష్టి ఇటు మళ్లింది. ముఖ్యమంత్రి పళనిస్వామి అధ్యక్షతన ఆయన వర్గానికి చెందిన ఓ సమావేశంలో శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ నియామకం చెల్లదని తీర్మానించారు. 2011లో అతడిని పార్టీనుంచి జయలలిత సస్పెండ్ చేసిన తరువాత, మొన్న ఫిబ్రవరిలో అతడిని డిప్యూటీ జనరల్ సెక్రటరీగా శశికళ నియమించడం పార్టీ నియమనిబంధనలకు వ్యతిరేకమన్నది ఈ తీర్మానం సారాంశం. అందువల్ల, గతవారం దినకరన్ చేసిన మరికొన్ని నియామకాలు కూడా చెల్లవని, పార్టీ నాయకులు, కార్యకర్తలు వీటిని బేఖాతరు చేయాలన్నది సందేశం. సహజంగానే ఈ తీర్మానంమీద దినకరన్ మండిపడ్డారు. పళనిస్వామిని మోసగాడంటూ, తాను తలుచుకుంటే పళని క్షణం కూడా పదవిలో ఉండలేరని ఓ హెచ్చరిక చేశారు. 'సర్కస్ దాడి' తప్పదన్న ఆయన హెచ్చరికలను బట్టి చూస్తే, పళనివర్గం నిర్ణయం రెండాకుల చీలికపోయిన రెండాకుల పార్టీని ఒక్కటి చేసేందుకు పడిన ముందడుగని అనుకోవచ్చు.

పంద్రాగస్టులోగా పళని, పన్నీర్ వర్గాలు రెండూ ఒక్కటైపోవాలన్నది అమిత్‌షా ఆదేశంగా దీనితో విలీనానికి చెందిన వీలుగా రాజకీయం తిరిగి జోరందుకుందని అంటున్నారు. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఢిల్లీ వేదికగా ఉన్న పళని, పన్నీర్‌లు మోదీతోనూ, అమిత్‌షాతోనూ భేటీ అయి వారి దిశా నిర్దేశం మేరకు భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారని వార్తలు వస్తున్నాయి. పళనివర్గం తీర్మానంలో దినకరన్ నియామకాన్ని ప్రశ్నించడం మాత్రమే ఉన్నది కానీ, శశికళ ప్రస్తావన ప్రత్యక్షంగా లేదు. శశికళ కుటుంబీకులందరితోనూ తెగతెంపులు చేసుకుంటేనే పళనివర్గంతో చర్చలకు దిగివస్తామని పన్నీర్ మరోమారు తేల్చిచెప్పారు. నా నియామకం చెల్లనప్పుడు నన్ను నియమించినవారు చేసిన మిగతా నియామకాలు కూడా చెల్లవు కదా అని దినకరన్ చేసిన వ్యాఖ్య అర్థవంతమైనదే అయినా, ఇప్పుడు ఆయనను పక్కనపెట్టడమే అందరి లక్ష్యం. అప్పుడు మాత్రమే బీజేపీకి చేతులు కలపడానికి మార్గం సుగమం అవుతుంది. పళని ముఖ్యమంత్రిగా, పన్నీర్ ఉపముఖ్యమంత్రిగా ఉంటారని ఒకవాదన, పన్నీర్ సీఎం అయితే, పళనికి పార్టీ అధికారం దక్కుతుందని మరోవాదన వినిపిస్తున్నాయి. ఎవరికి ఏ దక్కాలన్నది ఇప్పుడు ఢిల్లీలో తేలగానే శశికళ, దినకరన్ కోరలు కూడా తెగిపోతాయి.

పళనివర్గం తన తీర్మానంలో కొత్తగా చెప్పిందేమీ లేదు. పార్టీ ప్రధానకార్యదర్శి నియామకం జరిగేవరకూ ఆ బాధ్యతలు నిర్వహిస్తారంటూ గతంలో శశికళను నియమించడం జరిగిందనీ, అందువల్ల ఆమె నియామకమే తాత్కాలికమైనదన్నది ఈ తీర్మానంలో ఒక వాదన. అటువంటి హోదాలో ఉన్న శశికళ చేసిన దినకరన్ నియామకం నిబంధనలకు వ్యతిరేకమైనదన్నది మరొక అంశం. నిజానికి ఈ రెండు వాదనలూ పళనివర్గం ఇప్పుడు కొత్తగా చేసినవేమీ కావు. ఏప్రిల్ చివరివారంలోనూ ఈ వర్గం ఇదే ప్రకటన చేసింది. శశికళను ఎన్నుకోవడమే కాక, ఆమే తమ పార్టీ ప్రధాన కార్యదర్శి అంటూ ఎన్నికల సంఘం ముందు వాదించినవారే ఇప్పుడు ఆమె నియామకాన్ని వేలెత్తిచూపుతున్నారు. శశికళ నియామకం విషయంలో ఉన్న తగాదాను తేల్చవలసింది నిజానికి ఎన్నికల సంఘమే. కానీ, ఆమెతో ఏ సంబంధమూ లేదని చెప్పుకోనిదే పన్నీరుతో కలవడమూ, ఆయనకు కొండంత అండగా ఉన్న బీజేపీతో రాజీకి రావడమూ పళనికి సాధ్యం కాదు. రెండు వర్గాల విలీనానికి ఏదో ఒక ప్రాతిపదిక సృష్టించి అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ఈ తరహా విన్యాసం చేయక తప్పదు. శశికళకు, దినకరన్‌కు వ్యతిరేకంగా పళనివర్గం నిర్దిష్టంగా వ్యవహరించిన పక్షంలో, తమ ఉనికికే ముప్పువస్తున్నదని వారిద్దరూ అనుకున్న పక్షంలో పళనిని అధికారంలోనుంచి దింపేందుకు కచ్చితంగా ప్రయత్నాలు చేస్తారు. దినకరన్ పక్షాన 10మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న వాదన విశ్వసించిన పక్షంలో, తాడోపేడో తేల్చుకోవాల్సి వచ్చినప్పుడు పళని కుర్చీని లాగేయడం ఆయనకు కష్టంకాదు. కానీ, కొత్త సంక్షోభం బీజేపీ చొరబాటుకు మరింత వీలుకల్పిస్తుందన్న భయంతోనే దినకరన్ ఓపిక పడుతున్నారు. పళని, పన్నీరు సీనియర్ నాయకులు కావచ్చునేమో కానీ, పార్టీని బలంగా నిలబెట్టే సమర్థత వీరిద్దరికీ లేదు. జయలలిత స్థానంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయవలసిన శశికళ ఆఖరునిముషంలో ఆ అవకాశం కోల్పోయారు. ఆస్తులకేసులో ఆమెపై తీర్పు ఎప్పుడు చెబుతారని కర్ణాటక తరపు న్యాయవాది కోర్టును అడగడమూ, వారంలో చెబుతానంటూ న్యాయస్థానం ప్రకటించడం, ప్రమాణస్వీకారానికి సిద్ధంగా ఉన్న ఆమెకు కేంద్రమూ, గవర్నరూ అడ్డుపడటం, చివరకు నాలుగేళ్ళశిక్షతో ఆమె పరప్పన అగ్రహార జైల్లోకి పోవడమూ తెలిసిందే. జయలలిత సమాధిముందు కూర్చుని అమ్మచెప్పింది అంటూ పన్నీరుసెల్వం కన్నీరు కార్చి తిరుగుబాటుచేయడం నుంచి ఎన్నికల సంఘం అధికారులకు లంచం ఇచ్చారన్న అభియోగంపై దినకరన్ తీహార్‌జైలుకు పోవడం వరకూ అన్నింటిలోనూ బీజేపీ పాత్ర ఉన్నదన్న వాదన కాదనలేనిది. ఈపీఎస్, ఓపీఎస్‌లు ఏకమైన పక్షంలో వివాదంలో ఉన్న రెండాకుల గుర్తును ఎన్నికల సంఘం నుంచి సాధించవచ్చు. దినకరన్ కుట్రలు నెరవేరే అవకాశాలు ఉండవు. శశికళనూ, దినకరన్‌ను పార్టీనుంచి గెంటివేసి, జయలలిత పార్టీతో కలసి 2019 ఎన్నికలకు పోవడం బీజేపి ఉద్దేశంగా కనిపిస్తున్నది. ఈ విన్యాసంలో ప్రభుత్వం కుప్పకూలినా, మరిన్ని సంక్షోభాలు పుట్టుకొచ్చినా ఆ రాష్ట్రంలో తాడూ బొంగరం లేని బీజేపీకి కొత్తగా పోయేదేమీ లేదు. తమిళనాడులో రాజకీయ పరిస్థితి సాధ్యమైనంత వేగంగా చక్కబడి, పాలన గాడినపడటం అవసరం.

జనగళం

న్యాయశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

2011లో 253 ప్రత్యేక న్యాయస్థానాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టులకు కాంట్రాక్టు ఉద్యోగులను నియమించింది. వీరు ఇన్నేళ్లుగా చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం స్కీం ద్వారా 13వ ఆర్థిక సంఘం నిధులతో నడిచే కోర్టులివి. ఈ కోర్టులో పనిచేస్తున్న హెడ్ క్లర్క్, జడ్జి, అటెండర్స్ వంటి రెగ్యులర్ ఉద్యోగులకు భారీగా జీతాలు చెల్లిస్తున్నారు. కానీ టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్‌లకు జీతాలు సరిగా పెంచలేదు. కేంద్ర న్యాయ వ్యవహారాల శాఖ జీతాలు పెంపుదల ఫైలుపై స్పందించాలి. టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్‌ల జీతం రూ.24 వేలకు పెంచాలి. గతంలో జి.ఒ.ఎం.ఎస్.నెం. ప్రకారం జీతం రూ.15వేలు తీసుకొంటున్నాం. కొత్త జి.ఒ.ఎం.ఎస్.నెం. 95 ప్రకారం కాంట్రాక్ట్ ఒప్పంద ఉద్యోగులకు జీతాలు తగ్గుతున్నాయి. జి.ఒ.లో లోపాలు ఉన్నాయి. వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న వస్తున్న వారి జీతాలు నిర్ణయం సవ్యంగా జరగలేదు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించి నిర్ణయిం తీసుకోవాలి. న్యాయ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులర్ పోస్టు వెయిటేజీ ఇవ్వాలి. న్యాయ శాఖ 13వ ఆర్థిక సంఘం జీతాల పెంపుదల వారికి వర్తింపజేయాలి.

- పి. వినయ్, కుప్పం, చిత్తూరు జిల్లా


శిశు తరగతుల నిర్ణయం మంచిదే!

అన్ని రాష్ట్రాల్లోని సర్కారు ప్రాథమిక పాఠశాల్లో ఎల్.కె.జి., యు.కె.జి. తరగతులను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం మంచి పరిణామం. చిక్కి శల్యమవుతున్న పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఇదే పరిష్కారం. జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎన్.సి.ఇ.ఆర్.టి.) సమావేశం ఈ మేరకు తీర్మానించడం, దానికి కేంద్ర మానవ వనరుల శాఖ సానుకూలత వ్యక్తం చేయడం గొప్ప మార్పుకు శ్రీకారం చుట్టినట్టే. ఈ దిశగా కేంద్రం కార్యాచరణను రూపొందించాలి. సర్వశిక్షా అభియాన్ ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో అదనపు వనరులను ఏర్పాటు చేయాలి. సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలి. ఇవన్నీ చేస్తే సర్కారు పాఠశాలలు గత వైభవాన్ని పొందుతాయి.

- వాండ్రంగి కొండలరావు, పొందూరు, శ్రీకాకుళం జిల్లా

'అసహన' భారతం!

■ బల్బీర్ పుంజ్



రైట్ పాయింట్

ఆకాంక్షల ఆరాటాలను ఆదర్శాలతో మిళితం చేసిన యువ దళితుడు రాజేశ్. 34 ఏళ్ళ ఈ యువకుడు వివాహితుడు, ఇద్దరు బిడ్డల తండ్రి. స్వీయ సామాజిక అస్తిత్వ స్పృహ, ఆత్మ గౌరవంతో బతుకుతూ సమసమాజం, సిరిసంపదలతో వర్ధిల్లే శక్తిమంతమైన భారతదేశాన్ని రాజేశ్ స్వప్నించాడు. అతడేమీ పడక్కుర్చీ మేధావి కాడు. క్రియాశీల కార్యకర్త. సంఖ్యానేకులు భాగస్వాములుగా వున్న తన భవ్య స్వప్నాన్ని వాస్తవం చేయడానికి వ్యవస్థ పరిధిలో, నిబద్ధతతో తన శక్తి మేర కృషి చేస్తున్న ఆదర్శ భారతీయుడు రాజేశ్.

జాతి హితానికి దోహదం చేసే మానవీయ లక్ష్యాల పరిపూర్తికై రాజేశ్ స్వార్థరహిత, స్ఫూర్తిదాయక కార్యాచరణ సహజంగానే అతని పరిసరాలలోని యథాతథ పరిస్థితిని సవాల్ చేసింది. సమస్యలు చుట్టుముట్టాయి. అయినా ధైర్య సాహసాలతో ముందుకు సాగాడు. లక్ష్యసాధనలో మొక్కవోని దీక్షాదక్షతలకు గాను అతను తన జీవితంతో భారీ మూల్యం చెల్లించాడు. గత నెల 29న రాజేశ్‌ను నడివీధిలో భావజాల ప్రత్యర్థులు నిట్ట నిలువునా నరికివేశారు.

తిరువనంతపురంలోని శ్రీకర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్వయం సేవకుడు రాజేశ్. ఆ దురదృష్ట దినాన ఆరెస్సెస్ సమావేశం నుంచి రాజేశ్ ఇంటికి తిరిగి వెళ్ళుతున్నాడు. దారి మధ్యలో పదిహేను మంది సాయుధులు అతనిపై హఠాత్తుగా దాడి చేశారు. ఎడమచేతిని నరికివేసి దూరంగా విసిరివేశారు. ఆ తరువాత కత్తులతో దాదాపు వంద పోట్లు పొడిచారు. మృత్యు రాకాసి కోరల్లో చిక్కుకున్న రాజేశ్ తనపై దాడిచేసిన వారి వివరాలను వెల్లడించి కన్ను మూశాడు. సువిశాల భారతదేశపు నేరాల చిట్టాలో రాజేశ్ మరణం ఒక గణాంకం మాత్రమే. అయితే రాజేశ్ అమానుష మరణం జ్ఞాపకాలు అతని కుటుంబ సభ్యులను, సన్నిహిత సహచరులను ఎప్పటికీ కలవరపెడుతూనే వుంటాయి. అటువంటి హింసాత్మక చావు బారిన పడడానికి అతడు చేసిన అవాంఛనీయ పనులేమిటి? రాజేశ్ పేరున పోలీసు రికార్డు లేదు. అయితే అతడు రెండు 'నేరాల'కు పాల్పడ్డాడు.

రాజేశ్ ఒక దళితుడు. అయితే తనపై ఎవరి జులుంను సహించలేదు. లోబడి బతికే మనస్తత్వం అతనికి లేనేలేదు. స్వతంత్రంగా జీవించాడు. సాహసోపేతంగా ఆలోచించాడు. దేశం కోసం స్వప్నించాడు. సమాజ హితానికి అంకితమయ్యాడు భారతీయ సమాజాన్ని భవ్య సమాజంగా తీర్చిదిద్దడానికి అకుంఠితంగా కృషిచేశాడు. సాధికారత సాధించిన దళితుల ప్రతినిధి రాజేశ్. సంప్రదాయాలను ఛేదించాడు. కొత్త మార్గాలలో పయనించాడు. తాను విశ్వసించిన భావజాలానికి కట్టుబడ్డాడు. ఆచరణలో ఎంతో మందికి ఆదర్శమయ్యాడు. కనుకనే స్వార్థ పరశక్తులకు కన్నెర్ర అయ్యాడు. రాష్ట్రంలోని పాలక వర్గాలు అభద్రతా భావంలో పడ్డాయి. రాజేశ్ ఉనికి తమకు ఎప్పటికైనా ముప్పేనని భావించాయి.

ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్‌ను హతమార్చినప్పుడు అసహనం రాజ్యమేలుతున్న దేశంగా భారత్‌ను విమర్శించారు. మరి కేరళలో రాజేశ్ లాంటి వారి హత్యలు దైనందిన వ్యవహారమయిపోతే ఎవరి అంతరాత్మ బాధపడడంలేదెందుకని?

దళితులలో విప్పారుతున్న నూతన చైతన్యానికి, పెంపొందుతున్న ఆత్మ విశ్వాసానికి ప్రతినిధి అయిన రాజేశ్ తనకు తానుగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో భాగస్వామి అయ్యాడు. రాజేశ్ స్వతంత్ర వైఖరి పాలక సిపిఎం వర్గాలకు నచ్చలేదు. ఆరెస్సెస్‌లో భాగస్వామి కావడమంటే వారి దృష్టిలో దైవ/మత ద్రోహం లాంటి నేరమే. ఛాందస మత సంప్రదాయాల ప్రకారం దైవ ద్రోహం అనేది మరణ శిక్షకు అర్హమైన నేరం. మరి రాజేశ్ అటువంటి నేరానికి పాల్పడ్డాడు. అందుకే కిరాతకంగా హత్యకు గురయ్యాడు.

ఇటువంటి శిక్షలకు రాజేశ్ మొట్టమొదటి బాధితుడేమీ కాదు. కేరళలో గత పదమూడు నెలల్లో రాజేశ్ లాంటి 13 మంది అమాయకులు, ఒక అమాయకురాలు క్రూరంగా హతమార్చబడ్డారు. ఆ 14 మంది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌తో సంబంధమున్న వారే. వారి హంతకులు పాలక సిపిఎంకు చెందిన వారని మరి చెప్పనవసరం లేదు. ఈ 14 మందిలో రాజేశ్‌తో సహా నలుగురు దళితులు. తిరువనంతపురంలోని కన్నమ్మూల ప్రాంతానికి చెందిన 19 ఏళ్ళ విష్ణును గత అక్టోబర్ 7న నరికి వేశారు. అదే నగరానికి చెందిన 49 ఏళ్ళ అనీల్ కూడా 2016 డిసెంబర్ 19న అటువంటి చావుకే గురయ్యాడు. త్రిస్సూర్‌కు చెందిన 20 ఏళ్ళ నిర్మల్‌ను కూడా గత ఫిబ్రవరి 12న అదే విధంగా చంపివేశారు.

2015 సెప్టెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని దాద్రి అనే పట్టణంలో ఒక మూక మహమ్మద్ అఖ్లాక్ అనే యాభై ఏళ్ళ ముస్లిం వ్యక్తిపై దాడిచేసి ఊచకోత కోశారు. ఏమిటి అతని నేరం? అతని ఇంటిలో ఆవు మాంసం వుండడమే! 2016 జనవరిలో యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో యువ పరిశోధకుడు రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడు. రోహిత్ కులం హోదా వివాదాస్పదమయింది. ఆ విషయమై చర్చ కొనసాగుతూనే వున్నది. కాగా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, అఖిల భారత విద్యార్థి పరిషత్, సంఘ్ పరివార్ నుంచి ఎదురైన వేధింపుల కారణంగానే రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడని వామపక్షాలకు చెందిన సామాజిక కార్యకర్తలు ఆరోపించారు. రోహిత్ దురదృష్టకరమైన మరణాన్ని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక ప్రచారాస్త్రంగా వాడుకున్నారు.

గత ఏడాది జూలైలో హర్యానాలోని స్వగ్రామానికి రైలులో వెళ్ళుతున్న జునైద్ ఖాన్ అనే 16 ఏళ్ళ బాలుడిని రైలులోనే ఒక మూక చంపివేసింది. ఈ దురదృష్టకర సంఘటనకు సంబంధించి రెండు కథనాలు ప్రచారంలో వున్నాయి. జునైద్ గొడ్డు మాంసాన్ని తీసుకువెళుతున్నందున కోపొద్రిక్తులైన సహ ప్రయాణికులు అతన్ని తీవ్రంగా కొట్టడంతో ప్రాణాలు విడిచాడనేది మొదటి కథనం. రెండో కథనం ఈ సంఘటనలో మత పరమైన కోణాన్ని తిరస్కరించింది. రైలులో ప్రయాణికులు కిక్కిరిసి వుండడం వల్ల సీట్ల కోసం జరిగిన తోపులాట, కొట్లాటగా పరిణమించి అంతిమంగా జునైద్ ప్రాణాలను బలిగొన్నదని ఈ కథనం వివరించింది. సంఘ్ పరివార్ చేతుల్లో మైనారిటీలు, దళితులు తీవ్ర వివక్ష, వేధింపులకు గురవుతున్నారనేందుకు అఖ్లాక్, రోహిత్ వేముల, జునైద్ ఉదంతాలే తిరుగులేని నిదర్శనాలని ప్రజలు విశ్వసించేలా చేయడంలో వామపక్షాలు, 'లౌకికవాదులు' సఫలమయ్యారు.

వాస్తవాలు జటిలమయ్యాయి. విషాదఘటనల వృత్తాంతాలు వక్రీకరణకు గురయ్యాయి. వామపక్షాలు తమ రాజకీయ, భావజాల ప్రయోజనాలకు అఖ్లాక్, రోహిత్, జునైద్‌ల ఉదంతాలను పూర్తిగా ఉపయోగించుకున్నాయి. ఈ క్రమంలో భారత్‌ను 'అసహన' సమాజంగా చిత్రించడం జరిగింది. అయితే భావజాలం పేరిట రాజేశ్, నిర్మల్, అనీల్, విష్ణు మొదలైన దళితుల క్రూర హత్యలు ఎవరికీ పట్టడం లేదు. ప్రజల చర్చల్లో వారి విషాదాంతాల ప్రస్తావనే రావడం లేదు. వారికి నివాళిగా ఎటువంటి కొవ్వొత్తి ప్రదర్శనలు జరగడం లేదు. అంతర్జాతీయ సదస్సులను ఎవరూ నిర్వహించడం లేదు. ప్రభుత్వం ప్రదానం చేసిన అవార్డులను వాపస్ చేయడం లాంటి నాటకీయ ఘటనలేవీ సంభవించడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్ ఊచకోతకు గురయినప్పుడు భారత్‌లో అసహనం రాజ్యమేలుతుందనే ప్రచారం అంతర్జాతీయ స్థాయిలో జరిగింది. కొంతమంది ప్రముఖులు దేశంలో సుఖసంతోషాలతో నివశిస్తూనే తాము అంతకంతకూ అభద్రతా భావానికి లోనవుతున్నామని వాపోవడం ప్రారంభ మయింది. అయితే ఎటువంటి కనికరం లేకుండా చోటుచేసుకున్న రాజేశ్ మొదలైన వారి హత్యలు దైనందిన ఘటనలుగా పరిణమించాయి. అయినా ఈ విషాదాలు ఎవరి అంతరాత్మను ఏ విధంగానూ బాధించలేదు. విశాల భారతదేశం మాట అటుంచండి, ఆ అమానుష ఘటనలు చోటుచేసుకున్న 'భగవంతుని సొంత సీమ'లో సైతం అవి ఎవరినీ ఎంతమాత్రం కలవరపెట్టలేదు! మనది 'అసహన' సమాజమే కాకుండా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్న మొద్దుబారిపోయిన జాతి కూడా సుమా!

(వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు)

ఆ పూర్వ వైభవం మళ్ళీ వస్తే!

'వెంకయ్యనాయుడు తనకు ఇష్టమైన రెండు పనులు ఇకమీదట చేయలేరు..' అని ఇటీవల పార్లమెంటరీ బోర్డు సమావేశం తర్వాత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడుతూ అన్నారు. 'ఒకటి నిరంతరం పర్యటించడం, రెండవది మీడియాలో కనపడడం. ఈ రెండూ లేకపోతే వెంకయ్య ఏమి చేయగలరు' అని సుష్మా వ్యాఖ్యానించారు. ఈ విషయం నరేంద్రమోదీ ఒప్పుకోలేదు. 'ఎలాంటి పదవీ బాధ్యతలు చేపట్టినా ఆ పదవిని ప్రజలకు ఎంత సన్నిహితం చేయాలో వెంకయ్యకు బాగా తెలుసు. కనుక ఏ మాత్రం భయపడనక్కర్లేదు.' అని ఆయన నవ్వుతూ జవాబిచ్చారు. సుష్మా స్వరాజ్ భావిస్తున్నట్లే చాలా మంది ఈ దేశంలో వెంకయ్య నాయుడు గతంలో మాదిరి అనర్గళ ప్రసంగాలు చేయలేరని, మీడియాలో కనపడలేరని, విస్తృత పర్యటనలు చేయకుండా ఉపరాష్ట్రపతి పదవిలో బంధీగా ఉండిపోతారని భావిస్తున్నారు. ఈ అభిప్రాయాలను ప్రధానమంత్రి మోదీయే పటాపంచలు చేసి వెంకయ్య నైజాన్ని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని వెంకయ్యనాయుడు కూడా ఇటీవల తన 'అలుపెరగని గళం విరామమెరుగని పయనం' సంపుటాల ఆవిష్కరణ సభలో స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి పదవిని ఖైదుగా భావించడం లేదని, ఈ పదవిని కూడా ప్రజల్లోకి వెళ్లడానికి, ప్రజాస్వామ్యాన్ని బలపరచడానికి ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచిస్తున్నానని స్పష్టం చేశారు.

నిజంగా ఉపరాష్ట్రపతి పదవి పలు అడ్డంకులు, ఆంక్షలతో కూడుకుని ఉన్నదా? అంటే అవును అని స్పష్టంగా చెప్పడానికి వీలు లేదు. ఎందుకంటే ఏ పదవికి అయినా దాని పరిమితులు దానికి ఉంటాయి. ప్రధానమంత్రి మోదీ ఎన్డీఏ సమావేశంలో అత్యంత సులభంగా చెప్పినట్లు కూతురు కోడలు అయితే ఆమె బాధ్యతలు ఎలా మారుతాయో ప్రతి పదవికీ దానికున్న విలక్షణత దానికుంటుంది. మనుషుల వ్యక్తిత్వాలు, ప్రతిభా సామర్థ్యాలు, వివేచన శక్తి, వాక్చాతుర్యం, మేధస్సు ఒకో సందర్భంలో ఒకో రకంగా ఉపయోగపడతాయి. వెంకయ్య ఈ శక్తులను ఇంతకాలం ఉపయోగించుకున్న తీరు మారుతుందే కాని ఆ శక్తులు అణగారిపోతాయని ఏ మాత్రం చెప్పలేము.

చరిత్రలో ఇందుకు ఎన్నో దృష్టాంతాలున్నాయి. ఉదాహరణకు తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి ఆయన కుమారుడు. చరిత్ర కారుడు సర్వేపల్లి గోపాల్ రాసిన జీవిత చరిత్ర చదివితే రాధాకృష్ణన్ ఎంత క్రియాశీలకంగా వ్యవహరించారో అర్థమవుతుంది. సర్వేపల్లి కూడా వెంకయ్య నాయుడు మాదిరే తొలుత ఉపరాష్ట్రపతి పదవి చేపట్టడానికి ఆసక్తి ప్రదర్శించలేదు. రాజ్యాంగం ప్రకారం చూస్తే ఆ స్థానంలో ఉన్నవారు రాజ్యసభ సమావేశాలకు అధ్యక్షత వహించడం, రాష్ట్రపతి స్థానం ఖాళీగా ఉన్నప్పుడో, ఆయన అనారోగ్యం పాలైనప్పుడో, లేక విదేశాల్లో ఉన్నప్పుడో ఆ బాధ్యతలు నిర్వహించడం మినహా చేసేదేమీ ఉండదని రాధాకృష్ణన్ భావించారు. వివిధ విషయాల్లో ఆసక్తి, మేధాశక్తి గల రాధాకృష్ణన్ పదవీ విధులకు పరిమితం కాబోరని చాలా మంది భావించారు. కాని ప్రధానమంత్రి నెహ్రూ రాధాకృష్ణన్ పై పెట్టుకున్న ఆశలు వేరు. ఉపరాష్ట్రపతి కార్యకలాపాలను రాజకీయ, దౌత్య రంగాల్లో విస్తరింపచేసేందుకు ఉపయోగించుకోవాలని, అందుకు కొన్ని పద్ధతులను అనుసరించాలని తాను భావిస్తున్నట్లు రాధాకృష్ణన్‌తో నెహ్రూ చెప్పారు. దౌత్యవేత్తలతో సంబంధాలతో రాష్ట్రపతికి సహకరించే విధంగా వ్యవహరించాలని రాధాకృష్ణన్‌ను ఆయన కోరారు. అంతేకాదు, అంతర్గత వ్యవహారాల్లో ప్రభావం చూపే అవకాశాన్ని కూడా రాధాకృష్ణన్‌కు నెహ్రూ కల్పించారు.

రాజ్యసభలో చైర్మన్ హోదాలో ఉపరాష్ట్రపతి ఎంత సేపు కూర్చోవాలన్న విషయంలో నియమ నిబంధలేమీ లేవు. రోజుకు ఆరుగంటల చొప్పున రెండు మాసాలు కుర్చీలో కూర్చుంటే తనకు తలనొప్పి అని రాధాకృష్ణన్ ఒకసారి అన్నారు. అందువల్ల సభలో ముఖ్యమైతే తప్ప రోజుకు రెండు గంటలకు మించి కూర్చునేవారు కారు. ప్రశ్నోత్తరాల సమయం ఒక గంట, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు సభ్యులు వేర్వేరు అంశాలు ప్రస్తావించే జీరో అవర్ ఒక గంట మాత్రమే కూర్చుని ఆ తర్వాత గంటల కొద్దీ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతను ఉపాధ్యక్షుడికే వదిలేసేవారు. కూర్చున్నంతసేపూ సభను ఎంతో శ్రద్ధగా నిర్వహించేవారు. పదేళ్ల ఆయన రాజ్యసభ చైర్మన్‌గా ఉన్నంతకాలం ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌ను పర్యవేక్షించకపోవడం ఒక్కసారి కూడా జరగలేదు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న సమయంలో కూడా సభను నిర్వహించేవారు. తప్పనిసరి పర్యటించాల్సి వస్తే మధ్యాహ్నం ఢిల్లీ నుంచి విమానంలో వెళ్లి మరునాడు ఉదయానికే తిరిగి వచ్చేవారు. 'నేను ఏ పార్టీకి చెందిన



ప్రధానమంత్రికీ, వెంకయ్యనాయుడుకూ మధ్య ఉన్న అభిప్రాయాల సారూప్యత అందరికీ తెలిసిందే. ప్రధానికీ, ఉపరాష్ట్రపతికీ మధ్య సంబంధాలు ఎలా ఉండాలన్న విషయంలో గతంలో నెహ్రూకు, రాధాకృష్ణన్‌కూ ఉన్న సంబంధాలు చరిత్రలో దృష్టాంతంగా నిలిచిపోయాయి. ఆ పూర్వ వైభవం మళ్లీ వస్తే రాజ్యాంగ వ్యవస్థలు మరింత బలోపేతం అవుతాయి.

akbar

వాడిని కాను. అన్ని పార్టీలకు చెందిన వాడినన్నమాట' అని మొదటి రోజే ప్రకటించి ఆ రకంగా సభను నిష్పాక్షికంగా నిర్వహించానన్న పేరు తెచ్చుకున్నారు. రాధాకృష్ణన్ సభాధ్యక్ష స్థానంలో ఉన్నట్లయితే ఎటువైపూ మొగ్గు చూపే ప్రసక్తి ఉండదని, ప్రభుత్వ విప్‌ల జోక్యం మూలంగా సభ్యుల హక్కులకు భంగం వాటిల్లబోదని అందరికీ అర్థమైంది. మర్యాద, హాస్యం, సౌజన్యతలను మేళవించి తగిన నిర్ణయాలు తీసుకుని ఉన్నతమైన సభా ప్రమాణాలను రాధాకృష్ణన్ నెలకొల్పారు. కశ్మీర్, ప్రివెంటివ్ డిటెన్షన్ వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని చెప్పారు. ఒకోసారి ముక్కుసూటిగా, కఠినంగా మాట్లాడి క్రమశిక్షణ నెలకొల్పినా, ఆ పని హాస్యస్ఫోరకంగా చేసేవారు కనుక సభను నిర్వహించడం తేలికయ్యేది. రాజ్యసభ హక్కుల విషయంలో పట్టుదలగా ఉండేవారు. అన్ని కమిటీలు, ప్రతినిధి వర్గాల్లో రాజ్యసభ సభ్యులకు ప్రాతినిధ్యం ఉండేట్లుగా శ్రద్ధ చూపేవారు. ఉభయ సభల సభ్యుల మధ్య ఘర్షణ తలెత్తకుండా పరస్పరం సహకరించుకునేట్లు శ్రద్ధ చూపేవారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఉపన్యాసాలకు అవకాశం ఇచ్చేవారు కాదు. అనుబంధ ప్రశ్నలు క్లుప్తంగా ఉండాలని చెప్పేవారు.

ఢిల్లీలో ఉన్నన్ని రోజులు రాధాకృష్ణన్ ప్రతి రోజూ మూడు గంటలు సందర్శకులతో గడిపేవారు. వేర్వేరు రంగాలకు చెందిన భారతీయులు, ఢిల్లీకి వచ్చిన సందర్శకులతో మాట్లాడేవారు. నెహ్రూ వద్ద ఆయనకున్న పలుకుబడి తెలిసినందువల్ల మంత్రులతో పాటు అనేక మంది ఆయనను కలిసి సహాయం కోరేవారు. విదేశాలకు చెందిన దౌత్యవేత్తలకు, సందర్శకులకు రాధాకృష్ణన్ ఒక ఆకర్షణ. ఉపరాష్ట్రపతి హోదాలో వివిధ విదేశీ రాయబార కార్యాలయాలు తమ జాతీయ దినోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో ఆయన పాల్గొనేవారు. అవి ఒక విధంగా విసుగు తెప్పించే కార్యక్రమాలైనా ఆయన వున్నంతసేపూ సందడిగా ఉండేది. ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు వివిధ అంశాలపై ఆయన చేసిన ప్రసంగాలు, వ్యాఖ్యానాలపై పుస్తకాలు కూడా వెలువడ్డాయి. ఆయన అంతర్జాతీయ దృక్పథం తెలిసిన ఇజ్రాయిల్ తమ దేశాన్ని సందర్శించాల్సిందిగా కోరింది. ముఖాముఖి చర్చల్లో ఎవరికి ఏదైనా చెప్పగల ప్రతిభ రాధాకృష్ణన్‌లో ఉన్నదని నెహ్రూకు తెలుసు. అందువల్ల భారత దేశంలోనే కాదు బయటి దేశాల్లో చర్చలకు కూడా రాధాకృష్ణన్‌ను వెళ్లమని కోరేవారు. అవకాశం లభించినప్పుడల్లా కొరియా, కశ్మీర్ గురించి భారతదేశ వైఖరిని విదేశాల్లో వివరించే బాధ్యతను నెహ్రూ ఆయనకు అప్పగించారు. ఆయన పర్యటనల ఫలితాలు నెహ్రూకు ఎంతో సంతోషం కలిగించాయి. 'భారత్‌కు రాధాకృష్ణన్ ఉత్తముడైన రాయబారి' అని అభివర్ణించారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌గా రాధాకృష్ణన్ పేరును ప్రస్తావించినప్పుడు అమెరికా, సోవియట్ యూనియన్‌లు ఆయనే కావాలని సందేశాలు పంపాయి. కాని రాధాకృష్ణన్ అందుకు నిరాకరించారు. ఆయనను వదులుకోవడం నెహ్రూకు కూడా ఇష్టం లేనందువల్ల 'మీ నిర్ణయం నాకు ఒకరకంగా సంతోషకరం, మరో రకంగా విచారకరం..' అని వ్యాఖ్యానించారు.


ప్రధానితో సన్నిహిత సంబంధాలు ఉంటే ఒక ఉపరాష్ట్రపతి సమర్థుడైన సలహాదారుగా, విదేశాల్లో దేశ ప్రతినిధిగా అద్భుతంగా ఉపయోగపడగలరని సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్ నిరూపించగలిగారు. ఇప్పటి వరకూ దేశంలో 12 మంది ఉపరాష్ట్రపతుల్లో ఆరుగురు రాష్ట్రపతులు కాగా బిడి జట్టి, హిదయతుల్లా, పాఠక్, కృష్ణకాంత్, షెకావత్, హమీద్ అన్సారీ లాంటి వారు వివిధ కారణాల వల్ల రాష్ట్రపతులు కాలేకపోయారు. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎన్నికయినపుడు తమ సభలో ఒక ప్రకాశవంతమైన వెలుగు కనపడడం లేదని పలువురు రాజ్యసభ సభ్యులు వాపోయారు.

'1942 నుంచి 1947 వరకు స్వాతంత్ర్యానికి దారితీసిన కాలం అత్యంత కీలకమైనది. ఇప్పుడు కూడా రాబోయే అయిదు సంవత్సరాలు అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో పార్లమెంటరీ ప్రమాణాలు నెలకొల్పడం, రాజకీయనాయకులు, రాజకీయాల పట్ల ప్రజలకు సదభిప్రాయం కలిగేలా చూడడం అవసరం..' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ముందు జరిగిన ఎన్డీఏ సన్నాహక సమావేశంలో చెప్పారు. ప్రధానమంత్రికీ, వెంకయ్యనాయుడుకూ మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలు, అభిప్రాయాల సారూప్యత అందరికీ తెలిసిందే. ప్రధానికీ, ఉపరాష్ట్రపతికీ మధ్య సంబంధాలు ఎలా ఉండాలన్న విషయంలో గతంలో నెహ్రూకు, రాధాకృష్ణన్‌కూ ఉన్న సంబంధాలు చరిత్రలో దృష్టాంతంగా నిలిచిపోయాయి. ఆ పూర్వ వైభవం మళ్లీ వస్తే రాజ్యాంగ వ్యవస్థలు మరింత బలోపేతం అవుతాయనడంలో సందేహం లేదు.

■ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్
కేంద్రీయ హిందీ సమితి సభ్యులు

తెలుగుతేజం, రాజకీయం

■ తెలకపల్లి రవి




గమనం

చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా పాట కమ్యూనిస్టులు సృష్టిస్తే ఎన్టీఆర్‌కు బాగా అక్కరకు వచ్చిందని అధికారానికి తెచ్చిందని పత్రికా వర్గాల్లో పెద్దలు అంటుంటారు. చరిత్ర ఒక్కో దశలో ఒక మాట ఒక మనిషి ఒక ప్రత్యేక ప్రచారం ప్రాధాన్యత పొందుతుంటారు. 'జో జీతా వొహీ సికిందర్' అన్నట్టు తెలుగువారి ఆత్మ గౌరవం ఎన్టీఆర్ తోనే మొదలైందని ఒక ప్రచారం. ఆరెస్సెస్–బీజేపీ ముద్దుబిడ్డ(నిన్నటి వరకూ అంటున్నారు) వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి పీఠం అధిష్టిస్తున్న సమయంలో తెలుగుతేజం పదం మరోసారి పతాక శీర్షికలకెక్కింది. పెద్ద పదవి, పేరున్న నాయకుడు గనక అది సహజమే. రాజకీయ పోటీలు తేడాలు ఎలా వున్నా విజయం సాధించి పదవి స్వీకరించబోతున్నందుకు ఆయనకు అభినందనలు. వ్యతిరేకులపై దాడి చేయడంలో ఆరితేరిన వెంకయ్య ఇక నోటికి తాళం వేసుకుని సూక్తులు సుశబ్దాలకే పరిమితం కావడం కష్టమైన పరీక్షే. కాని మోదీ శాసనం అది. ఆయనే చెప్పినట్టు నాలుగు రాజ్యాంగ పదవుల్లోనూ సంఘీయులే ఆసీనులైన ఇలాటి సన్నివేశం గతంలో లేదు. దీని పర్యవసానాలు ఎలా వుంటాయో చూడాలి. సరిగానే వుండాలని కోరుకోవాలి. అంటే భిన్నాభిప్రాయాన్ని సహించలేకపోతే అది ప్రజాస్వామ్యం గాక నిరంకుశత్వం అవుతుందని (వెంకయ్యకు ముందు) దిగిపోతున్న ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ ఆఖరి ప్రసంగంలో చెప్పిన మాట ఆయనకూ తెలుగు చంద్రులకూ ఒక హెచ్చరిక కావాలి.

ఏమైనా ఇప్పుడు మన చర్చ అది కాదు. చరిత్రలో మొదటి సారి తెలుగుతేజం ఇప్పుడే జాతీయ ప్రభావం చూపినట్టు కొందరు చేస్తున్న హంగామా. ఈ అత్యుత్సాహంలో కొందరైతే తెలుగువారు ఉపరాష్ట్రపతి కావడం ఇదే మొదటి సారి అని ప్రచారం లంకించుకుని తర్వాత సవరించుకున్నారు. సరిహద్దులు ఎలావున్నా రాధాకృష్ణన్, వి.వి.గిరిలను తెలుగు వారి కింద లెక్కేసేవారు. నీలం సంజీవ రెడ్డి సరే రాష్ట్రపతిగానే వున్నారు. ప్రధాని పదవి చేపట్టిన పివి నరసింహారావు సరేసరి. కనుక తెలుగుతేజం గురించి ఎక్కువగా మాట్లాడేప్పుడు చరిత్రను గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడు తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లను కూడా గమనంలో వుంచుకోవాలి. నటుడుగా ఎన్టీఆర్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయన డైలాగులు యథాతథంగా చెప్పేవాణ్ని. రాజకీయాల్లోకి వచ్చి సంచలనం సృష్టించడం, తర్వాత పరిణామాలు అన్నీ ప్రత్యక్షంగా చూస్తూ వచ్చిన వాణ్ని. అయితే తెలుగుదనం ఎన్టీఆర్‌తోనే మొదలైందంటే ఎలా కుదురుతుంది? రేపు అమరావతిలో అంబేడ్కర్‌లాగే ఆయన విగ్రహం పెడతారన్న మాటలు వినిపిస్తుంటాయి. మరి ఆంధ్రకేసరి ప్రకాశం ఏమైపోయేట్టు? ఇంకా చాలామంది సంస్కర్తలు స్వాతంత్ర్య యోధులు ఎక్కడికిపోయేట్టు? వారంతా తెలుగు తేజాలు కారా?

అసలు తెలుగుదేశంతోనే తెలుగువారి గురించి తెలిసిందనే వారు నలభై యాభై దశకాలలో కమ్యూనిస్టుపార్టీ దేశంలోనే సంచలనం కలిగించిన చరిత్ర దాటేస్తుంటారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య వ్యవస్థను నిజాం నిరంకుశత్వాన్ని కదిలించివేసిన కథలు మర్చిపోతుంటారు. కొన్ని ప్రత్యేక కారణాలు, వ్యతిరేక ప్రచారాలు లేకుంటే పుచ్చలపల్లి సుందరయ్య దేశంలోనే మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి కావడానికి పూర్తి అవకాశముండింది. తర్వాతైనా కావాలంటే చాలా పదవులే తీసుకోగలిగేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల సారథులుగా సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావులు జాతీయంగా గొప్ప పాత్రే పోషించారు. ఇక ఇంతకుముందు చెప్పుకున్న నీలం సంజీవ రెడ్డి కాంగ్రెస్‌వాదిగానూ తర్వాత జనతా పార్టీ పక్షాన గెలిచిన ఒకే ఒక ఎంపి



మోదీ రాజ్యంలో వెంకయ్యకు వచ్చిన స్థానం ఎవరెలా చూస్తారు ఎలా చెప్పుకుంటారనేది వారి ఇష్టం గానీ తెలుగుతేజం ఇప్పుడే పరిఢవిల్లినట్టు పరవశ ప్రసార ప్రచురణలు చేయడం ప్రహసనమే. గతంలో రాష్ట్రపతులు ప్రధానులు కూడా చేసిన తెలుగు వారిని మర్చిపోవడం అవాస్తవికత, అచారిత్రకత కూడా.

గానూ ఎంత ప్రభావం చూపించారు? తెలంగాణ రాష్ట్రావతరణకు కేసీఆర్ సూత్రధారి కావచ్చు గాని అంతకుముందు రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, చిర్రావూరి లక్ష్మీనరసయ్య, ఆరుట్ల దంపతులు, మగ్దుం వంటి వారంతా నిర్వహించిన పాత్ర మర్చిపోదామా? కెవి రంగారెడ్డి, జమలాపురం కేశవరావు, రామానంద తీర్థ వంటివారు తక్కువా? తరిమెల నాగిరెడ్డి, గౌతు లచ్చన్న, కాసు బ్రహ్మానందరెడ్డి, కొత్త రఘురామయ్య, విబిరాజు, మర్రి చెన్నారెడ్డి, వంటివారు లేరా? వెంకయ్యకు సమకాలికుడుగా సమవుజ్జీగా జైపాల్‌రెడ్డి వంటివారి సంగతేమిటి? ఎన్టీఆర్ ప్రాంతీయ పార్టీకి చెందిన జాతీయ నాయకుడని తాను జాతీయ పార్టీకి చెందిన ప్రాంతీయ నాయకుడినని జైపాల్ అన్నమాట నాకెప్పుడూ గుర్తుకు వస్తుంటుంది. తేడాపాడాలు ఎన్ని వున్నా తమ తమ రాజకీయాల మేరకు చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్, తెలంగాణ సాధన సారథిగాగా కేసీఆర్‌లు నిర్వహించిన పాత్ర తక్కువదేమీ కాదు. పైగా వీరిలో చాలామంది ఎంతోకొంత లౌకిక రాజకీయాల మార్గంలో పనిచేయగా స్వతహాగానే వెంకయ్య ఆరెస్సెస్ బాట తొక్కారు. వారిలా రాజనీతిజ్ఞుడిగా కంటే సంఘ విధేయతనే గర్వంగా చెప్పుకుంటున్నారు. రాజకీయ రంగంలోని ఇంకా చాలామంది పేర్లనూ రాజకీయేతర దిగ్గజాలనూ నేను ప్రస్తావించడం లేదు.

వెంకయ్య ఉపరాష్ట్రపతి పదవిలోకి వెళ్లడంతో కేంద్రంలో తెలుగువారికి పెద్ద దిక్కులేకుండా పోయిందనే మాట అన్నిటికన్నా పెద్ద అవాస్తవం. విభజన సమయంలో తానే పదేపదే పట్టుబట్టి సాధించానని చెప్పుకుని ఎన్నికల ప్రణాళికలోనూ వేసుకున్న ప్రత్యేక హోదాను మోదీ ప్రభుత్వం ఆదిలోనే సమాధి చేసినా వెంకయ్య ఏమీ చేయలేకపోయారు.

నేతగా వక్తగా వెంకయ్యను తక్కువ చేయనవసరం లేదు. కానీ జాతులు రాష్ట్రాలు భాషలు ప్రజా సముదాయాలకు కొందరు వ్యక్తులనే ఏకైక ప్రతీకలుగా ప్రతిపాదించేప్పుడు సమగ్ర దృష్టి వుండాలి. కేసీఆర్‌నో చంద్రబాబునో గౌరవించడం వేరు, అసలు తెలంగాణ అంటే ఆయనే ఏపీ అంటే ఈయనే వారి కొనసాగింపుగా లోకేశ్‌లు కేటీఆర్‌లు అనడం వేరు. ప్రతిపక్ష నేతగా జగన్ పాత్రను మన్నించడం, వారి నాన్న వైఎస్‌ను గుర్తుంచుకోవడం వేరు. రాష్ట్రం అంటేనే వైఎస్ పాలించిన స్వర్ణయుగమని కీర్తనలాలపించడం వేరు. ప్రాంతీయ పార్టీలలో కుటుంబాల వారసత్వాలు సహజమై వుండొచ్చు గాని అది వారి పార్టీల కోణం.

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వీడ్కోలు చెబుతూ ఆర్థిక మంత్రి ఆయన సహాధ్యాయి సైద్ధాంతిక ప్రత్యర్థి అరుణ్‌జైట్లీ అన్నమాట ఆసక్తికరం. ఏచూరి వల్ల సభలో చర్చల స్థాయి పెరిగిందని జైట్లీ చెప్పారు. ఏచూరి ఎప్పుడూ అధికారంలో లేరు గనక ఆదర్శదృష్టితో ఆచరణ సాధ్యం కానివి చెబుతుంటారు. ఆయన ఒక్కసారైనా అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాను అన్నారు జైట్లీ. ఇందులో చమత్కారంతో పాటు ఒకింత ప్రశంసా భావం కూడా గమనించవచ్చు. చరిత్ర విజేతల ఖడ్గంతో రచించబడుతుందన్న సూత్రం ప్రకారం అధికార పదవులు నిర్వహించిన వారే తేజోమూర్తులైనట్టు అతిశయోక్తులు చెబుతూ మిగిలిన వారంతా అప్రముఖులైనట్టు చిత్రించడం తప్పవుతుంది. మోదీ రాజ్యంలో వెంకయ్యకు వచ్చిన స్థానం ఎవరెలా చూస్తారు ఎలా చెప్పుకుంటారనేది వారి ఇష్టం గానీ తెలుగుతేజం ఇప్పుడే పరిఢవిల్లినట్టు పరవశ ప్రసార ప్రచురణలు చేయడం ప్రహసనమే. గతంలో రాష్ట్రపతులు ప్రధానులు కూడా చేసిన తెలుగు వారిని మర్చిపోవడం అవాస్తవికత, అచారిత్రకత కూడా. కేంద్రంలో నెహ్రూ పేరును, చరిత్ర పుస్తకాలలో మొగలాయీల కాలాన్ని తొలగించినంత మాత్రాన గతాన్ని ఎవరూ మార్చలేరు. భవితనూ శాసించలేరు. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్‌లుగా మారిన తెలుగువారి సుదీర్ఘ చరిత్ర పట్ల ఒక తులనాత్మక అధ్యయనం జరగాలి. చరిత్ర సుదీర్ఘమైంది. రాజకీయం బహుముఖీనమైంది. పరిణామ క్రమం నిరంతరాయమైంది. ఎవరికి ఇవ్వాల్సిన గౌరవం వారికి ఇవ్వాలి. మనం ఒప్పుకున్నా చెప్పకున్నా చరిత్ర ముందో వెనకో ఎవరి స్థానం వారికిస్తుంది. ■




ఘనంగా పరిటాల శ్రీరాం నిశ్చితార్థం

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరాం నిశ్చితార్థం, ఆలం జ్ఞానవితో గురువారం హైదరాబాద్‌లోని మాదాపూర్ ఎన్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ నిశ్చితార్థానికి స్పీకర్ కోడెల, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాల కృష్ణ, మంత్రులు దేవినేని, కాల్వ, కామినేని, పలువురు టీటీడీపీ నాయకులు హాజరయ్యారు.

శ్రీవారి సేవలో స్పీకర్ కోడెల

తిరుమల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద రావు గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ప్రారంభ సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్న ఆయనకు ఆలయంలో వేదపండితులు ఆశీర్వాదం పలుకగా... జేఈవో పోలా భాస్కర్ తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు.


బలిపీఠానికి మొక్కుతున్న కోడెల

నేడు, రేపు మెడికల్ రెండోవిడత కౌన్సెలింగ్

విజయవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయంలో 11, 12 తేదీల్లో బీ, సీ కేటగిరి మెడికల్ సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్ జరగనుంది. వెబ్‌సైట్‌లో కౌన్సెలింగ్ వివరాలను ఉంచారు.

డబ్బంటే చేదా?

కేంద్ర నిధుల సాధనలో అలసత్వం.. పైసా తెచ్చుకోని పది శాఖలు

- అధ్వానంగా ఐటీ, హోం, పరిశ్రమలు
- వైద్య శాఖకు తీవ్ర నిర్లక్ష్యం జబ్బు
- ఒక్క అడుగూ వేయని రవాణా
- 40,630 కోట్లలో వచ్చింది 18 కోట్లు
- సీఎం చెబుతున్నా పట్టించుకోని వైనం

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): "విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. వనరులు పరిమితం. అవసరాలు అనంతం. నిధులకు సంబంధించి ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోవద్దు. కేంద్రం నుంచి సాధ్యమైనన్ని నిధులను రాబట్టుకోవాలి" అని సీఎం చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. కానీ అనేక శాఖలు ఆ మాటలను పెడచెవిన పెట్టాయి. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (జూలై 4 వరకు) 10 ప్రభుత్వ శాఖలకు ఒక్క రూపాయి కూడా కేంద్రం నుంచి రాలేదు రాష్ట్రాభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర సాయం (సీఏఎస్‌పీ), కేంద్ర పథకాల (సీఎస్ఎస్) కింద రాష్ట్ర ప్రభుత్వంలోని 26 శాఖలకు వచ్చిన నిధులపై ఆర్థికశాఖ మదించినప్పుడు ఈ నిర్లక్ష్యం బయటపడింది. తొలి త్రైమాసికంలో రాష్ట్రానికి వచ్చిన నిధులు రూ.4138 కోట్లుగా లెక్క తేలింది. కేంద్రం ఈ ఏడాదికి దేశవ్యాప్తంగా ఆయా పథకాలకు కేటాయించిన మొత్తం రూ.3,32,391 కోట్లు. మన రాష్ట్రానికి 16,169 కోట్లు రావొచ్చునని అంచనా వేస్తున్నారు.

లక్ష్యం గాలికి...

2016-17లో సీఏఎస్‌పీ కింద రాష్ట్రానికి 12,390 కోట్లు వచ్చాయి. 2017-18లో ఏకంగా 27,702 కోట్లను కేంద్రం నుంచి తెచ్చుకోవాలని ప్రభుత్వం బడ్జెట్‌లో చూపింది. దీనికో బలమైన కారణం ఉంది. తొలి ఏడాది రెవెన్యూ లోటు గ్రాంటుతో సహా అనేక హామీలు అటకెక్కాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆర్థిక వనరులు అసాధారణంగా పెరిగే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో.. వివిధ పథకాలకోసం కేంద్రం కేటాయించే నిధులే పెద్ద దిక్కు. ఉపాధి హామీ పథకం కింద నిధులను తెచ్చుకోగలుగుతున్న రాష్ట్రం... మిగిలిన శాఖల పథకాలకు ఎందుకు తెచ్చుకోలేమని సమీక్షించుకుంది. 2017-18 బడ్జెట్‌కు ముందు శాఖాధిపతులు, మంత్రులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహించి మరీ కేంద్ర పథకాలపై దృష్టి సారించారు. లక్ష్యాలను ఘనంగా నిర్దేశించుకున్నా ఆచరణలో చతికిలబడ్డాయి. తొలి 95 రోజుల్లో 4138 కోట్లు (వార్షిక లక్ష్యంలో 15.15 శాతం) మాత్రమే రాష్ట్రానికి వచ్చాయి. . కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తానికి వివిధ పథకాలకు కేటాయించిన రూ. 3.23 లక్షల కోట్లలో 8.6 శాతం నిధులు తెచ్చుకోవాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు... ఐదు శాతం వచ్చినా చాలని ఇప్పుడు అనుకుంటోంది.

శాఖలు... నిధుల సంగతులు...

కేంద్రంనుంచి ఒక్క రూపాయి కూడా తెచ్చుకోని వాటిలో... సాంకేతిక విద్య, హోం, పౌరసరఫరాలు, పరిశ్రమలు, ఐటీ, న్యాయ, మైనారిటీ సంక్షేమం, ప్లానింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, పర్యాటక శాఖలున్నాయి. రవాణా - ఆర్ అండ్ బీ శాఖలు 0.04 శాతం, కార్మిక-ఉపాధి కల్పనా శాఖ 0.02 శాతం, వైద్య ఆరోగ్య శాఖ 0.14 శాతం, పర్యావరణ-అటవీ-సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ 0.20 శాతం మాత్రమే తెచ్చుకొని జీరో శాఖలతో పోటీ పడ్డాయి. మొత్తంగా 26 శాఖల్లో 14 శాఖలు కేంద్ర నిధులను పొందడంలో దారుణమైన అలసత్వం ప్రదర్శించాయి. కేంద్రం కేటాయించిన మొత్తం నిధుల్లో 8.6 శాతాన్ని ఏడాది మొత్తంలో తెచ్చుకోవాలనుకుంటే... తొలి 95 రోజుల్లో కనీసం 2.2 శాతం తెచ్చుకొని ఉండాలి. రెవెన్యూ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖలు మినహా మరెవ్వరూ ఈమేరకు నిధులను తెచ్చుకోలేదు.



ఈ శాఖలకు నిర్లక్ష్యపు జబ్బు!

కేంద్రం అత్యధికంగా పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి రంగానికి నిధులు కేటాయించింది. గ్రామీణాభివృద్ధి పథకాలకు రూ.1,06,234 కోట్లను 2017-18 బడ్జెట్‌లో కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వ పీఆర్-ఆర్డీ శాఖ తొలి 95 రోజుల్లో 1,513 కోట్లు (1.42 శాతం) తెచ్చుకోగలిగింది. గ్రామీణాభివృద్ధి తర్వాత ఎక్కువ బడ్జెట్ కేటాయింపులున్నది రవాణా- రోడ్లు-భవనాలు (40,629 కోట్లు), పాఠశాల విద్య (38,376 కోట్లు), వైద్య-ఆరోగ్యం(30,131 కోట్లు), హౌసింగ్ (29,043 కోట్లు), మహిళా-శిశు సంక్షేమ(19,496 కోట్లు) శాఖలకు! ఇందులో రవాణా- రోడ్లు - భవనాల శాఖ, వైద్య-ఆరోగ్య శాఖల తీరు అధ్వానం. 40 వేల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో రవాణా-రోడ్లు-భవనాలశాఖ తెచ్చుకున్నది కేవలం 17.97 కోట్లు. వైద్య-ఆరోగ్య విభాగాలకు ఉన్న కేంద్ర బడ్జెట్ 30,131 కోట్లలో రాష్ట్ర శాఖ తెచ్చుకున్నది రూ. 42.92 కోట్లు మాత్రమే. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ పరిధిలోని పథకాలకు కేంద్రం రూ. 1673 కోట్లు కేటాయించగా రాష్ట్ర శాఖ ఒక్క రూపాయి కూడా తెచ్చుకోలేదు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై మాటలేగాని ఆచరణలో చొరవ కనిపించడంలేదు. కేంద్ర బడ్జెట్‌లో 2,924 కోట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తెచ్చుకున్నది 'సున్నా'. టూరిజం శాఖ 1,721 కోట్ల కేటాయింపుల్లో, పరిశ్రమల శాఖ 894 కోట్లలో, న్యాయ శాఖ 629 కోట్లలో రూపాయి కూడా తెచ్చుకోలేదు.

సుబాబుల్ రైతుల కొంపముంచే జీవో

- గుట్టుచప్పుడుకాకుండా జీవో నెం 493 విడుదల
- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

కంచికచర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుబాబుల్ కొనుగోళ్లలో ప్రైవేట్ వ్యాపారులకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా జారీచేసిన జీవోపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. జీవో నెంబరు 493 ద్వారా సుబాబుల్, యూకలిప్టస్ సర్వీ కొనుగోళ్లకు పేపరు మిల్లులతో పాటు ప్రైవేట్ వ్యాపారులకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గత ఏడాది ప్రారంభంలో జిల్లాకొక ధర నిర్ణయించుకునే విధంగా ప్రభుత్వం జారీచేసిన 143 జీవోతో రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ జీఓను అడ్డం పెట్టుకుని పేపరుమిల్లులు దోచుకోవటం ప్రారంభించాయి. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తక్కువ ధరకు కొంటున్న మిల్లులు, కృష్ణా జిల్లాలో కూడా ధర తగ్గించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పేపరు మిల్లులకు అదనంగా సుబాబుల్ కర్ర కొనుగోళ్లకు ప్రైవేట్ వ్యాపారులకు అనుమతి ఇవ్వటం దారుణమని రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. దళారుల పేరుతో తక్కువ ధరకు కర్ర తీసుకుంటూ, రైతులను దోచుకునేందుకు పేపరు మిల్లులు కుయుక్తులు పన్నుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించిన సంగతి విదితమే. జీవో జారీ చేసిన విషయం తెలిసిన వెంటనే మంత్రి దేవినేని ఉమా మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేసి రైతుల పరిస్థితి వివరించి, జీవోను నిలిపివేయాలని కోరినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు.

2018కి 'పోలవరం' అసాధ్యం: ఉండవల్లి, దగ్గుపాటి

పోలవరం, ఆగస్టు 10 : పోలవరం ప్రాజెక్టు 2018 నాటికి పూర్తవడం అసాధ్యమని మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, దగ్గుపాటి వెంకటేశ్వరరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలంలో చేపట్టిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. ప్రాజెక్టు అంచనాలను ప్రతి సంవత్సరం పెంచడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

మోదీతో కృష్ణంరాజు దంపతుల భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతో సినీనటుడు, మాజీ ఎంపీ కృష్ణంరాజు గురువారం పార్లమెంటులో భేటీ అయ్యారు. పార్లమెంటు సమావేశాల అనంతరం గవర్నర్ల నియామకం ఉంటుందన్న ఊహాగానాల నడుమ.. మోదీతో కృష్ణంరాజు దంపతుల భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే తాము కేవలం మర్యాదపూర్వకంగానే కలిశామని కృష్ణంరాజు తెలిపారు.

ఏడీసీ సీఎండీ జీతభత్యాల ఖరారు

రాజధాని నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)కి సీఎండీగా వ్యవహరిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారిణి డి.లక్ష్మీ పార్థసారథికి చెల్లించాల్సిన జీతభత్యాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు నెలవారీ వేతనంగా రూ.2 లక్షలు (ఫిక్స్‌డ్) ఇవ్వాలని, ఇవి కాకుండా డీఏ, హెచ్‌ఆర్‌ఏల రూపేణా సుమారు రూ.25,000 లను చెల్లించాలని పేర్కొంది. ఇవి కాకుండా ఆ పోస్టుకు వర్తించే ఇతర అన్ని రకాల అలవెన్స్‌లను పొందేందుకు కూడా ఆమె అర్హురాలని స్పష్టంచేసింది. ఈ ఉత్తర్వులు గత ఏడాది జనవరి, 20వ తేదీనుంచి అమలులోకి వస్తాయని వెల్లడించింది.

'ఆక్వాలో యాంటీ బయోటిక్స్‌ను నివారించండి'

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో తన కార్యాలయంలో ఆక్వా రంగంపై ఉన్నతాధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాంటీ బయోటిక్స్ వినియోగంపై ఆక్వా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వీటి వినియోగం తగ్గించడం వల్ల ఆక్వా ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ పెరుగుతుందని చెప్పారు.

48 వార్డులు.. 480 నామినేషన్లు

- కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల ఘట్టం

కాకినాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కాకినాడ నగరపాలక సంస్థకు ఈనెల 29న జరగనున్న ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం గురువారం ముగిసింది. 48 వార్డులకు మొత్తం 480 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16 చివరి తేదీ. 29వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబరు 1న ఓట్ల లెక్కింపు జరిపి అదే రోజు ఫలితాలు విడుదల చేస్తారు. టీడీపీ, వైసీపీ మధ్య ప్రధానంగా పోరు సాగనుంది. బీజేపీ, ఇండిపెండెంట్లు, కాంగ్రెస్, బీఎస్పీల నుంచి కూడా నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ తమ పార్టీ నుంచి కాపులను మేయర్ అభ్యర్థిగా ప్రకటించగా, వైసీపీ మాత్రం ఇంకా ఎవరినీ ప్రకటించలేదు.

దళిత కుటుంబాన్ని సత్కరించిన ఎమ్మెల్యే



పిడుగురాళ్ల, ఆగస్టు 10: టీడీపీకి చెందిన దళిత కుటుంబాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సత్కరించారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువుకు చెందిన గాలి మాణిక్యరావు, రోశమ్మ, వారి కుమార్తెలు ఆదిలక్ష్మి, పేరమ్మలకు గుంటూరులోని తన నివాసంలో గురువారం ప్రత్యేక విందుతో ఆతిథ్యమిచ్చారు. గర్భంతో ఉన్నా పేరమ్మ కుటుంబంతో సహా జనచైతన్య యాత్రలో పాల్గొని పార్టీ జెండా మోసినందుకు ఆత్మీయంగా ఇంటికి పిలిచి భోజనం పెట్టారు. రూ.50వేల నగదు, నూతన వస్త్రాలను అందించారు.

అసౌకర్యాల ఆస్పత్రి



జియ్యమ్మవలస, ఆగస్టు 10: విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం చినమేరంగి సామాజిక ఆరోగ్యకేంద్రంలో అసౌకర్యాలు తిష్ట వేశాయి. ఇక్కడ రోజుకు 200 మంది వరకు రోగులు వస్తున్నా అవసరమైన మంచాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. పేరుకే 30పడకలు అయినా కేవలం 10పడకలే ఉన్నాయి. దీంతో సిలైన్ ఎక్కించాలంటే రోగిని నిలబెట్టి వారి బంధువు ఆ బాటిల్‌ను పట్టుకోవాల్సిందే.

బండెక్కిన సోమిరెడ్డి



కర్నూలులో ఉర్దూ అకాడమీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ ఇంటికి వెళ్దామనుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. మంత్రి ఎస్‌బీఐ కాలనీలో వస్తుండగా టెక్కె సెంటర్‌లో రోడ్ల విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహనాలను నిలిపి వేశారు. దీంతో మోటార్ బైక్‌పై లిఫ్ట్ అడిగి.. నౌమాన్ ఇంటికి వెళ్లారు.

మూడేళ్లుగా సాగర్ ఘోష



నీరు లేని అద్దంకి బ్రాంచ్ కాలువ

- ఉరకలెత్తాల్సిన కృష్ణమ్మ వెలవెల
- వట్టిపోయిన నాగార్జునసాగర్
- శ్రీశైలంలో చుక్క ప్రవాహం లేదు
- అయోమయంలో సాగర్ ఆయకట్టు
- వరుసగా మూడోఏడాదీ ఖరీఫ్‌కు కష్టం

నరసరావుపేట/ఒంగోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉరకలెత్తి పరవళ్లు తొక్కే సమయం.. రాష్ట్రంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న జలాశయాలన్నీ నిండు కుండలను తలపిస్తూ కళకళలాడాల్సిన వేళ.. ఎక్కడా నీటి గలగలల జాడే లేదు. ఎగువన వచ్చిన వరదను వచ్చినట్టే ఒడిసిపట్టేసుకుంటున్న కర్ణాటక.. కాస్త నీరు వదిలితే చాలు తోడేసుకుంటున్న తెలంగాణ.. శ్రీశైలం చుట్టపక్కల కూడా చుక్క వాన పడని వైనం.. వెరసి.. శ్రీశైలంతో పాటు నాగార్జునసాగర్ కూడా వట్టిపోయాయి. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే సాగర్ ఆయకట్టు పరిధిలో ఈ ఖరీఫ్‌లో సాగు క్లిష్టంగానే ఉంది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 11.19 లక్షల ఎకరాల్లో సాగు సందిగ్ధంలో పడింది. లక్షలాది మంది రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరుసగా మూడో ఏడాది కూడా సాగు నీటి కరువు నెలకొనడంతో ఆయకట్టు ప్రాంతంలో ప్రమాదకర ఘంటికలు మోగుతున్నాయి. ఇంకోవైపు.. నిరుటి కంటే ఈసారి సాగర్, శ్రీశైలం జలాశయాల్లో అతి తక్కువ నీటి నిల్వలున్నాయి. దాదాపు అడుగంటాయి. సాగర్ జలాశయంలో నీటిమట్టం 500 అడుగులకు పడిపోయింది.

కుడికాలువే దిక్కు..

గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పంటల సాగుకు సాగర్ కుడి కాలువ నుంచి విడుదలయ్యే నీరే ప్రధాన ఆధారం. గత రెండు ఖరీఫ్‌లలో నీరులేక రైతులు ఇరు జిల్లాల్లో పంటల సాగు కోల్పోయారు. ఈ ఏడాదైనా జలాశయాలు నిండుతాయని, పంటలు పండుతాయన్న కొండంత ఆశపెట్టుకున్నారు. ఎగువనే గాక దిగువన కూడా కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవకపోవడంతో వారి ఆశలు గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం జలాశయంలో నీటినిల్వ 19.47 టీఎంసీలకు పడిపోయింది. గత పదేళ్లలో ఇంతటి దారుణ పరిస్థితి ఇక్కడ లేదు. శ్రీశైలం నిండితేనే సాగర్‌కు నీరు విడుదల చేసే అవకాశం ఉంటుంది. జూలై ముగిసి.. ఆగస్టు తొలివారం కూడా గడచినా వరుణుడు కరుణించక కృష్ణా పరివాహక ప్రాంతంలో వరదలకు ఆస్కారం లేకుండాపోయింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఖరీఫ్‌లో మొత్తం సాగు విస్తీర్ణం 11.13 లక్షలు కాగా.. 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యేది. రెండేళ్లుగా వరిసాగు నిలిచి పోయింది. ఈ ఏడాదీ జలాశయాల్లో నీరు లేకపోవడంతో భవిష్యత్‌లో మాగాణిలో వరిసాగు అసాధ్యమని రైతులు దాదాపు నిర్ణయానికి వచ్చారు. అందుకే గత ఖరీఫ్ నుంచే ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారించారు. మిర్చి, కంది, మొక్కజొన్న, శనగ, జనుము, పెసరలను సాగు చేశారు. ఖరీఫ్ ఆరంభంలో కురిసిన వర్షాలు వాటి సాగుకు దోహదపడ్డాయి. అనంతరం తగు వర్షాలు లేక సరైన దిగుబడులు రాక నష్టపోయారు. ఈ సారి వరి పొలాల్లో కంది, మినుము, పెసర, పసుపు వేస్తున్నారు. వర్షాలు కురవకపోతే ఈ సారీ దెబ్బతినే ప్రమాదం ఉంది.

సాగర్ కుడి కాలువ కింద ఆయకట్టు
మొత్తం విస్తీర్ణం: 11.13 లక్షల ఎకరాలు
మెట్ట విస్తీర్ణం: 4.20 లక్షలు
మాగాణి విస్తీర్ణం: 6.97 లక్షలు
గుంటూరు జిల్లాలో ఆయకట్టు: 6.71 లక్షలు
ప్రకాశం జిల్లాలో ఆయకట్టు: 4.42 లక్షలు

జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీలలో)

జలాశయం	నీటి నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నీటి నిల్వ
ఆలమట్టి	129.72	128.19
నారాయణపూర్	37.65	37.04
జూరాల	9.66	5.46
తుంగభద్ర	100.86	41.31
శ్రీశైలం	215.81	19.47
నాగార్జునసాగర్	312.05	116.26

మాగాణి నేలలో మెట్టపైర్లు



గత రెండేళ్ల నుంచి సాగర్ కాలువలకు నీరు రాక మాగాణి భూమిలో మెట్ట పైర్లు సాగు చేస్తున్నాం. ఈ ఏడాది అవి కూడా ఆశాజనకంగా లేవు. సకాలంలో వర్షాలు పడక మొలక శాతం కూడా చాలా తక్కువగా వచ్చింది.

– చల్లగుండ్ల సుబ్బారావు, రైతు, కొత్తపాలెం

వ్యవసాయం అంటేనే భయమేస్తుంది



సాగర్ నీరు రాకపోవడంతో వ్యవసాయ పంటలు సాగు చేపట్టాలంటేనే భయమేస్తుంది. ఇప్పటికే రెండు ఎకరాల్లో జనుము చేయగా వర్షాలు లేక విత్తనాలు మొలవలేదు. వర్షం కోసం ఎదురు చూస్తున్నాం.

–దద్దాల మోహన్‌రావు, రైతు, అంబడిపూడి

నంది అవార్డుల ఎంపికకు కమిటీలు

న్యూఢిల్లీ/అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సినిమా, టీవీ రంగాల్లో నంది అవార్డుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడు కమిటీలను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2014, 2015, 2016 సంవత్సరాలకుగాను వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర సినిమా, టీవీ, థియేటర్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అంబికా కృష్ణ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2011, 2012కు సంబంధించి సినిమాలను ఎంపిక చేసినా, అవార్డులు ఇవ్వలేదన్నారు. ఐదేళ్ల అవార్డులను ఒకేసారి ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. నంది అవార్డులను ప్రారంభించి 50 ఏళ్లు అవుతోందని, ఈ సందర్భాన్ని కూడా ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. గతంలో ప్రకటించిన అవార్డులను తెలంగాణ ప్రభుత్వం అందించకున్నా, తమ ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. 2014, 2015, 2016 సంవత్సరాలకు రఘుపతి వెంకయ్య, ఎన్టీఆర్ జాతీయ అవార్డు, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి జాతీయ అవార్డులనూ అందజేస్తామన్నారు. ఆయా కమిటీల వివరాలను అంబికా కృష్ణ వెల్లడించారు. 2014 అవార్డుల ఎంపిక కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నటుడు గిరిబాబు వ్యవహరిస్తారు. 2015 కమిటీకి జీవితా రాజశేఖర్, 2016 కమిటీకి పోకూరి బాబూరావు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. రఘుపతి వెంకయ్య, ఎన్టీఆర్ జాతీయ అవార్డు, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి జాతీయ అవార్డులకు ప్రముఖ నటుడు బాలకృష్ణ నేతృత్వంలో కమిటీలను నియమించారు.

బడికెక్కిన కిక్కు!

(మూడో పేజీ తరవాయి)

జరిగిన ఘర్షణ... ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. ఆ బడికి మంత్రి గంటా శ్రీనివాసరావు వెళ్లారు. "కొన్ని పాఠశాలల్లో మత్తు మందుల వినియోగం జరుగుతున్నట్లు తెలిసింది. విద్యార్థులపై ఒక కన్నేసి ఉంచండి" అని ఉపాధ్యాయులకు సూచించారు. పేద, బలహీన వర్గాల వారు ఎక్కువగా వెళ్లే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఈ మహమ్మారి వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మత్తు ప్రభావంతో విద్యార్థులు అదుపు తప్పి ప్రవర్తిస్తున్నారని, విద్యార్థినులను వేధిస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మిగిలిన వారి కంటే ప్రత్యేకంగా ఉండాలనే ఉద్దేశంతో రౌడీల్లా వ్యవహరిస్తున్నారని కూడా తెలిపారు.

ఇల్లూ వాకిలి లేకుండా తిరిగే వాళ్లు, అల్లరి చిల్లరగా వీధి బాలలు, మరికొందరు ఏ రైల్వే ఫ్లై ఓవర్ కిందో, నిర్జన ప్రదేశాల్లోనూ గుమికూడి గంజాయి, వైట్‌నర్ వంటివి పీలుస్తూ మత్తులో విహరించడం పాత సంగతే. కానీ... ఇప్పుడు బడిలో బుద్ధిగా చదువుకోవాల్సిన పిల్లల్లో కొందరు పెడదారి పట్టినట్లు వెల్లడైంది. స్టేషనరీ దుకాణంలో లభ్యమయ్యే వైట్‌నర్‌ను కొనుగోలు చేసి... దానిని చేతిపై వేసుకుని గట్టిగా వాసన పీల్చుతున్నారు. కొందరైతే ఏకంగా దానిని తాగేస్తున్నారు. మరికొందరు ఫెవికాల్‌ను నీళ్ల ప్యాకెట్‌లో కలిపి, బాగా కలిపి పీల్చుతున్నారు. గర్భిణుల నొప్పి నివారణకోసం వాడే ఫోర్ట్విన్ ఇంజక్షన్లు వాడే వారూ ఉన్నారు. ఇలాంటి కొన్ని సంఘటనలు ఉపాధ్యాయుల దృష్టికి కూడా వచ్చాయి. వారు ఆ విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి... వారి సమక్షంలోనే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇటీవల ఆరో తరగతి విద్యార్థి బడి నుంచి ఇంటికి రాగానే మగతగా కూర్చోవడాన్ని అతడి తల్లి గమనించింది. ఆమె గట్టిగా నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. ఆమె నేరుగా పాఠశాలకు వెళ్లి దీనిపై ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేసింది. ఇప్పుడు ఏకంగా మంత్రే ఈ సమస్యపై స్పందించడం, హెచ్చరికలు జారీ చేయడంతో ఉపాధ్యాయులు దీనిపై అప్రమత్తమవుతున్నారు.

తల్లిదండ్రులకు చెబుతున్నాం!

పిల్లల ప్రవర్తన ఇటీవల కాలంలో ఆందోళనకరంగా తయారైంది. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపించడం, ఇంట్లో వారికి సరైన వాతావరణం కల్పించకపోవడంతో దారితప్పుతున్నారు. కొంతమంది మత్తు మందుల వినియోగానికి అలవాటు పడుతున్నారు. తప్పును ఎత్తిచూపితే తట్టుకోలేక ఉపాధ్యాయులపై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రతి నెలా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తున్నాం.

– ఎం.వెంకటలక్ష్మణ, ప్రధానోపాధ్యాయుడు, అల్లిపురం జీవీఎంసీ హైస్కూల్

అయేషా కేసులో సిట్ చీఫ్‌గా శ్రీకాంత్

- హైకోర్టుకు తెలిపిన హోంశాఖ
- నమ్మకం లేదు.. సీబీఐకే అప్పగించాలి
- అయేషా తల్లిదండ్రుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



అయేషామీరా హత్య కేసు పునఃదర్యాప్తుకు ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు చీఫ్‌గా విశాఖ రేంజ్ డీఐజీ శ్రీకాంత్ నియమితులయ్యారు. మహిళా డీఎస్పీలు డి.హైమావతి, శ్రీలక్ష్మి, విజయవాడ నున్న ఇన్‌స్పెక్టర్ సహీరున్నీసా బేగంను సిట్‌లో సభ్యులుగా నియమించారు. అయేషా మీరాపై అత్యాచారం, హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న పి.సత్యంబాబును హైకోర్టు మార్చి 31న నిర్దోషిగా పేర్కొంటూ పోలీసులపై ఘాటైన విమర్శలు చేసింది. ఈ నేపథ్యంలో కేసును పునఃదర్యాప్తుకు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేస్తామని హోంశాఖ కొన్ని రోజుల క్రితం ప్రకటించింది. ఆ మేరకు సిట్‌లోని సభ్యుల వివరాలను ప్రకటించింది. ఈ సమాచారాన్ని హైకోర్టుకు వివరించింది. సిట్ సభ్యులు వెంటనే దర్యాప్తు బాధ్యతలు చేపట్టినట్లు తెలుపుతూ... అందుకు సంబంధించిన పత్రాలను కోర్టు పరిశీలనకు ఇచ్చింది. హోంశాఖ తరపు న్యాయవాది చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం... పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంతకుముందు ఇచ్చిన ఉత్తర్వుల్లో... ఈ కేసు పర్యవేక్షణాధికారిగా విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్ ఉంటారని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ హైకోర్టుకు సమర్పించిన నివేదికలో ఆయన పేరు లేదు. తమ కుమార్తె హత్యకేసు దర్యాప్తు తీరును హైకోర్టు పర్యవేక్షించాలని, లేదా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ అయేషా తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది.

బూజు తింటున్నాం!

కుళ్లిన పప్పు తెచ్చుకొంటున్నాం.. వాసనకొట్టే సరుకు కొంటున్నాం

- కలవరపెడుతున్న 'కల్తీ' కహానీ
- మంచివాటితో కలిపి సేల్
- ఫారెన్‌బ్రాండ్లతో అధికారులకు మస్కా
- బెజవాడలో ఐదేళ్లుగా ఆహారం విషం
- విజిలెన్స్ దాడులు.. వ్యాపారుల అరెస్టు

విజయవాడ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చెడిపోతే పారేస్తాం. ముక్కిపోతే అవతల పెట్టేస్తాం. కొంచెం దుర్వాసన వస్తే.. ముక్కులు మూసుకొంటాం. అయితే, మనం రోజూ ఇంటికి తెచ్చుకొంటున్న సరుకులు..ఇంతకన్నా ఘోరంగా ఉంటున్నాయంటే నమ్మగలమా? మన పిల్లలు తింటున్న కుర్‌కురేల్లోనూ కల్తీ కలుస్తుంటే, ఏమి చేయాలి! చెడిపోయిన, కుళ్లిపోయిన సరుకులను బయట రాష్ట్రాల నుంచి తీసుకురావడం..తాజావని కవరింగు ఇచ్చి.. వేర్వేరు బ్రాండ్ల పేరిట షాపులకు అంటగట్టేస్తున్న వైనం గురువారం బెజవాడలో విజిలెన్స్ తనిఖీల్లో బయటపడింది. ఖర్జూరంపై బూజు, దుర్వాసన వస్తున్న జీడిపప్పులు, రంగుమారిన అనాస పువ్వులు, సెవెన్ కింగ్స్ బ్రాండ్‌తో కుర్‌కురేలు, నెయ్యిలో సన్‌ఫ్లవర్ నూనెలను కొందరు వ్యాపారుల గోదాముల్లో చూసి.. విజిలెన్స్, ఆహార భద్రతా అధికారులు నివ్వెరపోయారు. వ్యాపారం చేసుకోవడానికి అనుమతులు పొంది.. తయారీ, ప్యాకింగులకూ తెగిస్తున్న కొందరు వ్యాపారుల తీరుతో అప్రమత్తం అయ్యారు. ఐదేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారానికి ఇప్పటికైనా కళ్లెం వేసేందుకు సిద్ధమయ్యారు.





బూజు పట్టిన డ్రైఫ్రూట్స్, నకిలీ స్టిక్కర్లు

బూజుకు కోటింగు

గాంధీనగర్‌కు చెందిన వ్యాపారి అన్నం పూర్ణచంద్రరావుని అధికారులు ప్రశ్నించినప్పుడు.. దిగ్భ్రమ చెందే విషయాలు బయటపడ్డాయి. పూర్ణచంద్రరావు బయట నుంచి సరుకు తెచ్చి, బెజవాడలో అమ్ముకొనేందుకు లైసెన్సు పొందాడు. అయితే, ఆయన దుకాణం.. పెద్ద గోదామును తలపిస్తోంది. బయట సరుకుని కొంత లాభానికి లోకల్‌లో అమ్ముకొంటున్నట్టుగాక..తానే సొంతంగా తయారీ కేంద్రం నడుపుతున్నట్టు అక్కడి వాతావరణం ఉంది. ఆరాతీస్తే.. పూర్ణచంద్రరావు 'కల్తీ' కహానీ బయటకొచ్చింది. బెంగళూరు, ముంబై నుంచి జీడిపప్పు, బాదం పప్పు, ఖర్జూరం, అనాస పువ్వు, డేట్స్, అంజీర ఫ్రూట్స్ ప్యాకెట్లను బల్క్‌గా తెస్తున్నాడు. ఇవన్నీ సెకండ్, థర్డ్ గ్రేడ్ సరుకులు. ఇక్కడకు వచ్చాక వాటి కవర్లు తీసేస్తాడు. 60 శాతం మంచిరకం సరుకులో 40శాతం ఈ తరహా కలిపేసి..కొత్త ప్యాకింగు చుట్టేస్తాడు. గురువారం తనిఖీలకు వెళ్లిన అధికారులకు.. యూఎస్ఏ, యూఈ బ్రాండ్లతో ఉన్న ప్యాకెట్లు కుప్పలు తెప్పలుగా కనిపించాయి. ఆహార పదార్థాల తయారీ, ప్యాకింగుకు అనుమతి లేకపోవడంతో.. అధికారుల కన్ను కప్పేందుకు పూర్ణచంద్రరావు ఈ ఎత్తువేశాడు. దుకాణంలో ఒకవైపు ప్యాకెట్లలో బూజుపట్టిన ఖర్జూరం, కాలం చెల్లిన జీడిపప్పు కనిపించాయి. బాదంపప్పుపై ఈగలు ముసిరిఉన్నాయి. బస్తాల మధ్యలో ఎలుకలు స్థావరాలు పెట్టుకొన్నాయి. ఇంత బూజుపట్టి చెడిపోయిన సరుకుని ఏమి చేస్తావని అడగ్గా.. బూజంతా తీసేసి ప్యాక్ చేస్తానని.. వాసన రాకుండా సరుకుపై కొన్ని రసాయనాలు చల్లుతానని పూర్ణచంద్రబాబు చెప్పినట్టు సమాచారం. కాలం చెల్లిపోయిన ఈ సరుకులను విజయవాడలోనే కాదు, చుట్టు పక్కల జిల్లాలకూ సరఫరా చేస్తున్నట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇంత సరుకుతో ఏమి చేస్తున్నావని ప్రశ్నించగా, పూర్ణచంద్రరావు విచిత్రమైన సమాధానం చెప్పాడు. "మేం షాపులకు ఇచ్చాం. వాళ్లు డబ్బులు ఇవ్వకపోవడంతో సరుకును తెచ్చేశాం. ముంబయి నుంచి కంపెనీ వాళ్లు వచ్చి తీసుకెళతారు" అని చెప్పాడు. ఆయన దుకాణంలో సుమారుగా రూ.25 లక్షల విలువ గల సరుకును అధికారులు సీజ్ చేశారు. క్రిమినల్, చీటింగ్ కేసులను నమోదు చేశారు.



నిల్వ చేసిన డ్రైఫ్రూట్స్ ఇతర వస్తువులు

కుర్‌కురేలో కిరికిరి

కబేళాలో సునీల్ చందర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న కుర్‌కురే తయారీ కేంద్రంపై అధికారులు దాడులు చేశారు. నాణ్యత ప్రమాణాలు లేని లెమన్ చాట్, టమాటా ట్యాంగీ, నూడిల్స్ పాపడ్ సరుకులను సీజ్ చేశారు. బాదం పొడి, ఇన్‌స్టెంట్ బాదం మిక్స్, బాదం కీర్, కస్టర్డ్ పౌడర్‌లో రంగులను ఎక్కువ మోతాదులో కలిపేసి విక్రయిస్తున్న రాజు అనే వ్యక్తి ఆట కట్టించారు. గొల్లపూడిలోని దర్గా హరిజనవాడలోని ఆయన దుకాణంలో రూ.కోటి విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. వాటి నమూనాలను హైదరాబాద్ ప్రయోగశాలకు పంపించారు. మాచవరంలోని కాటూరి వారి వీధిలో వల్లేపల్లి త్రినాథరావు అనే వ్యక్తి నెయ్యిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ కలుపుతున్నాడు. దీనిని మరో బ్రాండ్‌తో తయారు చేసిన ప్యాకెట్లలో నింపుతున్నాడు. అలాగే, నాసిరకం అప్పడాలను తయారు చేస్తున్నాడు. వీటిని క్యాటరింగ్ కాంట్రాక్టర్లకు, నగరంలోని షాపులకు అమ్ముతున్నట్టు అధికారులు గుర్తించారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	21.9	31.7
అనంతపురం	23.0	30.4
చిత్తూరు	23.5	31.5
కర్నూలు	24.2	34.0
గుంటూరు	25.0	35.0
విజయవాడ	25.4	35.2
ఒంగోలు	25.5	34.1
రాజమండ్రి	26.0	37.5
కడప	26.0	35.0
శ్రీకాకుళం	26.0	35.0
విజయనగరం	26.0	30.0
నెల్లూరు	26.6	33.8
విశాఖపట్నం	27.0	34.8



డ్రగ్స్‌తో బుగ్గిపాలు కావొద్దు

చాలామంది డ్రగ్స్‌కు బానిసలై ఎంతో విలువైన జీవితాల్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. మీరు(విద్యార్థులు) అలా కాకండి. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి.. మీ జీవితాల్ని బంగారుమయం చేసుకోండి. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తుంటే వెంటనే ఫ్యాకల్టీకి సమాచారం ఇవ్వండి.

- అకున్ సభర్వాల్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

సర్వదర్శనానికి 16గంటలు

తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 80వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 16గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2గంటల సమయం పడుతోంది. శనివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శుక్రవారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం: 50, కల్యాణోత్సవం: 80టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. శనివారం ఆర్జితసేవలకు సంబంధించి శుక్రవారం విజయాబ్యాంకులో మధ్యాహ్నం వరకు ఉండవచ్చు. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

– ఆంధ్రజ్యోతి, తిరుమల

భూమిలాంటి మరో రెండు గ్రహాలు!

మానవుల మనుగడకు ఉపయోగపడే అవకాశమున్న భూమిలాంటి మరో రెండు కొత్త గ్రహాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మన సూర్యుడిలాంటి వేరే నక్షత్రానికి సమీపంలో ఉన్న ఈ రెండు గ్రహాలూ మానవ ఆవాసానికి అనువుగా ఉంటాయని తాజా పరిశోధనలో తేలింది. దాదాపు భూమి పరిమాణంలోనే ఉన్న ఈ రెండు కొత్త గ్రహాలు 'టౌ సెటీ' అనే నక్షత్ర పరిధిలో తిరుగుతున్నాయి. ఈ రెండు గ్రహాలు పరిమాణంలో భూమి కంటే కేవలం 1.7 రెట్లు మాత్రమే పెద్దగా ఉన్నాయి. దాంతో సూర్యుడిలాంటి వేరే నక్షత్ర పరిధిలో ఉన్న చిన్న గ్రహాలుగా శాస్త్రవేత్తలు వీటిని అభివర్ణిస్తున్నారు. అయితే 'టౌ సెటీ' చుట్టూ భారీ స్థాయిలో శిథిలాలు ఉన్నాయని, దీంతో ఈ రెండు గ్రహాలు తరచుగా ఆస్ట్రాయిడ్‌ల బారిన పడే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు.

చిన్న పిల్లలకు కలరా వ్యాక్సిన్‌లు పనిచేయవట!

న్యూయార్క్: చిన్నపిల్లలు, ముఖ్యంగా ఐదేళ్లలోపు వయసు పిల్లలపై కలరా వ్యాక్సిన్‌లు అంత ప్రభావవంతంగా పనిచేయడంలేదని అమెరికాలోని జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 28 వేల నుంచి 1.3 లక్షల మంది కలరా కారణంగా మరణిస్తున్నారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సిన్‌లు కలరా సోకే ప్రమాదాన్ని పెద్దల్లో 58 శాతం, ఐదేళ్లలోపు పిల్లల్లో 30 శాతం మాత్రమే అరికట్టగలుగుతున్నాయట. కలరాకు కారణమయ్యే 'విబ్రియో కలరా' అనే బ్యాక్టీరియా కణాలను నాశనం చేయడానికి ప్రస్తుతం నోటి ద్వారా వ్యాక్సిన్‌లను ఇస్తున్నారు. ఈ వ్యాక్సిన్‌లు చాలా తక్కువ స్థాయిలో అందుబాటులో ఉండడంతో, అంత ప్రభావవంతంగా పనిచేయలేనప్పటికీ ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది.

ఒక బృందావనం






ఆగస్టు నెల వచ్చిందంటే చాలు.... పండగల కోలాహలం. ఒక పండుగ తరువాత మరొకటి పలకరిస్తూనే ఉంటాయి. సోమవారం నాడు శ్రీకృష్ణుడి పుట్టిన రోజు రాబోతోంది. 'రారా... చిన్న కన్నయ్యా!' అంటూ బుజ్జిబుజ్జి పాద ముద్రలు వేసి నల్లనయ్యను ఇంట్లోకి ఆహ్వానిస్తారు. అటుకులు, బెల్లం, వెన్న ప్రసాదాలుగా ఆరగింపు చేస్తారు. ఉత్సాహంతో ఉట్టికొట్టే పండుగ చేసుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే కిట్టయ్య పుట్టినరోజు కన్నుల పండుగే! అమ్మాయిలయితే గోపికల్లా తయారై, కోలాటం ఆడతారు. బృందావనంలో గోపికల్లా కృష్ణాష్టమికి స్వాగతం పలుకుతూ లంగావోణీల్లో భలేగా ముస్తాబయ్యారు. వీళ్లను చూస్తుంటే పండుగ కోలాహలం మూడురోజుల ముందే ముంగిట్లోకి వచ్చేసింది అన్నట్లుంది...



ఇదీ లెక్క!

ఈ సిటీ టాప్!

భారత దేశంలో బెంగళూరు, ఢిల్లీలలో మహిళా ఎంట్రప్రెన్యూర్లు ఎక్కువగా ఉన్నారుట. ఐటి క్యాపిటల్ అయిన బెంగళూరులో అయితే వీళ్ల అధిక సంఖ్యలో ఉన్నారని వెల్లడైంది. పైగా అక్కడి మహిళలకు ప్రభుత్వ తోడ్పాటు కూడా బాగా ఉంది. 2017 సంవత్సరం 'డెల్ విమెన్ ఎంట్రప్రెన్యూర్ సిటీస్ ఇండెక్స్' లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. మొత్తం 50 గ్లోబల్ సిటీలలో న్యూయార్కు ప్రథమ స్థానంలో ఉండగా, మనదేశంలో బెంగళూరు 40వ స్థానంలో, ఢిల్లీ 49వ స్థానంలో ఉన్నాయి. ఈ నగరాల్లో మంచి శక్తిసామర్థ్యాలున్న మహిళా ఎంట్రప్రెన్యూర్లు




పారిశ్రామిక రంగంలోని అవకాశాలను వేగంగా అందిపుచ్చుకుంటున్నారు. రాజధాని, టెక్నాలజీ, ప్రతిభ, సంస్కృతి, మార్కెట్లు, భౌగోళిక వైవిధ్యం అంశాల ఆధారంగా పారిశ్రామికరంగంలో వివిధ నగరాల స్థానాలను ఇండెక్స్ ప్రకటించింది. అంతర్జాతీయంగా మహిళా ఎంట్రప్రెన్యూర్ల రేటింగ్ కూడా ప్రతి ఏడాదీ పది శాతం పెరుగుతూవస్తోందని ఇందులో వెల్లడైంది. అంతేకాదు వివిధ మార్కెట్లలో ప్రవేశించడానికి మగవాళ్లతో సమానంగా, కొన్ని సందర్భాలలో అయితే వారి కన్నా కూడా ఎక్కువగా మహిళలు ముందుంటున్నారని తేలింది.

నయా హవా

ట్రాష్ ట్యాటూస్

ఫొటోలో కనిపించే ఈ బొమ్మ.. చేతిపై గీసిన ట్యాటూ. అవును ఇది నిజం. కాకపోతే ఇంక్‌తో గీసిన ట్యాటూ. బ్రెజిల్‌లో ఓ ట్యాటూ ఆర్టిస్ట్ సరదాగా ఇంకుతో ట్యాటూ వేశాడు. దాన్ని చూసి అలా కావాలనే కొంతమంది అడిగితే వారికి అలాగే ట్యాటూలు వేశారాయన. ట్యాటూలు వేయించుకున్న వారు వాటిని ఫోటోలు తీసి ఇన్‌స్టాగ్రమ్‌లో ఉంచారు. ఇంకేముందీ అవి వైరల్ అయ్యాయి. అన్నట్లు ఈ ట్యాటూలను ట్రాష్ ట్యాటూలని జనాలు పిలుస్తున్నారు. మిక్కీమౌస్, పావురం.. ఇలా సింపుల్‌గా ఉండే ఈ ట్యాటూల ట్రెండ్ నడుస్తోందిపుడు.



వినూత్నం

సెలబ్రిటీ రైటర్

ఏ మనిషిలో ఎలాంటి ప్రతిభ దాగుందో చెప్పడం కష్టమే.సాధారణంగా కనిపించేవారు సైతం అసాధారణ విజేతలుగా నిలుస్తున్న ఘట్టాలెన్నో! ఇక్కడ కనిపిస్తున్న పెద్దాయన ఒక సాధారణ ఛాయ్‌వాలా...'అలాంటి వాళ్లు మన చుట్టూ ఎంతమంది లేరు' అంటారా? నిజమే! కానీ..ఆయన్ని అలా తేలిగ్గా తీసిపారేయకండి...అతని పేరు లక్ష్మణ రావు... ఢిల్లీలో ఉంటారు. వృత్తి ఛాయ్‌వాలానే! ప్రవృత్తి మటుకు రచనావ్యాసంగం!! 65 ఏళ్ల లక్ష్మణరావు ఇప్పటి వరకూ 25 పుస్తకాలు రాశారు! లక్ష్మణ రావు గురించి మరిన్ని విశేషాలు ఆయన మాటల్లోనే...

"మహారాష్ట్రలోని అమరావతి జిల్లా మాది. రైతు కుటుంబంలో పుట్టాను. 1975లో మా నాన్న దగ్గరి నుంచి 40 రూపాయలు తీసుకుని ఢిల్లీ వెళ్లే రైలెక్కేశాను. అప్పటికి నా వయసు 22 ఏళ్ళే. నేను పెద్ద రచయిత కావాలనే ఆకాంక్షతో దేశ రాజధాని ఢిల్లీలో కాలుమోపాను. ఇక్కడకు వచ్చిన తర్వాత ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా. అయినా చిన్నతనం నుంచీ రచయిత కావాలనే నా కోరికను తీర్చుకోగలిగాను.ఢిల్లీలో నిలదొక్కుకోవడానికి చాలా కష్టాలే పడ్డాను. ఢిల్లీకి రావడానికి ముందు ఒక డాక్టరు దగ్గర పనివాడిగా కొన్నాళ్లు ఉన్నాను. ఆ తర్వాత బట్టల మిల్లులో పనిచేశాను. దాన్ని మూసేయడంతో కొన్ని రోజులు మా ఊరెళ్లి వ్యవసాయం చేశాను. కాని రైటర్ కావాలన్న తపన నన్ను అక్కడ నిలవనీయలేదు. అందుకే ఢిల్లీలో ఏదో ఒక పని చేసుకుంటూ రచనలు చేయాలనుకున్నాను.

ఢిల్లీలో రచనలు...

దేశ రాజధానిలో నా రచనా వ్యాసంగం ఒక చెట్టు నీడన ప్రారంభమైందంటే ఆశ్చర్యంగా ఉంటుంది కానీ ఇది నిజం. న్యూఢిల్లీ ఐటివోలో విష్ణు దిగంబర్ మార్గ్‌లో ఉన్న హిందీభవన్ పేవ్‌మెంట్‌పై ఉన్న చెట్టు నీడలో టీ అమ్ముకుంటూ రచనలు చేసేవాడిని. దానికి ముందు సిగరెట్లు, పాన్ దుకాణం నడిపాను. అక్కడే ఖాళీ సమయంలో టాల్‌స్టాయ్, షేక్స్‌పియర్ అనువాద రచనలు బాగా చదువుతుండేవాడిని. ఈ రచయితలు నాపై ఎంతో ప్రభావం చూపారు. అయితే నాలో రచనలు చేయాలన్న ఆసక్తి రగిలించింది మాత్రం ప్రముఖ రచయిత గుల్షన్ నందా రచనలు. ఆయన రాసిన కొన్ని నవలలు బాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలయ్యాయి కూడా. ఉదాహరణకు 'కటీ పతంగ్', 'ఖిలోనా', 'షర్మీలీ' వంటి సినిమాలు ఆయన రచనల నుంచి పుట్టుకొచ్చిన సూపర్‌డూపర్ హిట్లే. రచనలు చేయాలనే ఆసక్తి టీనేజ్‌లో ఎక్కువైంది. అది మెల్లగా తీవ్రమైన కోరికగా పరిణమించింది. నా మాతృభాష మరాఠీ అయినా, నందా లాగ హిందీలో రచనావ్యాసంగానికి పూనుకున్నాను.

గెటవుట్ అన్నారు...

ఇప్పటి వరకూ నేను రాసిన 25 పుస్తకాల్లో ఫిక్షన్ దగ్గరి నుంచి నాటకాల వరకూ, అలాగే భారత రాజకీయాల దగ్గరి నుంచి ఆర్థిక రంగానికి సంబంధించిన అంశాల వరకూ అన్నీ ఉన్నాయి. 1992లో 'రామదాస్', 'నయా దునియా కీ నయా కహానీ' పుస్తకాలు రాశాను. వాటిని ప్రచురించేందుకు పలు ప్రచురణ సంస్థల వారిని కలిశాను.నేనొక ఛాయ్‌వాలానని తెలిసి వాళ్లు నా స్క్రిప్టును కూడా చూడకుండా 'గెటవుట్' అని పంపించేశారు. పుస్తకాల ప్రచురణ కోసం ఎందరి దగ్గరికో తిరిగి తిరిగి అలసిపోయి చివరకు నా పుస్తకాలను నేనే ప్రచురించుకుందామని నిశ్చయించుకున్నాను. 'భారతీయ సాహిత్య కళా ప్రకాశన్' అనే సంస్థను ప్రారంభించాను. ఏడు వేల రూపాయలు పెట్టి 'నయా దునియా కీ నయా కహానీ' పుస్తకాన్ని ప్రచురించాను. 1981 నాటికి నా రచనలు ప్రజల మధ్యకు వెళ్లి నాకంటూ ప్రత్యేకమైన పేరు సంపాదించి పెట్టాయి. అప్పుడే నాకు నాటి ప్రధాని ఇందిరాగాంధి నుంచి పిలుపు వచ్చింది. 1984, మే 27న తీన్ మూర్తి భవన్‌లో ఇందిరాగాంధీని కలిశాను. ఆవిడను కలిసినపుడు ఆమె జీవితంపై పుస్తకం రాయాలనుందని అన్నాను. దానికి ఇందిరా జీ స్పందిస్తూ ' నా జీవితం గురించి కన్నా నేను చేసిన పనుల గురించి రాయండి' అన్నారు. ఆ తర్వాతే 'ప్రధానమంత్రి' అనే నాటకాన్ని రాశాను.

నిజ జీవితాలే ప్రేరణగా...

నేను రాసిన పుస్తకాల్లో 'నర్మద', 'రేణు', ' పాంచ్ ప్రతినిధి కహానియా' 'దన్షే'లు కొన్ని మాత్రమే. ఇవన్నీ వాస్తవ సంఘటనల ఆధారంగా రాసినవే. 'రేణు' పుస్తకం కూడా ఒక యువతి నిజ జీవిత గాథ. ఈ నవలకు మంచి స్పందన వచ్చింది. ఈ పుస్తకం సక్సెస్ తర్వాతే అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌ని రాష్ట్రపతి భవన్‌లో కలిశాను నేను రాసిన 'రామ్‌దాస్' పుస్తకానికి 2003లో ఇంద్రప్రస్థ సాహిత్య భారతి అవార్డు కూడా వచ్చింది. నేను చేసే పని నుంచి వచ్చే ప్రతి పైసాను ఎంతో జాగ్రత్త చేస్తుంటా. అలా పోగైన డబ్బులతోనే పుస్తకాలు ప్రచురిస్తున్నాను. 'ఎంత ఎక్కువ డబ్బు దాస్తే అన్ని ఎక్కువ పుస్తకాలు ప్రచురించుకోవచ్చు కదా' అనిపిస్తుంది నాకు. ప్రతి రోజూ రాత్రి 9 గంటల వరకూ టీ అమ్ముతాను. ఆ తర్వాత నుంచి తెల్లారి ఒంటి గంట వరకూ రచనావ్యాసంగంలో మునిగిపోతాను.

లేటు వయసులో చదువు...

రచయితగా మంచి పేరు సంపాదించుకున్నా చాలా మంది నా విద్యార్హతలను అడుగుతుండడంతో చదువుకోవాలని నిశ్చయించుకున్నాను. 37 ఏళ్ల వయసులో సిబిఎస్ఇ సిలబస్‌తో 12 వ తరగతి పూర్తి చేశాను. తర్వాత 50 ఏళ్ల వయసులో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి హింది బిఎ పట్టా అందుకున్నాను. 63 ఏళ్ల వయసులో ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ నుంచి హింది ఎంఎ చేశాను.పుస్తకాలను ప్రచురించడమే కాకుండా వాటిని గ్రామీణ ప్రాంతాల్లో సైతం సైకిలు వేసుకు వెళ్లి అమ్ముతాను. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా మంచి రచయితగా నాకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉంది. పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు నా వర్కును ఉపయోగించుకునేందుకు అనుమతి అడిగాయి. విదేశస్థులకు భాషాపరమైన ఇబ్బంది తలెత్తకుండా నా రచనలను ఆంగ్లంలో అనువాదం చేసే ఆలోచనల్లో కూడా ఉన్నాను.ప్రజా రచయితననిపించుకున్నాను. ఇంతకంటే ఏం కావాలి



టీతో పాటు పుస్తకాలు అమ్ముతూ..



మాజీ రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌తో


ఒకే ఒక్క గదిలో నా భార్య రేఖ, కొడుకులు హితేష్, పరేష్‌లతో జీవిస్తున్నా. నా ఇద్దరు కొడుకులకూ ఉన్నత చదువులు చెప్పించాలనేది నా కోరిక.

పుస్తకాల మీద ఉండే ఇష్టం వల్ల భారతీయ రచయితలే కాకుండా షేక్స్‌పియర్, బెర్నార్డ్ షా, టాల్‌స్టాయ్ వంటి విదేశీ రచయితల గురించి కూడా అవగాహన పెంచుకున్నా.

ఆగష్టు 14 సోమవారం కృష్ణాష్టమి

ఆంధ్రజ్యోతి నివేదన

అందరి బంధువయా!



కృష్ణతత్వం చిత్రమైనది. బాలకృష్ణుడిగా ఆయన చేసిన అల్లరి, రాధాకృష్ణుడిగా ఆయన చూపిన రాసలీలలు, గీతాచార్యుడిగా ఆయన చేసిన ఉపదేశం.. ఇలా అనంత కోణాల్లో.. అనంత తత్వాలు గోచరిస్తాయి ఆయనలో. అందుకే వ్యాస భగవానుడు ప్రతి పురాణంలోనూ కృష్ణుని గురించి ఎక్కడో ఓ చోట, ఏదో రకంగా స్పృశించాడు. అయినా తృప్తి కలుగక 'శ్రీమద్భాగవతం' ద్వారా కృష్ణతత్వాన్ని ప్రపంచానికి చాటి, తన అవతార ప్రయోజనాన్ని నెరవేర్చుకున్నాడు వ్యాసుడు.

కృష్ణుడు కేవలం లీలలు చూపిన ఆనంద లోలుడు కాదు. పరమాత్మ భావాన్ని పరిపూర్ణంగా ప్రకటితం చేసిన అవతారం.. కృష్ణావతారం. ఉపనిషత్ సారభూతమైన భగవద్గీతను బోధించి జగద్గురువు అయ్యాడు. భాగవత దృష్టాంతాలు.. నల్లనయ్య ఎంత చల్లనయ్యో తెలిపితే... 'భగవద్గీత' సిద్ధాంతంలో సంపూర్ణమైన కృష్ణ తత్వం గోచరం అవుతుంది. "కృష్ణస్తు లీలా మయః, కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అంటారు. తన చేష్టలనే లీలలుగా చూపించి అందరివాడు అయ్యాడాయన. సంపూర్ణమైన జ్ఞానంతో జగత్తు రక్షణ కోసం చేసిన లీలలవి. భగవద్గీతలో తానే దైవాన్ని అని ప్రకటించుకున్నాడు కృష్ణుడు. అందుకే ఆయన లీలామానుష రూపంలో ఉన్న భగవానుడు. ఈ జగత్తును ఉద్ధరించడానికి అవతారమూర్తిగా వచ్చాడు.

అవతారం అన్నప్పుడు దానికో ప్రయోజనం ఉండాలి. వాటిని నెరవేర్చుకోవడానికి కృష్ణుడు బాల్యం నుంచే లెక్కలేనన్ని మాయలు చూపాడు. మాయాశక్తిగా అవతరించాడు, ద్వారపాలకులను మాయజేసి చెరసాల నుంచి బయటపడ్డాడు. మాయ ద్వారానే యమునా నదిని దాటి రేపల్లె చేరుకున్నాడు. మట్టి తిని యశోదమ్మకు బ్రహ్మాండాలు చూపించాడు. శకటాసురుణ్ణి నిర్జించాడు. కాళీయుడి పీచం అణిచాడు. గోవర్ధనగిరిని చిటికెన వేలుతో ఎత్తాడు. కంసుడిని సంహరించాడు.. ఇలా బాల్యంలోనే ఎన్నో మాయలు చూపాడు. ధర్మాన్ని నిలబెట్టడానికి మాయోపాయాన్ని ప్రయోగించాడు కృష్ణుడు. మాయలో పడిపోయినవారిని కాపాడడానికి ఈ మాయలు చూపాడు. కానీ, ఎన్నడూ మాయలో పడిపోలేదు. అందుకే కృష్ణుడు దేవుడయ్యాడు. యుగాలు దాటినా పూజలు అందుకుంటున్నాడు.

కృష్ణానుభవం కోసం ఎందరో మునులు, సిద్ధులు పరితపిస్తుంటారు. కృష్ణదర్శన లాలసలో కొట్టుమిట్టాడుతుంటారు. బృందావనంలో కృష్ణ దర్శనం కోసం ఇప్పటికీ ఎందరో సిద్ధులు తపస్సు చేస్తూ కనిపిస్తుంటారు. రాధాదేవి లోనైన అలౌకిక ఆనందాన్ని తమకూ ప్రసాదించాలని కృష్ణుడిని కొలుస్తుంటారు. ఆ స్వామి కొందరిని అనుగ్రహిస్తాడు, కొందరిని ఆటపట్టిస్తాడు. లౌకిక విషయాలకు లోనవకుండా పరమాత్మ దర్శనం కోసం పట్టువిడువక పరితపించే వారికి బృందావన దర్శన భాగ్యం కల్పిస్తాడు.

సందేశం

చూపు మరల్చుకో!

మనసు దోచే అకృత్యాలు, అశ్లీలతల్లో ముందు ఉండేది దృష్టే! కనుక దివ్య ఖుర్ఆన్ ఇలా సెలవిస్తోంది... "కళ్లారా చూడరాదు.."అని. కానీ, ఎల్లప్పుడూ కిందికే చూస్తూ ఉండాలని దీని అర్థం కాదు. అదే సమయంలో యథేచ్ఛగా కళ్లను సంచరించనీయవద్దు. అంటే, చూపులను అదుపులో ఉంచుకోవాలని అర్థం. చూడదగని విషయాల నుండి చూపులను మరల్చుకోవాలి. దీన్నికై మనిషి తన ముఖాన్ని కిందకు దించినా ఫరవాలేదు.

"పురుషులు అన్య స్త్రీలను చూచుట, ఇతరుల ఆచ్ఛాదనీయ అవయవాలు, అసభ్య దృశ్యాలపై చూపు నిలుపుట" అనే మూడు విషయాలను చేయరాదు. "ప్రవక్తా! విశ్వసించిన పురుషులకు తమ చూపులను కాపాడుకోండి అనీ, తమ మర్మాంగాలను రక్షించుకోండి అనీ చెప్పు. ఇది వారికి ఎంతో పరిశుద్ధమైన పద్ధతి. వారు చేసే దానిని గురించి అల్లాహ్‌కు బాగా తెలుసు." (దివ్య ఖుర్ఆన్ 24: 30)

జరీర్ బిన్ అబ్దుల్లా ఇలా ఉల్లేఖించారు: "నేను మహా ప్రవక్త(స) ను పరస్త్రీపైన అకస్మాత్తుగా దృష్టి పడటాన్ని గురించి అడిగాను. అప్పుడు పరస్త్రీ మీద నీ చూపు పడకముందే నీవు నీ దృష్టిని మరల్చుకో" అని మహా ప్రవక్త(స) ప్రబోధించారు. బురీరా (రజి) ఉల్లేఖన ప్రకారం.. మహా ప్రవక్త (స), హజ్రత్ అలీతో "అలీ! పరస్త్రీలపై అకస్మాత్తుగా దృష్టి పడితే, దృష్టిని మరల్చుకో. రెండవసారి దృష్టి సారించకు. మొదటి చూపు నీదే కాని రెండవది నీది కాదు, అది సైతాన్ చూపు!" అని ఉపదేశించారు.



చెడుచూపులు (సైతాన్ చూపు) అంటే, ఎవరైనా పరాయి వారిపై దృష్టి సారించి, ప్రత్యేకించి కామ దృష్టితో చూడటం! కళ్లతో చూచి తృప్తి పొందడమనేది పాపంతో కూడుకున్నది. ఈ చెడు చూపే మానవుని అంతరంగాన్ని నాశనం చేస్తుంది.

అంతరాత్మ సజీవంగా ఉంటే, మనిషి ఎలాంటి చెడు పనులూ చేయడు. చెడు పనులకు పాల్పడినప్పుడల్లా అంతరాత్మ మనల్ని నిందిస్తుంది, నిలదీస్తుంది, ఆక్షేపిస్తుంది, అభ్యంతరం చెబుతుంది. ఫలానా పని చేస్తే, నీవు నాశనమవుతావు, పట్టుబడి పోతావు అని కూడా హెచ్చరిస్తుంది. అంతరాత్మ ప్రబోధాన్ని ఖాతరు చేయకుండా దాన్ని అణచటానికి ప్రయత్నిస్తే మనం దారి తప్పి, చీకటి అగాధాల్లోకి పడిపోయినట్లే. అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించి ఆచరించేవారు ఇహలోకంలోనే కాదు, పరలోకంలోనూ విజయ శిఖరాలు అధిరోహించగలుగుతారు.

● **మహమ్మద్ వహీదుద్దీన్,** సిద్దిపేట

● **సమాచారం**

గురుపూజ



ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె), హెలీనా పెట్రోవా బ్లావెట్స్కీల జన్మదినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో గురుపూజ నిర్వహిస్తున్నారు.

తేదీలు: ఆగష్టు 11, 12

వేదిక: మాస్టర్ ఇ.కె ప్రార్థనా మందిరం వరల్డ్ టీచర్ హౌసింగ్ కాలనీ, చినముషిడివాడ, విశాఖపట్నం.

దైవమార్గం


బోధకులు కాదు.. సేవకులు కావాలి!!

ఎంతో స్నేహంగా ఉండే రెండు కొంగలు, ఒక కప్ప.. మరో చెరువుకు వలస పోతున్నాయి. రెండు కొంగలూ ఒక కర్రను నోట కరుచుకొని ఎగురుతుంటే.. కప్ప ఆ కర్రను నోటితో గట్టిగా పట్టుకుంది. నింగిలో ఎగురుతున్న ఈ మూడింటిని చూసి.. ఒకాయన 'బ్రహ్మాండం! ఎవరిదీ ఆలోచన?' అని అడిగాడట! 'నాదే!' అన్నదట కప్ప నోరు తెరిచి!!

నోరు తెరిచి కొత్త ప్రమాదాలు తెచ్చుకుంటారు కొందరు. తమ మౌనం ద్వారా మానవ కల్యాణానికి కారణం అవుతారు కొందరు. 'అంతట ఆయన నోరు తెరిచి ఈ రాగం బోధించసాగెను" అన్న వాక్యం బైబిలులోని నాలుగు సువార్తల్లో చాలాసార్లు వస్తుంది. కానీ, ఒకానొక కీలకమైన ఘట్టంలో యేసు 'మౌనం' మాత్రం మానవాళికి మరింత మేలు చేసింది.

'దైవ ద్రోహి, దేశ ద్రోహి' అన్న తప్పుడు ఆరోపణలతో రూమా ప్రభుత్వం యేసును బంధించగా.. హేరోదు రాజు ఆయన్ను విచారణ చేశాడు. కానీ, ఎన్ని ప్రశ్నలు వేసినా యేసు మాత్రం 'మౌనం'గానే ఉన్నాడు (లూకా 23:8,9). ఆయన దైవకుమారుడు. అనుకుంటే తన దైవిక శక్తితో వారిని చీల్చి చెండాడగలడు. 'నేను నిర్దోషిన'ంటూ ఒక మాట సెలవిస్తే, అక్కడున్న సామాన్యులంతా హేరోదుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయగలరు. కానీ, నిరపరాధిగా సిలువ శిక్షను భరించి, మరణించి మూడో రోజు తిరిగి సజీవుడు కావడం ద్వారా ఒక వైపు తన క్షమ, ప్రేమ సిద్ధాంతాన్ని ఆచరించి చూపడం, మరోవైపు తన దైవికతను రుజువు చేసుకోవడం యేసు అభీష్టం. ఆ విధంగా.. పగ, ప్రతీకారం, హింసకు ప్రతిహింసతో రక్తసిక్తమై ఉన్న 'మానవ చరిత్ర'లో ప్రేమ, క్షమాపణలతో కూడిన ఒక మహా యుగాన్ని యేసు ఆరంభించాడు.

ప్రతీకారేచ్ఛతో సాగిన దమనకాండకు, దౌర్జన్యానికీ తిరుగులేని జవాబుగా.. క్షమా సిద్ధాంతాన్ని యేసు సిలువ నుంచి ఆవిష్కరించాడు. దౌర్జన్యానిది శక్తి అయితే, ప్రేమ, క్షమా కలది మహాశక్తి! కత్తితో తల నరికేందుకు ఎంత శక్తి కావాలో.. ఆ కత్తి ముందు తల వంచి తల నరికించుకోవడానికి అంతకు వేయిరెట్ల ఆత్మబలం, శక్తి కావాలి.




'తల వంచడంలోని విజయం, ఒకడుగు వెనకేయడంలోని సంస్కారం, ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించడంలోని సౌశీల్యాన్ని బోధించే యేసు ప్రవచనాలు అసలు ఫలిస్తాయా?' అన్న ప్రశ్నకు క్రైస్తవ ఉద్యమ చరిత్రే జవాబు. రోమా ప్రభుత్వం దౌర్జన్యానికి నిజానికి క్రైస్తవం మొదటి శతాబ్దంలోనే అంతరించి పోయి ఉండేది. కానీ, ఇన్ని వేల ఏళ్లుగా.. క్రైస్తవం పరిమళిస్తున్నది.. యేసు ప్రతిపాదించి, ఆచరించిన క్షమ, ప్రేమ సిద్ధాంతంతోనే! అయితే ఈనాడు కావాల్సింది.. వాటిని వల్లించి, అందంగా వర్ణించే బోధకులు కాదు. వాటిని పవిత్రంగా ఆచరించి చూపగల సేవకులు కావాలి. ఎంత పెద్ద భవనాన్నైనా భరించే అదృశ్య, అనాకర పునాది రాళ్లది అద్భుతమైన 'మౌన భాష'!! నిండుకుండలాగా అవి చలించవు. నిజమైన క్రైస్తవమూ అంతే! క్షమ, ప్రేమ, త్యాగం, నిస్వార్థం- దాని నిజ లక్షణాలు.

● **సుశీల్ సందేశ్**

ధర్మపథం

అహింసే అసలైన ఆయుధం



అహింస అంటే పిరికితనం అనుకుంటారు చాలామంది! అహింస వజ్రాయుధం కంటే పదునైనది అని రుజువు చేసిన ధీరులు ఎందరో ఉన్నారు. చావుకు భయపడని ధీరత్వం వారిది. బుద్ధుడు అలాంటి ధీరుల్లో అగ్రగణ్యుడు! అంగుళిమాలుని లాంటి నరహంతకుని దగ్గరికి, అనేక యుద్ధ క్షేత్రాల మధ్యకు ఎలాంటి ఆయుధం, కవచ ఆచ్ఛాదనం లేకుండా వెళ్లేవాడు. బుద్ధునితో పాటు ఎందరో బౌద్ధ భిక్షువుల నిర్భీతిగా జీవించారు.

బుద్ధుడు ప్రబోధించిన సమ్యక్ దృక్పథం, యథాభూత దర్శన జ్ఞానమే వారి ధీరత్వానికి ప్రధాన కారణం. అలాంటి వారిలో అధిముక్తుడు ముఖ్యుడు. అధిముక్తుడు చాలా చిన్నతనంలోనే భిక్షువుగా మారాడు. కుర్రతనంలో అతడు ఒక అడవి మార్గంలో పోతున్నప్పుడు ఒక హంతకుల ముఠాకి చిక్కాడు. వారు అడవి బందిపోట్లు. ఒక దేవతారాధకులు. దేవతలకు మనుషులను బలిస్తే తమ దొంగతనాలకు ఆటంకం కలగదని నమ్మి ఎందరినో బలి ఇస్తూ ఉండేవారు. అలా బలివ్వడానికి అధిముక్తుణ్ణి తీసుకుపోయారు వాళ్లు.

కాళ్లూ, చేతులూ కట్టేసి బలిపీఠంపై పడుకోబెట్టారు. ఈ తతంగం చూస్తున్న అధిముక్తుని ముఖంలో కించిత్తయినా ఆందోళన కనిపించలేదు. దుఃఖం లేదు. నిర్భీతిగా చిరునవ్వుతోనే ఉన్నాడు. అతని ధైర్యం చూసి దొంగల ముఠా నాయకుడికి ఆశ్చర్యం కలిగింది. "ఓరీ! బోడిగుండా! నీకసలు భయం లేదా? తెలియదా? మేము ఎందరినో చంపాం. అందరూ విలవిల్లాడేవారు. ఆర్తనాదాలు చేసేవారు. మనుషులే కాదు, జంతువులు కూడా ఈ బలిపీఠం ఎక్కితే ఏడుస్తాయి. దీనంగా అరుస్తాయి. మరి నీవెందుకు ఇలా నవ్వుతున్నావ్?" అని ప్రశ్నించాడు కత్తి నూరుతూ!

"నాకు ఏ జన్మల మీదా నమ్మకం లేదు. ఈ జన్మలో సమ్యక్ జ్ఞానాన్ని పొందాను. దుఃఖాన్ని జయించాను. నాకు ఏ కోరికలూ లేవు. కొత్తవి రావు. ధర్మాన్ని ధరించిన నాకు చావంటే భయం లేదు. అది నా వెన్నంటే ఉంటుంది. ఎదుటి వారిని హింసించి, చంపి, పీడించి బతికే జీవితం కాదు నాది! ఇంద్రియాల్ని జయించిన నాకు మృత్యువు అంటే భయం లేదు. చావు భయాన్ని ఎప్పుడో జయించాను. మీ పని మీరు కానీయండి" అన్నాడు చిరునవ్వుతో!

దాంతో దొంగల నాయకుడికి ఒక్కసారిగా కళ్లు తెరుచుకున్నాయి. "స్వామీ! ఇన్ని ఆయుధాలున్న మేమే నిరంతరం భయపడుతూ బతుకుతున్నాం. అలాంటిది ఏ ఆయుధమూ లేని నీకు ఇంత ధైర్యం ఎలా వచ్చింది? ఎవరు నేర్పారు? మాకూ ఆ ధైర్యాన్ని నేర్పించగలరా?" అని నూరుతున్న కత్తిని పక్కనపెట్టి మోకాళ్ల మీద కూలబడి ప్రార్థించాడు దొంగల ముఠా నాయకుడు. అధిముక్తుడు వాళ్లందరినీ బుద్ధుని దగ్గరికి తీసుకెళ్లాడు. వారు తమ మనసు మార్చుకొని, దారి మార్చుకొని.. మంచి మనుషులుగా జీవనం కొనసాగించారు.

ఇది అప్పటి మాట. నిన్నమొన్న అంబేద్కర్ కూడా తన పోరాటాన్ని అహింసా మార్గంలోనే నడిపించి, నిమ్న జాతుల ఉద్ధరణకు దారులు వేశారు.

"సత్యాగ్రహులు పూర్తి అహింస పాటించాలి. బ్రిటిష్ సైనికులు లాఠీలతో బాదుతున్నా.. "అమ్మా.. అయ్యా.." అనకూడదు. "వందేమాతరం" అనే అనాలి. దెబ్బల్ని కాచుకోవడానికి చేతులను అడ్డు పెట్టకూడదు. అలా పెట్టడం ప్రతిఘటించడమే అవుతుంది. అలాంటివారే నా వెంట రండి" అన్నారు గాంధీజీ.

దండి సత్యాగ్రహంలో అలాంటివారు పాల్గొన్నారు. బ్రిటిష్ సైనికులు తలలు పగులగొట్టారు. అయినా సత్యాగ్రహులు ప్రతిఘటన చూపలేదు. ఈ దృశ్యాన్ని చూసిన ఆంగ్లపత్రిక 'డైలీ హెరాల్డ్' రిపోర్టర్ 'జార్జ్'.. "ఈ దమనకాండ చూశాక.. నేనొక తెల్లవాడినైనందుకు సిగ్గుపడ్డాను. నిరాయుధులపై, ప్రతిఘటించని వారిపై చూపిన ఈ పైశాచికత్వాన్ని చూసి తల్లడిల్లాను. వారి అహింసా తత్వానికీ, ధీరత్వానికీ తల వంచి నమస్కరిస్తున్నాను" అని కథనం రాశాడు. ఆ వార్త ఇంగ్లండ్ పార్లమెంట్‌లో పెను సంచలనం అయింది. బ్రిటిష్ లేబర్ పార్టీ వారు గగ్గోలు పెట్టారు. భారతదేశ సత్యాగ్రహ ఉద్యమం ఆ విధంగా ప్రపంచానికి తెలిసింది. ప్రపంచదేశాల మద్దతును పొందింది.

గాంధీ, అంబేద్కర్ కూడా అహింసాయుధాన్ని చేపట్టిన ధీరులే! 'అహింస అంటే పిరికితనం కాదు!' సడలని ధీరత్వం అని ప్రపంచానికి చాటారు!


● **బొర్రా గోవర్ధన్**

శ్రీ రమణ కథామృతం

గూటికి చేరిన పక్షి

(గత వారం తరువాయి)

"తిరువణ్ణామలై వెళ్లాలంటే.. ఇంకా 20 మైళ్లు వెళ్లాలి. ఈ ప్రయాణానికి ఖర్చులెవరు ఇస్తారు" అనుకున్నాడు వెంకటరామన్. వెంటనే తన చెవులకు ఉన్న రాళ్లు పొదిగిన దుద్దులు జ్ఞప్తికి వచ్చాయి. ఆ ఇంటాయన (ముత్తుకృష్ణ భాగవతార్) దగ్గర కుదువ పెడితే బాగుంటుందనిపించింది. అటువంటి లావాదేవీల్లో ప్రవేశం లేకపోయినా.. భాగవతార్‌తో తన సామాను ప్రయాణంలో పోయిందనీ, ఇంకా ప్రయాణం కొనసాగించడానికి డబ్బు కావాలనీ చెప్పి కొంత పైకం అప్పు తీసుకున్నాడు. దానికి కావలసిన ప్రామిసరీ నోట్ కూడా తీసుకున్నాడు.



అరుణాచలేశ్వర ఆలయం

గోకులాష్టమి నాడు తమ ఇంటికి అతిథిగా వచ్చిన అబ్బాయికి భోజనం పెట్టడమే కాక.. భాగవతార్ సోదరి అతనికి కొన్ని భక్ష్యాలను పొట్లం కట్టి ఇచ్చింది. డబ్బునూ, ఆ భక్ష్యాలనూ తీసుకుని ఆ ఇంటి నుంచి బయటపడ్డాడు రమణుడు.

తొలుత అరయనినల్లూర్ దాకా నడిచి వెళ్లాడు. మర్నాడు ఉదయం తిరువణ్ణామలైకి వెళ్లే రైలు ఎక్కాడు. రైలు ఎక్కినప్పటి నుంచీ అరుణాచలానికి ఎప్పుడెప్పుడు చేరుతానో అనే తొందరే ఆ యువకునికి! ఆ కొండ శిఖరం ఎప్పుడు కనబడుతుందా అని రైలులో నుంచి చూస్తూ ఉన్నాడు. కాసేపటికి గిరి శిఖరం, గిరి పాదం, ఆ పక్కనే ఉన్న అరుణాచలేశ్వర ఆలయ గోపురం ఒకదాని తర్వాత ఒకటి కనిపించాయి. రైలు తిరువణ్ణామలై చేరుకుంది.

ఏవో మరమ్మతులు జరుగుతుండటం వల్ల ఆలయాన్ని కాస్త ఆలస్యంగా తెరుస్తుండేవారు. కానీ, ఆశ్చర్యమేమంటే.. వెంకటరామన్ తిరువణ్ణామలై రైల్వేస్టేషన్ నుంచి కొండపైకి వెళ్లేసరికి.. ఆలయ ద్వారాలు తెరిచే ఉన్నాయి. ఎవ్వరూ అడ్డు చెప్పక పోవడంతో.. రమణుడు ఆలయంలో కొలువుదీరిన అరుణాచలేశ్వరుణ్ణి సమీపించి.. "తండ్రీ! నీ ఆజ్ఞమేరకు వచ్చేశాను. ఇంక నన్నేమి చేసినా నీ ఇష్టం" అని ప్రణామాలు సమర్పించి, ఇవతలికి వచ్చేశాడు. అంతటితో కొన్ని నెలలుగా దహించి వేస్తున్న తాపం తీరిపోయింది. పక్షి గూటికి చేరింది!

ఇంతటితో రమణుల వ్యక్తిగత జీవిత చరిత్ర ముగిసినట్లే! అప్పటికి ఆయన వయస్సు పదిహేడేళ్లు మాత్రమే!

(సశేషం)

● **పింగళి సూర్య సుందరం**

స్వార్థంతోనే సమస్య!

వ్యవసాయంలోకి స్వార్థం ప్రవేశించి భూమిని ఎలా పాడుచేస్తోందో తెలుసుకుందాం.

అందరి దృష్టి ఒక్కటే ఆస్తులు మూటలు కట్టుకుంటయి
అందరి మేలు చూడగల యట్టి విశాలత కానరాదయా
ఇందరి భోజనంబు హరియించి దురాశను కొందరెవ్వరో
విందులనారగించుటకు పృథ్వినీ, సాధ్వినీ కోత బెట్టిరే!

అందరినీ కష్టపెట్టి, కొందరు సుఖపడటం ఏమిటి! ప్రపంచంలో అన్ని రకాల సమస్యలకూ మూలం ఇది. దీన్ని అరికట్టడం కోసమే రాజ్యాంగం, ప్రభుత్వం! అక్రమంగా సంపాదించేవాళ్లు వాటిని కూడా కొనేస్తారు. ఏ పంట వేయాలి? ఎప్పుడు వేయాలి? పొగాకు సాగు చేసినంత వరి సాగు చేస్తున్నామా? పొగాకు తాగడం దుర్వ్యసనం. అయినా ఆ అలవాటును మానుకోలేం. సినిమాల్లో సిగరెట్ తాగడం, మద్యం తాగడం చూపిస్తారు. కింద చిన్నగా హానికరం అని వేస్తుంటారు. సిగరెట్ తాగడం, మద్యం తాగడం చూపించకుండా సినిమా తీయలేరా నేటి దర్శకులు! పూర్వం నాటకాల్లో ప్రజలను బాధపెట్టే విషయాలేవీ ప్రదర్శించేవారు కాదు. సినిమా అంటే కళ. దాన్ని దేశభక్తికి, సామాజిక ప్రయోజనాలకు వినియోగించవచ్చు. గతంలో వినియోగించారు. ఇప్పుడు అంతా లాభంపైనే దృష్టి. వ్యవసాయం నుంచి సినిమాల వరకు అంత వ్యక్తుల లాభంపైనే ఆలోచనంతా!

"ఎక్కడో దూరదేశముల ఎవ్వరో క్రొవ్వున, ఒంటి నిండా మత్తెక్కిన వేళ తిందురట

ఇక్కడి రొయ్యల మాంసము అందుకై చక్కని పంట భూములన్ సాగరముల్ ఒనరించినారు

నీరెక్కువ, ఖర్చులెక్కువ, పదింతలకెక్కువ కల్మశాత్రువుల్"

ఈ పంటల వల్ల ఎవరికి లాభం చేకూరుతోంది- కొందరు వ్యక్తులకు తప్పితే! ఆ వ్యక్తులకైనా లాభం ఎన్నాళ్లు వస్తోంది! కొద్దిగా నీళ్లందుకుని చక్కని పంటనిచ్చే భూములను చేపల చెరువల పేరిట నీటితో నింపేస్తున్నారు. తీరా వీటికి ఖర్చులు కూడా ఎక్కువే. దానివల్ల కాలుష్యం కూడా అధికమే!

❖❖❖

నాకు హనుమంతుడు ఆదర్శం. పని చేయాల్సిన చోట చిత్తశుద్ధితో చేయాలి. మిగతా చోట రామ..రామ.. అనుకుంటూ ఉండాలి. భగవంతుడు నాకు టీవీల్లోనో, సభల్లోనో రెండు గంటలు మాట్లాడే అవకాశం ఇచ్చాడు. దాన్ని కర్తవ్యంగానే భావించాను. నా ప్రసంగంలో ఏదైనా నిక్కచ్చిగానే



నవజీవన వేదం

చెబుతాను. అది హనుమంతుడు సముద్రం దూకినట్టుగానే ఉంటుంది. నాది సెలయేటి ప్రవాహం కాదు, సాగరఘోష. ఆ రెండు గంటలు పోగా, రోజులో మిగతా 22 గంటలూ నా కాలక్షేపం ఒక్కటే. నిద్రపట్టే వరకు 'నమఃశివాయ... నమఃశివాయ' అంటుంటాను. అన్నం తింటున్నా, స్నానం చేస్తున్నా అంటూనే ఉంటాను. మళ్లీ ఈ విషయాలేవీ ఆలోచించను. జపం ఒక్కటే చేస్తాను. అన్ని విషయాల గురించి, రోజంతా ఆలోచిస్తే గుండెకు పట్టేస్తుంది. భగవంతుడు నాకు వాక్‌శక్తి ఇచ్చాడు. సమయం ఇచ్చాడు. నా ప్రయత్నం నేను చేస్తాను. వినేవారు వింటారు. ఎవ్వరూ వినడం లేదని మానేయడం తప్పే! అలాగని ఇది పరమకర్తవ్యమని ఇరవై నాలుగు గంటలూ ఇదే ఆలోచించడమూ తప్పే! అదే మనం హనుమంతుడి నుంచి నేర్చుకోవాలి. అనవసరపు ఆలోచనలే బుర్రను పాడు చేస్తాయి. అనవసరపు మాటలు మనతో పాటు ఎదుటివాడిని పాడు చేస్తాయి. అనవసరపు పనులు లోకాన్ని కూడా పాడు చేస్తాయి.

❖❖❖

ప్రస్తుతం రకరకాల పంటలు పండించి, భూదేవిని ఎంత బాధపెడుతున్నామో తెలియంది కాదు.

"ఒకటియె, రెండె, మూడెయని ఉక్కిరిబిక్కిరి చేసి శక్తి చాలక విలపింపగా
ఎరువులను బెలిపించి భూమినెల్ల మీరు కలుషితంబొనర్చిరి
ఇది లోకువగా క్రిమికీటకములున్ పకపక నవ్వి
మీ కలల పంటలు మ్రింగవె చూచుచుండగా"

ఒకటి, రెండు, మూడు పంటలు అని అత్యాశకు పోయి భూమిని పిండేస్తే ఎక్కడి నుంచి వస్తాయి పంటలు! రకరకాల పంటలు వేసి, రకరకాల ఎరువులు వేసి భూమిని కలుషితం చేస్తున్నారు. సారం లేకపోయినా పండాలి అని కృత్రిమ సారం వేసి పండించేందుకు ప్రయత్నిస్తున్నారు. రకరకాల ఎరువులు వాడటం వల్ల క్రిమికీటకాలు పెరిగాయి. దీనివల్ల పంట పండకుండా పోతుంది. ఇదెంత దారుణం!



● **డా. గరికిపాటి నరసింహారావు**

డైలీ సుడోకు - 150

	3			4	7			
1		5						
	4		9			8		
	2	4			6			
3	9		5		2		6	8
			4			1	5	
		9			4		1	
						7		4
			1	8			9	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 149 సమాధానం





దమ్మిడి రాబడి లేకున్నా షేరు మార్కెట్లో డాబు

డొల్ల కంపెనీల్లో ఇరుక్కుపోయిన ఇన్వెస్టర్లు

అన్నీ డొల్ల కంపెనీలేనా కాదా అన్నది వేరే విషయం. అందులో అత్యధిక భాగం చిల్లర కంపెనీలన్నది మాత్రం నిజం. అమ్మకాలు, ఆదాయాలులేని కంపెనీలు, ఏటా నష్టాలను ప్రకటించే కంపెనీలు.. అయినా ఈ కంపెనీల షేర్లు కూడా మార్కెట్లో కళకళలాడుతున్నాయి. పెద్ద సంఖ్యలో రిటైల్ ఇన్వెస్టర్లు ఈ కంపెనీల షేర్లలో ఇరుక్కుపోయారు. సెబి వేటుతో ఒక్కసారిగా ఈ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసిన మదుపరుల్లో చలనం వచ్చింది. దాదాపు 36 లక్షల మంది ఇన్వెస్టర్లు ఈ కంపెనీల్లో మదుపు చేసినట్టుగా చెబుతున్నారు. సెబి డొల్ల కంపెనీలుగా గుర్తించిన 331 కంపెనీల్లో 162 బిఎస్ఇలో లిస్టయినవే. ఇందులో 50 కంపెనీలు గత నాలుగేళ్లుగా నష్టాలను ప్రకటిస్తున్నాయి. పాతిక కంపెనీల పద్దుల్లో గతేడాది అమ్మకాల రాబడి జీరో ఉంది. అయినా ఈ కంపెనీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 95 శాతం వరకు ఉంది. అత్యధిక శాతం కంపెనీల షేర్ల ధర భారీ స్థాయిలో ఏమీ లేదు. ఇవన్నీ పెన్నీ స్టాక్సే. ఇవికాకుండా పెద్ద కంపెనీలూ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కంపెనీలు అణా కానీ కంపెనీలతో తమను కూడా జతకట్టి డొల్ల కంపెనీలుగా పేర్కొనడాన్ని సవాలు చేస్తూ సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లాయి.

- సెబి నిషేధం విధించిన స్టాక్స్‌లో బి గ్రూప్ కంపెనీలు ఎఫ్‌సిఎస్ సాఫ్ట్‌వేర్, పార్శ్వనాథ్ డెవలపర్స్, జెనిత్ బిర్లా, నూటెక్ ఇండియా ఉన్నాయి. ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 6 కోట్ల రూపాయల నుంచి 1,000 కోట్ల రూపాయల వరకు ఉంటుంది.
- రోహిత్ ఫెర్రో టెక్, అంకిత్ మెటల్ పవర్, ఇంపెక్స్ ఫెర్రో టెక్, కౌసల్య ఇన్‌ఫ్రా కూడా సెబి జాబితాలో ఉన్నాయి. రోహిత్ ఫెర్రో 2014-17 మధ్యకాలంలో ప్రకటించిన నష్టాల విలువ రూ.1,400 కోట్లు. ఈ నాలుగేళ్ల కాలంలో కంపెనీ అమ్మకాలు రూ.2,500 కోట్ల నుంచి రూ.658 కోట్లకు పడిపోయాయి. ట్రేడింగ్ నిలిపివేసే సమయానికి రోహిత్ ఫెర్రో టెక్ షేరు ధర రూ.58.6.
- ఇ-లెర్నింగ్, డిజిటల్ కంటెంట్ సర్వీసుల్లోని ఎఫ్‌సిఎస్ గతేడాది 36 కోట్ల రూపాయల అమ్మకాల రాబడిపై 46 కోట్ల రూపాయల నష్టాన్ని ప్రకటించింది. మార్కెట్లో పెద్దగా ఎవరికీ తెలియని అంకిత్ మెటల్ అండ్ పవర్ నాలుగేళ్ల కాలంలో సుమారు 926 కోట్ల రూపాయల నష్టాలను మూటగట్టుకుంది. 2015-16లో 1,400 కోట్ల రూపాయల అమ్మకాలను ప్రకటించిన ఈ కంపెనీ 2016-17లో 22 కోట్ల రూపాయల అమ్మకాల రాబడితో సరిపెట్టింది. కంపెనీ షేర్ హోల్డర్లతో నాలుగో వంతు రిటైల్ ఇన్వెస్టర్లే.
- సికోజీ రియల్టర్స్, బిసిల్ ప్లాస్ట్, పాల్కో, సునీత్ కెమికల్స్, క్రేజీ ఇన్ఫోటెక్, గోయల్ అసోసియేట్స్... వంటి కంపెనీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 90 శాతం వరకు ఉంది. ఎటిఎన్ ఇంటర్‌నేషనల్, జివి ఫిల్మ్స్, మాత్ర రియల్టీ, ఖ్యాతీ మల్టీమీడియా, జయ్ ఎనర్జీల్లో కూడా రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య ఎక్కువగా ఉంది.

జెకుమార్, ప్రకాష్ ఇండస్ట్రీస్ ట్రేడింగ్ నిలిపివేతపై స్టే

డొల్ల కంపెనీలపై చర్యలో భాగంగా జెకుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ప్రకాష్ ఇండస్ట్రీస్ షేర్ల ట్రేడింగ్ నిలిపివేస్తూ స్టాక్ ఎక్స్ఛేంజిలు తీసుకున్న నిర్ణయంపై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ స్టే ఇచ్చింది. డొల్ల కంపెనీలుగా తమపై వేసిన ముద్రను సవాలు చేస్తూ ఈ రెండు కంపెనీలు శాట్‌లో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. శాట్ ఆ రెండు కంపెనీల షేర్ల ట్రేడింగ్‌పై ఆంక్షలను ఎత్తివేయడంతో శుక్రవారం ఈ రెండు షేర్లలో ట్రేడింగ్ తిరిగి ప్రారంభం అవుతుంది.



ఫోక్స్‌వేగన్‌కు టాటా మోటార్స్ రాంరాం

న్యూఢిల్లీ : ఫోక్స్‌వేగన్ గ్రూప్‌నకు చెందిన స్కోడాతో భాగస్వామ్యంపై చర్చలను టాటా మోటార్స్ నిలిపివేసింది. భాగస్వామ్యం సాధ్యాసాధ్యాలపై తాము నిర్వహించిన ఉమ్మడి సాంకేతిక అధ్యయనంలో వ్యూహాత్మక ప్రయోజనాలు ఉభయులకు ఆశించిన స్థాయిలో ఉండబోవని తేలడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్టు టాటా మోటార్స్ ప్రకటించింది. భాగస్వామ్యం కోసం ఉభయ సంస్థలు ఒక అంగీకారానికి వచ్చిన నాలుగు నెలల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. అయితే ఫోక్స్‌వేగన్ గ్రూప్‌తో భవిష్యత్ భాగస్వామ్యానికి ద్వారాలు తెరిచే ఉంటాయని స్పష్టం చేసింది. టాటా మోటార్స్ ఎండి, సిఇఒ గుంటర్ బుచెక్ ఈ విషయం చెప్పారు. స్కోడాతో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని టాటా మోటార్స్ ఈ ఏడాది మార్చిలో ప్రకటించింది. భారతీయ వాతావరణ పరిస్థితులకు అనువైన కార్లను ఉమ్మడిగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని, 2019లో ఈ భాగస్వామ్యంలో తొలి వాహనం మార్కెట్‌లోకి రావచ్చునని పేర్కొంది. అయితే ఉమ్మడి ప్లాట్‌ఫారంను ఎలా ఉపయోగించుకోవాలన్న అంశంపై ఉభయుల మధ్య విభేదాలు తలెత్తాయన్న విషయం జూన్‌లో తొలిసారిగా బయటపడింది. టాటా మోటార్స్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ మాడ్యులర్ ప్లాట్‌ఫారంను ఫోక్స్‌వేగన్ టెక్నాలజీతో కలిపి ఉపయోగించడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని కంపెనీ తెలిపింది.

నాలుగో రోజూ తప్పని నష్టాలు

నెల రోజుల కనిష్ఠానికి సెన్సెక్స్



ముంబై: క్షిపణి కార్యక్రమం విషయంలో ఉత్తర కొరియా, అమెరికా పరస్పరం బలప్రయోగానికి సిద్ధపడుతున్నట్టు వచ్చిన వార్తలతో స్టాక్ మార్కెట్ నాలుగో రోజు కూడా నష్టాల బాటలో పయనించింది. సెన్సెక్స్ మరో 267 పాయింట్లు నష్టపోగా నిఫ్టీ కీలక మద్దతు స్థాయి 9900 కన్నా దిగజారింది. డొల్ల కంపెనీలపై సెబి ఉక్కుపాదం మోపిందన్న వార్తలతో తిరోగమనంలో ప్రవేశించిన స్టాక్ మార్కెట్ అమెరికా, ఉత్తర కొరియా ఉద్రిక్తతలతో నష్టాల్లో పతాకస్థాయికి చేరింది. గురువారం సెన్సెక్స్ ప్రారంభంలో రికవరీ బాటపట్టినా కొరియా ఉద్రిక్తతల నేపథ్యంలో నష్టాల బాటలోకి మళ్లి 31,422.80 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకి చివరికి 266.51 పాయింట్ల నష్టంతో 31,531.33 పాయింట్ల వద్ద క్లోజయింది.

జూలై ఏడో తేదీ తర్వాత సెన్సెక్స్ ఇంత కనిష్ఠ స్థాయికి దిగజారడం ఇదే ప్రథమం. నిఫ్టీ 87.80 పాయింట్ల నష్టంతో 9820.25 పాయింట్ల వద్ద ముగిసింది. ఐషర్ మోటార్స్ స్క్రిప్ కూడా నష్టపోయింది. ఇది బుల్ మార్కెట్‌లో మందగమన స్థితి అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు. షెల్ కంపెనీలపై సెబి చర్య వల్ల వచ్చే ఒకటి రెండు త్రైమాసికాల్లో వ్యాపార వృద్ధి మందగించే అవకాశం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

టాటా మోటార్స్

క్యూ1 ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం టాటా మోటార్స్ కౌంటర్‌లో అమ్మకాల ఒత్తిడిని పెంచింది. ఈ స్క్రిప్ 9 శాతం మేరకు నష్టపోవడంతో ఒక్కరోజులోనే మార్కెట్ విలువ 10,351 కోట్ల రూపాయల మేరకు దిగజారి 1,09,979.10 కోట్ల రూపాయలకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండింటిలోనూ ఈ స్క్రిప్ భారీగా నష్టపోయిన స్క్రిప్‌లలో అగ్రగామిగా నిలిచింది.

లిస్టింగ్‌లోనే నిరాశపరిచిన ఎస్ఐఎస్ షేరు

సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ (ఎస్ఐఎస్) షేరు లిస్టింగ్ అయిన తొలిరోజునే ఏడు శాతం మేరకు నష్టాలతో ముగిసింది. బిఎస్ఇలో ఈ షేరు 7.36 శాతం ప్రీమియంకు లిస్టింగ్ అయి 878 రూపాయల గరిష్ఠ స్థాయిని తాకినప్పటికీ ప్రారంభలాభాలన్నీ తుడిచిపెట్టుకుపోవడంతో చివరిలో 7.11 శాతం నష్టంతో 757.05 రూపాయల వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ 5535.94 కోట్ల రూపాయల వద్ద ఉంది. ఐపిఒ సమయంలో షేరు ధర శ్రేణి 805-815 రూపాయలు.

నేడు కొచ్చిన్ షిప్‌యార్డ్ లిస్టింగ్

ఐపిఒ సమయంలో మంచి ఆదరణ సాధించిన కొచ్చిన్ షిప్‌యార్డ్ శుక్రవారం లిస్టింగ్ కానుంది. ఈ నెల 1-3 తేదీల మధ్య మార్కెట్లో ఉన్న ఈ ఇష్యూ 76.19 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. షేరు ధర శ్రేణి రూ.424-432.

ఫార్మా షేర్లపై కొనసాగిన ఒత్తిడి

ఫార్మా షేర్లలో ఒత్తిడి కొనసాగుతోంది. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ వరుసగా ఏడో రోజు భారీ నష్టాన్నే నమోదు చేసింది. ఈ ఇండెక్స్ గురువారం 253 పాయింట్లు (2.89 శాతం) దిగజారి 8513 వద్ద ముగిసింది. మధ్యాహ్నం సెషన్‌లో జీవితకాల కనిష్ఠ స్థాయి 8391ని తాకింది. గ్లెన్‌మార్క్ 5.76 శాతం నష్టంతో నష్టాల్లో అగ్రస్థానంలో నిలవగా డాక్టర్ రెడ్డీస్ (5.04 శాతం), క్యాడిలా హెల్త్‌కేర్ (3.28 శాతం), సన్ ఫార్మా (3.08 శాతం), సిప్లా (2.67 శాతం), పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ (2.33 శాతం), దివీస్ (1.42 శాతం), లుపిన్ (0.93 శాతం)నష్టపోయాయి.

యాంబీ వ్యాలీ వేలం నిలిపివేతకు 'సుప్రీం' నో

మహారాష్ట్రలోని పుణెలో యాంబివ్యాలీలో తమ ప్రాజెక్టు వేలంపై స్టే ఇవ్వాలన్న సహారా చీఫ్ సుబ్రతారాయ్ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సెబి సహారా ఖాతాకు 1,500 కోట్ల రూపాయలు జమ చేసేందుకు రాయ్‌కి అవకాశం ఇస్తూ సెప్టెంబర్ వరకు ఈ వేలం నిలిపి ఉంచాలని సహారా న్యాయవాది కపిల్ సిబల్ కోర్టుకు నివేదించారు.

9800 వద్ద నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ

నిఫ్టీ మరింత కరెక్షన్‌లో ప్రారంభమై మానసిక అవధి 9800 వరకు దిగజారి చివరిలో రికవరీతో ఆ స్థాయి కన్నా పైన ముగిసింది. స్వల్పకాలిక ట్రెండ్ బలహీనంగా ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను నిలబెట్టుకునేందుకు 9800 కన్నా పైన బలమైన కన్సాలిడేషన్ తప్పనిసరి. స్వల్పకాలిక 20 డిఎంఎ కన్నా దిగజారినా 50 డిఎంఎ వద్ద రికవరీ కనబరుస్తోంది.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 9850 మద్దతు : 9800

- రికవరీబాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 9850 పాయింట్లకన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 9900. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఉంటుంది.
- మద్దతు స్థాయి 9800 కన్నా దిగువన క్లోజయితే మరింత కరెక్షన్ ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 9700.
- బ్యాంక్ నిఫ్టీ కీలక స్థాయి 24000 వద్ద మంచి రికవరీ సాధించింది. ఇక్కడ మద్దతు తీసుకున్నట్టు కనిపిస్తోంది.

■ వి.సుందర్ రాజా

ద్వితీయార్ధం నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : శ్రావణ బహుళ చతుర్థి **నక్షత్రం :** ఉత్తరాభాద్ర

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 9820.25 (– 87.80)

ట్రెండ్ మార్పు వేళలు : 11.52

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 9.45 నుంచి 11.45 మధ్యలో రికవరీ సాధించి ఆ తర్వాత ముగింపు వరకు కూడా నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు: 9860, 9895

మద్దతు స్థాయిలు: 9780 9745

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinancialastrologer.blogspot.in

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	29,830	29,800	29,730	29,070	--
క్రితం ముగింపు	29,470	29,640	29,550	28,730	--
22 క్యారెట్లు	29,230	27,700	27,590	28,920	27,760
క్రితం ముగింపు	28,880	27,500	27,370	28,580	27,270
వెండి (కిలో)	39,800	40,300	39,900	38,995	--
క్రితం ముగింపు	39,000	39,200	39,000	37,875	--

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	77.00	గోదావరి	77.00
కరీంనగర్	78.00	విజయవాడ	79.00
వరంగల్	77.00	గుంటూరు	80.00
మహబూబ్‌నగర్	77.00	ఒంగోలు	81.00
కర్నూలు	77.00	చిత్తూరు	78.00
విశాఖపట్నం	78.00	నెల్లూరు	78.00

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.95 నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	335.00	వరంగల్	337.00
విజయవాడ	343.00	చెన్నై	382.00
గోదావరి	343.00	నమక్కల్	370.00
బెంగళూరు	365.00	చిత్తూరు	375.00
విశాఖపట్నం	348.00	ముంబై	380.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో...)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.21	67.49
పౌండ్	75.62	87.74
యూరో	68.34	79.25
ఆస్ట్రేలియా డాలర్	45.81	53.00
బహ్రెయిన్ దినార్	157.72	180.85
కువైట్ దినార్	175.15	218.10
ఒమని రియాల్	154.33	176.61
సౌదీ రియాల్	15.48	18.35
సింగపూర్ దాలర్	42.66	50.55
యుఎఇ దిరమ్	15.84	18.52

FOREX

ఎన్ఎస్ఇ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా.. NSE

AARTIDRUGS 526.8(551.25)7991
AARTIIND 894.25(926.85)16330
ABAN 168.55(175.8)625990
ABB 1341.6(1386.35)47753
ABFRL 168.2(169)597867
ABGSHIP 12.65(13.3)32069
ACC 1776.7(1819.5)335802
ADANIENT 115.85(124.25)5134939
ADANIPORTS 385.65(397.25)3177276
ADANIPOWER 28.7(31.55)15563130
ADANITRANS 116.9(122.8)1220955
AEGISCHEM 178.1(185.45)169064
AHLUCONT 264.9(271.3)8600
AIAENG 1382.95(1434.3)11306
AJANTPHARM 1210.8(1218.45)328890
AKZOINDIA 1763.8(1803.7)7398
ALBK 65.7(68.85)3394795
ALLCARGO 162.65(164.1)310466
ALOKTEXT 2.85(3.05)6434565
AMARAJABAT 800.25(805.2)213527
AMBUJACEM 267.45(273.2)1402846
AMTEKAUTO 25.25(26.25)954707
ANANTRAJ 52.65(55.5)1441352
ANDHRABANK 50.8(54.1)3879893
APARINDS 721.2(745.45)32071
APLLTD 523.65(526.15)72666
APOLLOHOSP 1213.8(1220.55)218907
APOLLOTYRE 262.6(270.25)4651785
ARVIND 368.5(377.35)1944042
ASHIANA 179.1(185.25)44841
ASHOKA 178(180.7)676709
ASHOKLEY 103.45(109.6)12732108
ASIANPAINT 1151.1(1155.55)649594
ASTRAL 646.65(650.9)134545
ASTRAZEN 905.6(905.1)6095
ATUL 2036(2057.25)15318
AUROPHARMA 685.25(683.6)9038989
AVANTIFEED 1576.5(1703.05)280169
AXISBANK 485.5(486.95)10095387
BAJAJ-AUTO 2796.2(2831.15)497306
BAJAJCORP 405.25(402.45)38003
BAJAJELEC 302.3(319.95)136908
BAJAJFINSV 5024.75(5121.9)237901
BAJAJHIND 14.6(14.85)5962366
BAJAJHLDNG 2499.95(2554.1)21313
BALKRISIND 1529.35(1587.9)145449
BALLARPUR 14.05(15)1640392
BALMLAWRIE 227.4(242.1)183739
BALRAMCHIN 160.15(166.35)1225686
BANKBARODA 148.45(155.2)10557366
BANKINDIA 148.15(158.45)13264178
BASF 1404.95(1427.95)24823
BATAINDIA 632.05(636.55)802071
BBTC 880.25(880.3)195282
BEML 1492(1624.7)1073437
BERGEPAINT 247.35(256.1)519774
BFUTILITIE 324.85(348.25)310711
BGRENERGY 128.9(136.55)95249
BHARATFIN 780.25(797.3)2366053
BHARATFORG 1142.85(1165.75)3164092
BHARTIARTL 416.05(335.5)121000
BHARTIARTL 416.25(416.05)1497110
BHEL 126.75(133)17170905
BHUSANSTL 65.3(67.25)565134
BIOCON 331.1(339)1985991
BIRLACORPN 949.25(947.75)115384
BLISSGVS 158(163.6)238210
BLUEDART 3875.05(3952.2)8064
BLUESTARCO 656.5(680.3)37856
BOMDYEING 69.55(78.1)1552350
BOSCHLTD 23543.8(24032)29585
BPCL 481.5(495.95)4848050
BRFL 129.85(136.65)259769
BRIGADE 252.65(263.85)97831
BRITANNIA 4119.2(4058.9)326587
CADILAHC 466.15(485.45)1599352
CANBK 330.7(343.95)2096026
CANFINHOME 2832.35(2859.95)114047
CAPF 705.1(749.8)760271
CARERATING 1575.4(1593.7)53255
CASTEXTECH 6(6.3)786471
CASTROLIND 378(388.35)490087
CCL 272.15(284.85)43188
CEATLTD 1699.3(1689.6)1299363
CENTRALBK 82.05(85.05)592774
CENTURYPLY 251.8(264.8)267801
CENTURYTEX 1170.95(1244.65)1579562
CERA 2805(2895.45)17455
CESC 909.95(959.5)655138
CHAMBLFERT 124.6(135.7)1388153
CHENNPETRO 381.7(398.25)1986523
CHOLAFIN 1159(1171)214029
CIPLA 548.2(561.85)1217416
CLNINDIA 586.85(612.55)31727
COALINDIA 238.95(242.5)2764860
COLPAL 1054.65(1056.75)186856
CONCOR 1145.45(1168.85)232209
COROMANDEL 400.5(423.55)191419
CORPBANK 46.4(50.25)641574
COX&KINGS 269.1(271.95)238480
CRISIL 1816.1(1840.05)11674
CUB 156.85(162)449487
CUMMINSIND 893(904.35)399739
CYIENT 507.6(524.3)20569
DABUR 306.55(310.5)566291
DALMIABHA 2474.75(2556.1)132076
DBCORP 368.35(379.05)31499
DBREALTY 34.2(36.8)1160575
DCBBANK 172.95(181.4)3772606
DCMSHRIRAM 364.65(373.2)123879
DEEPAKFERT 334.6(351.6)312427
DELTACORP 162.45(168.85)2699415
DEN 76.6(81.75)140292
DENABANK 31.75(32.5)656885
DHANUKA 758.4(776.9)18919
DHFL 406.35(427.85)2707782
DISHTV 71.65(74.2)5557902
DIVISLAB 626.1(639.05)1219649
DLF 164.6(178.85)14065209
DREDGECORP 568.2(605.55)165770
DRREDDY 1944.45(2048.35)1540007
DYNAMATECH 2219.25(2255.8)2132
ECLERX 1248.8(1285.25)4933
EDELWEISS 232.5(250.4)4249356
EICHERMOT 30111.7(31489.1)77024
EIDPARRY 302.55(307.4)174583
EIHOTEL 131.25(131.3)96105
ELECTCAST 26.8(27)876968
ELGIEQUIP 223(226.15)40606
EMAMILTD 1091.85(1128.65)57315
ENGINERSIN 146.3(155.2)2747620
EROSMEDIA 195.75(209.6)910797
ESCORTS 588.1(636.15)1993930
ESSDEE 33.9(36.55)39768
ESSELPACK 240.5(242.25)37714
EVEREADY 307.85(303.7)64442
EXIDEIND 199.95(207.2)2532119
FCONSUMER 39(40.55)3857086
FDC 171(173.9)19087
FEDERALBNK 104.7(108.3)8889947
FINCABLES 490.25(490.45)239192
FINPIPE 580.95(582.5)39387
FLFL 314.2(317.3)89007
FORTIS 151.85(158.6)7245672
FSL 34.05(35.5)2450829
GAIL 365(382.2)2642144
GATI 109.25(114.55)491092
GDL 253.5(263.7)75657
GEPIL 659.65(672.95)18343
GESHIP 375.3(388)457358
GET&D 375.8(378.6)136575
GILLETTE 5128.45(5241.3)16854
GLAXO 2374.55(2392.1)10605
GLENMARK 612.75(645.45)1099021
GLOBOFFS 33(34.1)31857
GMDCLTD 133.7(138.75)1086050
GMRINFRA 15.9(16.95)35718794
GODFRYPHLP 900.9(985.7)128908
GODREJCP 901.75(921.8)664863
GODREJIND 576.7(601.9)877923
GODREJPROP 498.6(500)159278
GPPL 135.95(138.45)476410
GRANULES 107.05(116.8)2658788
GREAVESCOT 149.65(154)145819
GREENPLY 268.55(273)65586
GRINDWELL 371.35(393.7)39056
GRUH 464.55(478.3)133046
GSFC 119.55(123.5)2546037
GSKCONS 5411.15(5409.85)4206
GSPL 178.55(186.4)345261
GUJFLUORO 753.65(782.65)105839
GUJGASLTD 748.2(787.6)25717
GULFOILLUB 802.55(803.75)394361
GVKPIL 12.05(12.95)15028467
HATHWAY 30.5(31.5)137133
HAVELLS 463.65(497.95)2008418
HCC 33.75(34.65)13143828
HCL-INSYS 41.75(43.6)1322161
HCLTECH 882.9(878.75)846537
HDFC 1709.8(1731.65)3177026
HDFCBANK 1760.45(1764.45)1947111
HDIL 56.2(57.2)54747748
HEIDELBERG 113.7(117.6)114863
HEROMOTOCO 3889.55(3883.75)303409
HEXAWARE 253.75(260.2)1041495
HFCL 15.15(16.55)9120700
HIMATSEIDE 294.35(315.55)607414
HINDALCO 238(239.45)10897284
HINDCOPPER 60.9(62.45)784574
HINDPETRO 412.45(429.65)6413893
HINDUNILVR 1170.7(1185.35)699787
HINDZINC 280.8(286.65)2461891
HMT 33.25(34.6)3971
HMVL 266.75(268.55)6409
HONAUT 12554.95(12612.15)747
HOTELEELA 20.7(21.45)360717
HSIL 360.9(356.7)65649
HTMEDIA 82.8(84.3)126059
IBREALEST 227.95(249.4)26263179
IBULHSGFIN 1156.5(1159)1753712
ICICIBANK 288.75(290.6)17225844
ICRA 3877.6(3930.5)1011
IDBI 53.8(55.95)3142851
IDEA 87.95(91.05)10457668
IDFC 54.65(56.4)7875252
IFBIND 647(659.85)4825
IFCI 22.8(24.45)9621153
IGARASHI 987.45(1005.9)29447
IGL 1214.2(1231)381209
IIFL 567.45(595.85)116887
IL&FSTRANS 76.1(83.45)594408
INDHOTEL 124.75(126.15)305563
INDIACEM 174.8(186.3)6958468
INDIANB 273.85(296.2)932333
INDOCO 192.8(197.75)97449
INDUSINDBK 1629.4(1637.25)709628
INEOSSTYRO 843.5(954.1)81011
INFRATEL 382.45(381.7)3050083
INFY 981.25(969.35)4570342
INGERRAND 787.55(800.7)10965
INOXLEISUR 233.7(245.3)59034
INOXWIND 118.1(132.8)1036387
INTELLECT 100.9(105)303006
IOB 23.1(23.95)1300261
IOC 410.3(414.05)4239237
IPAPPM 284.55(297.9)39215
IPCALAB 419.85(436.95)210690
IRB 200.75(211.45)2232732
ITC 273.1(272.85)9995867
J&KBANK 75(79.2)381104
JAGRAN 174(178.7)62882
JAICORPLTD 72.25(77.2)576364
JBCHEPHARM 284.9(293.6)82516
JBFIND 153.75(145.15)1213335
JCHAC 1928.05(1974.4)7070
JETAIRWAYS 560.3(613.7)3028441
JINDALPOLY 376.2(392.4)68162
JINDALSTEL 123.3(135.95)16399537
JISLJALEQS 92.15(99.4)6146616
JKCEMENT 1015.75(1026.2)33636
JKLAKSHMI 417.6(429.45)66429
JKTYRE 149.55(155.2)1126335
JMFINANCIL 117.4(124.25)775834
JPASSOCIAT 23.3(25.6)124038759
JPINFRATEC 18.85(19.8)1086330
JPPOWER 6.25(6.8)12156815
JSWENERGY 64.9(70.55)10479145
JSWHL 1730.7(1816.3)2583
JUBILANT 642.9(669.2)423132
JUBLFOOD 1317.95(1299.2)1926331
JUSTDIAL 339.2(361.75)1951880
JYOTHYLAB 381.1(374.15)166472
KALPATPOWR 339.2(351.25)23833
KANSAINER 444.8(451.9)75167
KEC 290.15(300.5)392489
KESORAMIND 125.35(131)284307
KIRLOSENG 390.05(393.35)7295
KITEX 232.55(244.2)73769
KOLTEPATIL 144.85(155.85)120963
KOTAKBANK 996.8(992.4)2495164
KPIT 108.75(116.1)2001728
KRBL 445.35(457.65)122053
KSCL 530.65(609.15)2871446
KSK 7(7.55)787859
KTKBANK 138.05(146.4)3185613
KWALITY 135.25(139.3)1087513
L&TFH 165.15(172.15)6599252
LAKSHVILAS 171.9(177.35)644841
LAOPALA 469.95(491.85)67253
LAXMIMACH 5809.7(5884.45)8311
LICHSGFIN 657.65(676.9)1870489
LITL 1.05(1.1)596588
LT 1157.7(1153.9)1713614
LUPIN 936.7(952.95)2148029
M&M 1387.05(1392.3)816173
M&MFIN 407.3(423.6)1834107
MAGMA 172.4(172.5)517585
MAHINDCIE 236.05(239.15)127100
MAHLIFE 409.15(420.9)35633
MANAPPURAM 93.3(98.7)6356764
MANPASAND 780.3(763.2)348021
MARICO 320.55(325.7)1679678
MARKSANS 37.25(37.8)1991185
MARUTI 7578.75(7661.6)385730
MAYURUNIQ 322.65(340.9)79778
MCDOWELL-N 2490.8(2535.95)498106
MCLEODRUSS 173.6(178)166534
MERCK 1136.3(1194.4)32365
MHRIL 350.4(371.6)102927
MINDACORP 103.45(104)304536
MINDTREE 451.3(464.35)220211
MMTC 55.45(57.05)1531757
MOIL 327.65(335.95)149237
MONSANTO 2547.6(2622.25)9483
MOTHERSUMI 317.45(329.05)12066170
MOTILALOFS 1086.05(1093.5)110203
MPHASIS 572.9(581.5)57842
MRF 64100.7(65946.95)14500
MRPL 119.5(134.4)5028311
MTNL 17.75(18.5)690993
MUTHOOTFIN 434.7(457.35)1501790
NATCOPHARM 695.75(829.45)5150800
NATIONALUM 65(70.4)5533246
NAUKRI 991.45(1037.1)39422
NAVKARCORP 184.85(189.45)154520
NCC 83.25(89.6)5567130
NETWORK18 51.05(52.25)494825
NHPC 30.05(30.85)7383280
NIITTECH 475.35(482.45)355151
NITINFIRE 5.25(5.35)543627
NLCINDIA 95.3(98.4)241039
NMDC 121.75(126.15)10395163
NTPC 172.65(173.65)2464637
OBEROIRLTY 362.55(372.65)231440
OFSS 3445.45(3552.9)35816
OIL 281.95(282.05)532772
OMAXE 201.3(202.2)442340
ONGC 163.7(165.7)8412268
ORIENTBANK 126.95(136.05)2839939
ORIENTCEM 153.25(156)381610
ORISSAMINE 1700.85(1780.75)7750
PAGEIND 16204.05(16706.4)28045
PCJEWELLER 296.85(299.25)3095892
PEL 2731.1(2851.55)260386
PERSISTENT 615.05(605.95)87123
PETRONET 208.2(207.45)3959024
PFC 124.55(134.1)17380728
PFIZER 1791.5(1798.7)18319
PFS 38.05(39.15)1612145
PGHH 8017.6(8104.3)1989
PHOENIXLTD 504.45(513.25)47021
PIDILITIND 795.35(795.25)554974
PIIND 700.5(730.05)1504390
PNB 143.15(148.3)8506146
POLARIS 230.15(232.8)207253
POWERGRID 217.4(221.9)3832683
PRAJIND 68.35(73.2)575431
PRESTIGE 251.35(263.25)58814
PRISMCEM 114.4(118.7)217111
PTC 108.75(117.1)4405272
PUNJLLOYD 19(19.9)2186469
PURVA 66.7(72.1)257840
PVR 1332.6(1358)247374
RADICO 139.3(146.4)640276
RAIN 113.1(131.45)3379899
RAJESHEXPO 714.05(718.4)269592
RALLIS 226.7(238.25)168201
RAMCOCEM 666.9(672.65)221683
RAMCOSYS 352.55(370.7)68719
RATNAMANI 810.25(834.7)11100
RAYMOND 723.3(781.15)568067
RCF 94.55(98.35)6392943
RCOM 21.2(22.2)19092243
RDEL 50.95(54.9)2642742
RECLTD 163.75(175.25)12961161
REDINGTON 140.55(142.7)455694
RELAXO 485.8(490.75)21641
RELCAPITAL 764.25(799.5)7274484
RELIANCE 1584.35(1598.8)2328843
RELINFRA 474.45(514.4)3722914
RENUKA 16.85(17.8)4011182
REPCOHOME 640.9(674.9)193783
RIIL 408(428.4)198072
RKFORGE 526.8(564.2)53162
ROLTA 52.5(54.55)369827
RPOWER 39(41.25)3632908
RTNPOWER 5.95(6.15)2739979
RUCHISOYA 20.6(22.05)450782
SADBHAV 278.55(283.95)116793
SADBHIN 102.25(101.35)24633
SAIL 58.85(61.45)5435430
SANOFI 4171.35(4171.75)8990
SBIN 296.7(302.3)14519518
SCHAEFFLER 4166.4(4298)16258
SCHNEIDER 118.25(124.65)176090
SCI 88(90.6)2549677
SHARDACROP 445.05(445.55)23096
SHILPAMED 551.2(617.15)194382
SHK 252.35(257.05)24954
SHOPERSTOP 339.75(350.65)30611
SHREECEM 17336.3(17945.95)9545
SHRIRAMCIT 2105.9(2140.45)13177
SIEMENS 1289.45(1325.75)247509
SIMPLEXINF 469.2(471.85)16593
SINTEX 27.25(29.5)26689518
SITINET 24.95(25.3)3080853
SJVN 31.45(32.7)356874
SKFINDIA 1523.95(1541.15)3559
SMLISUZU 959.35(986.85)16516
SNOWMAN 50.9(53.6)506191
SOBHA 360.15(373.4)148491
SOMANYCERA 750.1(757.5)10388
SONATSOFTW 149.5(153.55)161965
SOUTHBANK 26.25(27.7)23600510
SPARC 341.05(359.95)281445
SREINFRA 108.6(114.75)2414973
SRF 1473.4(1435.45)702110
SRTRANSFIN 933.75(942.75)1028507
STAR 941.95(978.55)159679
STCINDIA 152.6(163)170486
SUNDARMFIN 1660.55(1722.6)21204
SUNDRMFAST 373.6(384.5)129827
SUNPHARMA 460.8(474.35)10149400
SUNTV 680.8(705.55)1126577
SUPREMEIND 1052.4(1052.6)98298
SUVEN 161(164.65)180176
SUZLON 15.4(16.3)70837694
SWANENERGY 115.4(121.7)448578
SYMPHONY 1205.05(1335.6)235694
SYNDIBANK 63.8(69)3345589
SYNGENE 439.45(451.65)103761
TAKE 148.1(146.6)303491
TATACHEM 576.75(579.05)1066641
TATACOFFEE 119.7(122.1)302308
TATACOMM 594.25(606.95)766184
TATAELXSI 1627.05(1689)302985
TATAGLOBAL 156(162.1)2470478
TATAMOTORS 380.2(416.05)28114017
TATAMTRDVR 221.45(242.25)9343687
TATAPOWER 76.7(77.8)10816439
TATASPONGE 794.4(819.75)120944
TATASTEEL 604.35(605.05)7684041
TBZ 95.85(100.3)296419
TCS 2511.45(2512)763086
TECHM 404(393.85)4990849
TECHNO 355.95(365.6)40926
TEXRAIL 87.05(90.5)532114
THERMAX 861.55(878.6)18414
THOMASCOOK 221.15(223.5)401243
TIDEWATER 5660.35(5774.45)1297
TIMKEN 692.25(680.8)27217
TITAN 610.35(619.15)1378763
TNPL 353.95(360.25)136515
TORNTPHARM 1228.9(1234.7)144495
TORNTPOWER 189.3(195.5)1286165
TREEHOUSE 15.35(15.7)52973
TRIDENT 77.9(83.2)1131513
TRITURBINE 130.05(131.7)94753
TTKPRESTIG 6179.95(6194.05)2392
TTML 6.6(6.95)2637142
TUBEINVEST 753.75(766.5)95853
TV18BRDCST 35.35(36.45)3644861
TVSMOTOR 580.75(590.7)1369241
TVSSRICHAK 3379.45(3438.85)11877
TVTODAY 216.45(228.55)246230
UBL 824.2(832.35)395016
UCOBANK 30.5(31.85)521138
UFLEX 375.2(398.4)299496
ULTRACEMCO 3907.6(3997.85)144452
UNICHEMLAB 245.05(251.95)60031
UNIONBANK 134.45(141.6)4981645
UNITECH 7.4(7.85)55545462
UPL 821.5(830.5)1278567
VAIBHAVGBL 509.15(484.85)54365
VAKRANGEE 449.35(450.25)683030
VEDL 298.8(300.2)14153043
VIDEOIND 19.5(20.5)404222
VIJAYABANK 67.5(67.85)1293475
VINATIORGA 961.45(1016.35)25747
VIPIND 183.8(190.05)464592
VOLTAS 520.15(527.6)1088376
VRLLOG 321.9(333.6)74053
VSTIND 2706.35(2784.75)2406
VTL 1177.25(1195.05)38512
WABAG 613.1(629.65)115642
WABCOINDIA 5425(5492.1)5740
WELCORP 112.25(125.15)624293
WELSPUNIND 72.95(78.45)992506
WHIRLPOOL 1160.8(1173.6)21466
WIPRO 288.15(286.5)2708344
WOCKPHARMA 561.2(584.8)623202
WONDERLA 340.45(345.1)27812
YESBANK 1730.1(1741.55)2132127
ZEEL 520.05(540)2917821
ZEELEARN 39.85(41.45)452049
ZENSARTECH 808.65(809.35)29093
ZYDUSWELL 882.1(885.05)6253

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

BSE

ACI INFOCOM 6.95(6.95)178
ADITYA SPIN. 9(9.1)100
AGRO TECH FO 508.25(511)1917
AISHWARYA TE 4(4.1)4275
ALPHAGEO (I) 787.15(806.15)5924
ALU FLUORIDE 53.6(56.45)16942
AMAR RAJA BA 798.85(802.45)18169
ANDHRA BANK 50.85(54.15)345820
ANDHRA CEMEN 8.81(9.06)46075
ANDHRA PETRO 24.9(25.6)59902
ANJANI PORTL 200.45(218.8)4183
ASTRA MICRO 120.65(126.75)45778
AUROB.PHARMA 683(684.15)940187
AVANTEL LTD 214.3(223.2)6852
AVANTI FEEDS 1573.4(1703.9)51203
B.N.RATHI SE 30.55(31.85)8457
BALAJI AMINE 300.8(322.85)9273
BAMBINO AGRO 172.55(180.95)3811
BARTRONICSIN 13.65(14.4)26283
BHAGIRA.CHEM 174(165.6)2660
BHAGYA INL 21.9(22.45)3432
BHARATFIN 778.05(796.35)300868
BNR UDYOG 37.6(36.1)3562
CAMBRIDGE 67.25(68.6)2270
CCHHL 12.9(13.55)48056
CCL PRODUCTS 274.2(283.2)2729
CELESTIAL 23.1(24.15)15506
CIL SECURITS 38.6(38)22
COROM INTER 404.15(424.65)34555
CUBEX TUBING 16.2(16.9)5187
CYIENT 508.9(524.6)3132
DANLAW TECH. 50.5(46.9)254
DECAN CEMENT 1070.9(1110.55)187
DHAN ROTO SP 23.75(23.7)110
DIAMONPOWER 23.15(24.25)88248
DIVI'S LAB. 624.65(638.9)172332
DIVYA.GRANIT 93.15(98.05)4590
DQ ENT 12.01(13.1)6212
DR.REDDY'S 1948.95(2046.65)186906
EMPEE SUGARS 5.33(5.59)6403
EVEREST ORG. 97.95(102.85)9307
FACOR ALLOYS 3.61(3.7)131089
FIRSTOBJ 15.75(15.7)4409
GATI LTD. 109.5(114.3)129958
GAYATRI PROJ 151.05(160)3953
GENNEX LAB 4.09(4.19)130099
GMR INFRASTR 15.9(16.95)3012669
GODAVARI DRU 37.1(38.4)4491
GOLDST INFRA 102.2(92.95)108190
GOLDSTONE EN 11.62(12.23)10111
GRANULES (I) 107.3(116.9)317092
GVK POWERINF 12.05(12.93)3219496
HBL P SYS 43.9(44.75)70572
HERITGFOOD 1230.55(1285.45)1825
HINDUSTN BIO .93(.97)1000
I.C.S.A. IND 2.7(2.87)13800
INCAP LTD. 51.1(50.65)6827
IPAPPM 283.25(299.7)12067
IVRCL LTD 5.39(5.69)446729
KAKATIYA CEM 337.55(365.75)9297
KALLAM SPG. 27.8(28)120673
KAVERI SEED 531.5(607.8)166273
KCP LTD 96.1(100.15)38802
KERNEX MICRO 33.25(34.1)57270
KNR CONST 203.35(203.1)4575
KREBS BIOCHM 94.7(99.65)7637
LANCO INFRA 1(1.05)841495
LOKESH MACH 77.1(79.7)23974
MADHUCON PRJ 28.65(29.95)54101
MOLD-TEK TEC 49(51.75)4735
MOSCHIP SEMI 43.5(45.6)90944
MSR INDIA 27.6(26.3)1756
N C L IND. 200.4(207.05)30331
NAGAR.AGRICH 31.1(33.7)57979
NATCO PHARM 696.65(830.6)580031
NCC 82.35(89.65)545216
NEHA INTER. 5.54(5.54)15526
NETTLINX LTD 110.9(107.15)13745
NEULAND LAB. 1228.3(1355.6)1185
NIHAR INFO 13.65(17)130
NILE LTD. 613.85(621.55)11599
NTL 3.8(4.2)11800
OIL COUNTRY 42.6(44.1)3892
PADMALAYA TE 8.19(8.62)16748
PALRED 87.15(91.2)990
PANYAM CEMEN 56.8(60.6)27461
PENNAR STEEL 49.4(51.15)94182
PFL INFOTECH 5.65(5.76)6844
PHYTOCHEM I. 50.1(55.45)12746
PITTI LAMIN. 47.75(50.95)12461
POKARNA LTD 1220.5(1228.35)1325
PRAJAY ENGS. 8.57(9.02)11443
PREMIER EXPL 435.45(459.25)3211
PRISM CEMENT 113.6(117.6)19833
RAIN 112(131.6)778473
RAJ PACKAGIN 53.95(55.2)23799
REG.CERAMIC 5.58(5.55)3112
RESTILE CER. 5.12(5.51)7282
SAGAR CEM. 822.15(824.5)1361
SAMKRG PIST. 251.6(263.1)15840
SAMPRE NUTRI 41(41.7)1323
SANGHI IND. 75.1(84.55)459563
SATVAH.ISPAT 37.5(40.75)10176
SAVEN TECHNO 22.45(22.8)19284
SIBAR AUTO 13.15(12.53)10
SMPL 1.5(1.76)330604
SMS PHARMACE 69.35(73.55)4750
SREE RAYALA 122.1(125.8)2006
STEEL EXCH 84.45(82.85)277280
SUJANA INDUS .93(1.01)114041
SURANATP 4.62(4.8)7547
SURYACHAKRA 1.09(1.23)232677
SURYAMBA SP 51.4(56.05)444
SURYAVA SPIN 9(9.39)188
SURYLAK.COTT 100.35(103.75)14130
SUVEN LIFE S 160.6(164.65)71021
TAJ GVK HOTL 160.2(162.25)3544
TANLA 31.2(33.15)138723
TRANSCORP IN 19.4(18.9)6733
TRANSGENE BI 2.13(2.22)39607
TRANSPORT CO 273.25(280.35)13421
USHER AGRO 6.8(7.14)21153
VICEROY HOTE 17.2(18.3)43224
VIJAY TEXTIL 57.9(60.9)18972
VIMTA LABS 129.6(135.3)6067
VIRAT CRANE 36(36)2997
VIRINCHI 79.6(84.45)78611
VISAKA IND. 431.25(459.85)9974
VISTA PHARMA 29.15(30.65)67616
VIVIMED LABS 109.35(116.55)186848
VST INDUS. 2690.95(2798.2)1863
WATERBASE 111.15(107.45)998452
XLENERGY 1.85(1.76)1800
YBRANTDIGI 6.61(6.81)118725
ZEN TECH 50.7(54.05)30549
ZENOTECH 45.05(47.4)61388

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై)	వెండి	రూపాయి Vs డాలర్	ముడి చమురు
▼ 266.33	▼ 87.80	▲ 340	▲ 1120	▼	▲
31531.33	9820.05	29,070	38,995	64.08	53.51
		10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	కిలో (రూపాయల్లో)		బ్యారెల్ ధర (డాలర్లలో..)



10 కోట్లు దాటిన 'మైజియో' డౌన్‌లోడ్స్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియోకు చెందిన మైజియో యాప్ డౌన్‌లోడ్స్ 10 కోట్ల మైలురాయిని దాటింది. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫామ్‌పై అత్యధికంగా డౌన్‌లోడ్స్ జరిగిన భారత యాప్‌లలో రెండో స్థానంలో మైజియో నిలిచినట్టు కంపెనీ అధికారి తెలిపారు. ఏడాదికన్నా తక్కువ కాలంలోనే ఈ ఘనతను సాధించినట్టు ఆయన చెప్పారు. ఇతర టెలికాం కంపెనీల విషయానికొస్తే.. ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులార్‌లు గూగుల్ ప్లే స్టోర్‌లో కోటికిపైగా డౌన్‌లోడ్స్‌ను సాధించగలిగాయి. ఇక మైజియో యాప్‌లో జియో టీవీ యాప్ 5 కోట్లకు పైగా డౌన్‌లోడ్స్‌ను సాధించింది. ఎయిర్‌టెల్ టీవీ యాప్ 50 లక్షలకు పైగా, వొడాఫోన్, ఐడియా టీవీ యాప్స్ ఒక్కోటి 10 లక్షలకు పైగా డౌన్స్‌లోడ్స్‌ను నమోదు చేసుకున్నాయి. కాగా అత్యధిక డౌన్‌లోడ్స్‌తో మైజియో యాప్‌కన్నా ముందు స్థానంలో హాట్‌స్టార్ నిలిచింది.

భారతి టెలికాం చేతికి ఎయిర్‌టెల్ సిఇఒ వాటా

న్యూఢిల్లీ: టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్‌లో 1.21 లక్షల షేర్లను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ గోపాల్ విట్టల్ విక్రయించారు. ప్రమోటర్ సంస్థ అయిన భారతి టెలికామ్‌కు 5 కోట్ల రూపాయలకు ఈ షేర్లను విక్రయించినట్లు ఎన్ఎ్ఎస్ఇ డేటా వెల్లడించింది. సగటున ఒక్కో షేరును 416.50 రూపాయలకు విట్టల్ ఈ షేర్లను విక్రయించారు.

చైనాకు ద్వారాలు తెరిచిన రూపాయి బలం

న్యూఢిల్లీ : భారత కరెన్సీ రూపాయి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అమెరికా డాలర్, చైనా రెన్‌మిన్‌బి రెండు కరెన్సీలతోనూ గణనీయంగా బలపడింది. పరిస్థితి ఇలాగే కొన సాగితే ఈ ఏడాది చైనా దిగుమతులు 6,130 కోట్ల డాలర్లను (రూ.3.92 లక్షల కోట్లు) దాటవచ్చని అంచనా. దేశంలోకి డాలర్లు వెల్లువెత్తడంతో ఫిబ్రవరి నుంచి ఇప్పటికి 2750 కోట్ల డాలర్లు (రూ.1.76 లక్షల కోట్లు) పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వచ్చిపడ్డాయి. దీంతో అమెరికన్ డాలర్‌తో రూపాయి ఈ ఆరు నెలల కాలంలో 5.5 శాతం మేరకు బలపడింది. చైనా రెన్‌మిన్‌బితో రూపాయి 3.7 శాతం బలపడింది. ఫలితంగా చైనా దిగుమతులు చౌక అయ్యాయి. రెన్‌మిన్‌బితో రూపాయి బలోపేతం కావడం వల్ల భారత దిగుమతిదారులు భారీ పరిమాణంలో వస్తువులు చైనా నుంచి తక్కువ ధరకు దిగుమతి చేసుకుంటున్నారని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. పరిస్థితి ఇలాగే కొన సాగితే చైనా వస్తువులు మరింత చౌకగా అందుబాటులోకి వస్తాయని ఆ నివేదిక పేర్కొంది. చైనా నుంచి ఎలక్ట్రానిక్, ఇంజనీరింగ్ వస్తువులు, రసాయనాలు ప్రధానంగా భారత్‌కు దిగుమతి అవుతాయి. చైనా నుంచి దిగుమతులు పెరిగినట్టయితే దేశీయ పరిశ్రమల ఉత్పత్తులు కూడా ప్రభావితం కావచ్చని హెచ్చరించింది. 2016-17తో చైనాతో వాణిజ్య లోటు 48 శాతం ఉన్నదని, విధానకర్తలు ఈ అంశంపై ఆందోళన చెందాల్సిన అవసరం ఉన్నదని కూడా తేల్చి చెప్పింది.

గత కొన్నేళ్లుగా చైనాతో వాణిజ్య లోటు పెరుగుతూ వస్తున్నదంటూ 2009-10 సంవత్సరంలో 1926 కోట్ల డాలర్లున్న (రూ.1.23 లక్షల కోట్లు) ఈ లోటు 2016-17 నాటికి 5110 కోట్ల డాలర్లకు (రూ.3.27 లక్షల కోట్లు) చేరిందని గణాంకాలను ఉటంకిస్తూ తెలిపారు. ఇదే సమయంలో చైనాకు ఎగుమతులు ఏ మాత్రం పెరుగుదల లేకుండా స్థిరంగా ఉండిపోయినట్టు పేర్కొన్నారు. దేశీయ పరిశ్రమలకు మద్దతు ఇచ్చి ప్రోత్సహించే విధంగా విధానాల్లో మార్పులు చేయాలని, మేక్ ఇన్ ఇండియా విజయవంతం కావాలంటే ఇలాంటి చౌకబారు దిగుమతులను నిలువరించాల్సిన అవసరం ఉన్నట్టు ఆ తేల్చి చెప్పింది. రూపాయి బలోపేతం కావడం వల్ల దిగుమతి ద్రవ్యోల్బణం తగ్గడం, ఆయిల్ ధరలు కూడా తగ్గడం వంటి సానుకూల పరిణామాలున్నా కాస్తంత బక్కచిక్కిన రూపాయే మన మనుగడకు కీలకం అవుతుందని ఆ నివేదిక పేర్కొంది.



రెండుగా షేరు విభజన

హెరిటేజ్ క్యూ1లాభం రూ. 10 కోట్లు.. ఫ్రాన్స్ కంపెనీతో జాయింట్ వెంచర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో హెరిటేజ్ ఫుడ్స్ 10.37 కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 17.10 కోట్ల రూపాయలుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు 610.74 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే రాబడులు (రూ.468.40 కోట్లు) 32 శాతం వృద్ధి చెందినట్లు కంపెనీ తెలిపింది. అయితే స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ 610..74 కోట్ల రూపాయల మొత్తం రాబడులపై 7.64 కోట్ల రూపాయల నికర లాభాన్ని నమోదు చేసుకుంది. త్రైమాసిక కాలంలో పాల కొనుగోలు వ్యయాలు పెరిగిపోవటంతోపాటు రీ బ్రాండింగ్‌పై దృష్టి పెట్టడంతో లాభాలు తగ్గుముఖం పట్టాయని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. అయితే దేశవ్యాప్తంగా కంపెనీ రీబ్రాండింగ్‌కు ప్రాచుర్యం కల్పించటంతో రాబడులు పెరిగాయని దీంతో రానున్న త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలను రాబట్టుకోవచ్చని భావిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.



కాగా ఫ్రాన్స్‌లోని రుడె లా రిపబ్లిక్‌కు చెందిన నొవాన్‌డై ఎస్ఎన్‌సితో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. కోటి రూపాయల అధీకృత మూలధనంతో ఇరు సంస్థలు చెరిసగం భాగస్వామ్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నాయి. పశ్చిమ దేశాల్లో లభిస్తున్న ఫ్రూట్, ఫ్లేవర్డ్ యోగర్ట్ (పెరుగు)ను ఈ భాగస్వామ్య సంస్థలో ఉత్పత్తి చేయనున్నారు. జాయింట్ వెంచర్‌లో భాగంగా 16 కోట్ల రూపాయల పెట్టుబడితో రోజుకు 20 ఎంటిఎస్ సామర్థ్యం గల ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. 2018లో ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నట్లు హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది. ఫ్రాన్స్‌కు చెందిన నొవాన్‌డైతో జట్టు కట్టడం ఎంతో సంతోషాన్నిస్తోందని, 2022 నాటికి సంస్థ టర్నోవర్‌ను 6,000 కోట్ల రూపాయలకు చేర్చాలన్న లక్ష్యానికి ఇది ఎంతో కీలకంగా ఉండనుందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి తెలిపారు. రిలయన్స్ డెయిరీ వ్యాపారాన్ని విజయవంతంగా ఇంటిగ్రేట్ చేసినట్లు చెప్పారు.

10 రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతి షేరును 5 రూపాయల ముఖ విలువ కలిగిన రెండు షేర్లుగా విభజించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించింది. అయితే వాటాదారుల అనుమతికి లోబడి ఇది ఉంటుందని కంపెనీ పేర్కొంది. స్టాక్ మార్కెట్లలో లిక్విడిటీ పెంచుకునేందుకు షేరు విభజన తోడ్పడుతుందని తెలిపింది. గురువారం బిఎస్ఇలో హెరిటేజ్ ఫుడ్స్ షేరు 4.27 శాతం నష్టంతో 1,230.55 రూపాయల వద్ద క్లోజైంది.



హెచ్-రిచ్‌ను విడుదల చేస్తున్న శ్రీనివాస యాదవ్, కంపెనీ ప్రతినిధులు

తెలంగాణలో మెడిలైట్ ప్లాంట్

- మార్కెట్లోకి 'హెచ్-రిచ్' విడుదల
- ధర రూ.1.40 లక్షలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మెడిలైట్ ప్రైవేట్ లిమిటెడ్.. దేశీయ మార్కెట్లోకి హెచ్-రిచ్ పేరుతో అధికంగా హైడ్రోజన్ కలిగిన అల్కలిన్ యాంటీ యాక్సిడెంట్ వాటర్ అయోనైజర్‌ను విడుదల చేసింది. దీని ధర 1.40 లక్షల రూపాయలు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల ప్యూరిఫయర్లు ఉన్నా వీటి ద్వారా శుద్ధ జలం మాత్రమే లభిస్తోంది తప్ప ఆరోగ్యానికి మేలు కలిగించే నీరు మాత్రం లభించడం లేదని, ఈ నేపథ్యంలో అధిక హైడ్రోజన్ సాంద్రత కలిగిన నీటిని అందించే హెచ్-రిచ్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస యాదవ్ కందుల గురువారంనాడిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. హెచ్-రిచ్ ద్వారా 4 పిహెచ్ నుంచి 11.5 పిహెచ్ వరకు నీటిని పొందవచ్చని, వీటిని తాగడానికే కాకుండా కూరగాయలపై ఉండే రసాయనాలను తొలగించేందుకు, స్నానానికి కూడా వినియోగించవచ్చని ఆయన చెప్పారు. హెచ్-రిచ్ ద్వారా వచ్చే నీటిని తాగడం వల్ల అనేక రకాల వ్యాధుల బారిన పడకుండా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం హెచ్-రిచ్‌ను తైవాన్‌లో తయారు చేస్తున్నామని, రానున్న కాలంలో తెలంగాణలో తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని ఆయన తెలిపారు. ఇందుకు కనీసం 50 కోట్ల రూపాయల వ్యయం అవుతుందన్నారు. వచ్చే మార్చినాటికి 2,000 హెచ్-రిచ్‌లను విక్రయించాలన్న లక్ష్యంతో ఉన్నామని చెప్పారు.

మార్చినాటికి 150 ట్రూ వాల్యూ డీలర్‌షిప్స్

- మారుతి సుజుకీ సన్నాహాలు

ముంబై : ప్రీ ఓన్డ్ (సెకండ్ హ్యాండ్) కార్ల వ్యాపారం ట్రూ వాల్యూను పూర్తిగా పునర్వ్యవస్థీకరించినట్టు మారుతి సుజుకీ వెల్లడించింది. వచ్చే మార్చినాటికి కొత్తగా మరో 150 డీలర్‌షిప్స్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపింది. మొత్తంగా వచ్చే రెండు నుంచి మూడేళ్ల కాలంలో 300 ట్రూ వాల్యూ డీలర్‌షిప్స్‌ను ప్రారంభించాలన్న యోచనలో ఉన్నట్టు మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) ఆర్ఎస్ కల్సీ తెలిపారు. టూవీలర్ వినియోగదారులు ఫోర్ వీలర్‌కు మారేలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు.

12 నుంచి బిగ్‌బజార్ '5 రోజుల మహాబచత్'

హైదరాబాద్ : ఫ్యూచర్ గ్రూప్ రిటైల్ సంస్థ బిగ్‌బజార్ ఈ నెల 12 నుంచి 16 వరకు '5 రోజుల మహాబచత్'ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మహాబచత్‌లో మెగా డిస్కౌంట్లతో పలు ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. 2006లో తొలిసారిగా ఈ మహాబచత్‌ను ప్రారంభించిననాటి నుంచి ఇప్పటివరకు వినియోగదారుల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని బిగ్‌బజార్ తెలిపింది.

ఐఒసికి అమెరికా ముడిచమురు

- అంగీకారం తెలిపిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) అమెరికా నుంచి ముడిచమురును దిగుమతి చేసుకోనుంది. దీనికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఏడాదిలో ప్రతి నెల ఒక భారీ విదేశీ షిప్‌లో ముడిచమురును ఐఒసి దిగుమతి చేసుకోనుంది. ఈ ముడిచమురు చవకగానే లభిస్తుందని కంపెనీ చెబుతోంది. 16 లక్షల బారెళ్ల ముడిచమురును అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి గత నెలలో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఐఒసి అధికారి తెలిపారు. ఒడిశాలోని పరదీప్ రిఫైనరీ వద్ద అక్టోబర్ మొదటి వారంలో ఈ ముడిచమురు డెలివరీ తీసుకోనున్నట్టు ఆయన చెప్పారు. కాగా హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా అమెరికా ముడిచమురును కొనుగోలు చేయాలని భావిస్తోంది. చమురు దిగుమతి విషయంలో ప్రపంచంలో మూడో అతిపెద్ద దేశంగా భారత్ నిలుస్తోంది. ఒపెక్ దేశాలు ముతాకట్టి ముడిచమురు ఉత్పత్తిని తగ్గించిన నేపథ్యంలో ఆసియాన్ దేశాలు, దక్షిణ కొరియా, జపాన్, చైనా వంటి దేశాలు అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఇప్పుడీ దేశాల సరసన భారత్ కూడా చేరిపోయింది. రవాణా వ్యయాలంటినీ లెక్కలోకి తీసుకున్నా అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురు భారత రిఫైనరీలకు చవకగానే లభించనున్నట్టు తెలుస్తోంది.

ఐఒసి ఎల్ఎన్‌జి టెర్మినల్‌లో 26 శాతం వాటాపై పెట్రోనెట్ దృష్టి

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) ఎన్నోర్‌లో నిర్మిస్తున్న ఎల్ఎన్‌జి టెర్మినల్‌లో 26 శాతం వాటా తీసుకోవాలన్న ఆసక్తితో పెట్రోనెట్ ఉంది. 50 లక్షల టన్నుల సామర్థ్యంతో ఎల్ఎన్‌జి టెర్మినల్‌ను ఐఒసి నిర్మిస్తోంది. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ దిగుమతిలో దేశంలో అతిపెద్ద కంపెనీగా ఉన్న పెట్రోనెట్.. ఈ ఎల్ఎన్‌జి టెర్మినల్‌లో వాటా తీసుకుంటే తన వ్యాపారానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో చర్చలు కూడా మొదలుపెట్టినట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాత్ సింగ్ తెలిపారు. 5,151 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఎల్ఎన్‌జి టెర్మినల్ వచ్చే ఏడాది మధ్యకాలం నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. గుజరాత్‌లోని ముంద్రాలో 50 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన టెర్మినల్‌ను గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ పూర్తి చేసింది. ఇందులోనూ వాటా తీసుకోవాలని పెట్రోనెట్ యోచిస్తోంది.

టెక్ మహీంద్రాలో ఉద్యోగుల తొలగింపు.. లేబర్ కోర్టును ఆశ్రయించిన 11 మంది

బెంగళూరు : టెక్ మహీంద్రా తొలగించిన 11 మంది ఉద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ లేబర్ కోర్టును ఆశ్రయించారు. ఇరు పక్షాల మధ్య మహారాష్ట్ర కార్మిక అధికారవర్గాలు సయోధ్యను కుదర్చని నేపథ్యంలో వీరు లేబర్ కోర్టును ఆశ్రయించినట్టు ఐటి ఉద్యోగుల ఫోరమ్ గురువారంనాడు వెల్లడించింది. పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ 2ఎ కింద ఉద్యోగాలు కోల్పోయిన వారు పిటిషన్లు దాఖలు చేసినట్టు ఎఫ్ఐటిఇ కోఆర్డినేటర్ ఎలవరసన్ రాజా తెలిపారు.

భారత్ ఫోర్జ్ లాభం రూ.175 కోట్లు

- 1:1 బోనస్ ఇష్యూ

న్యూఢిల్లీ : జూన్‌తో ముగిసిన త్రైమాసింలో 1,283.70 కోట్ల రూపాయల మొత్తం రాబడిపై 175.08 కోట్ల రూపాయల నికర లాభాన్ని సాధించినట్లు భారత్ ఫోర్జ్ వెల్లడించింది. గత ఏడాది (122 కోట్ల రూపాయలు)తో పోల్చితే నికర లాభం 43.43 శాతం వృద్ధి చెందింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2 రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు ఒక షేరును బోనస్‌గా జారీ చేసేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. కాగా భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అనలాజిక్ కంట్రోల్స్ ఇండియా లిమిటెడ్‌లో మిగిలిన 40 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. మరోవైపు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి 201.60 కోట్ల రూపాయల కాంట్రాక్టును అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఆర్డర్‌లో భాగంగా 1,050 డ్యూయల్ టెక్నాలజీ డిటెక్షన్ ఎక్విప్‌మెంట్‌ను సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపింది. గురువారం బిఎస్ఇలో కంపెనీ షేరు 2.20 శాతం నష్టపోయి 1,142.25 రూపాయల వద్ద క్లోజైంది.

లారస్ లాభంలో 51 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా ఉన్న లారస్ లాబ్స్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏకంగా 51.7 శాతం వృద్ధి చెంది 38.9 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 25.6 కోట్ల రూపాయలుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రాబడులు కూడా 16.7 శాతం వృద్ధి చెంది 478.4 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. జిఎస్‌టితో సవాళ్లు ఎదురైనప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగా ఉన్నాయని ఎపిఐ పోర్టుఫోలియో, అంకాలజీ, హెప్ సి వ్యాపారం మెరుగైన పనితీరును కనబరిచాయని లారస్ లాబ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ చావా తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు కొత్త మార్కెట్లలోకి ప్రవేశించటం, హెపటైటిస్ సి కింద కొత్త ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావటం కలిసివచ్చిందని చెప్పారు. త్రైమాసిక సమీక్షా కాలంలో ఆర్ అండ్ డి కోసం 22.9 కోట్ల రూపాయలు వెచ్చించినట్లు సత్యనారాయణ తెలిపారు.

బిహెచ్‌ఇఎల్ 1:2 బోనస్

- త్రైమాసిక లాభం రూ. 81 కోట్లు


న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బిహెచ్‌ఇఎల్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 80.82 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది (77.77 కోట్ల రూపాయలు)తో పోల్చితే నికర లాభం స్వల్పంగా 3.92 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రాబడులు 6,070.21 కోట్ల రూపాయల నుంచి 6,194.21 కోట్ల రూపాయలకు పెరిగాయి. కాగా ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 1:2 నిష్పత్తి (రెండు రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతి రెండు షేర్లకు ఒక షేరు)లో బోనస్ షేర్లను జారీ చేసేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ 1,01,380 కోట్ల రూపాయలుగా ఉంది. వ్యూహాత్మక చర్యలతో పాటు వ్యయాలను తగ్గించుకోవటంతో నిలకడైన వృద్ధిని కనబరిచినట్లు బిహెచ్‌ఇఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ సోబ్తీ తెలిపారు.

యూనియన్ బ్యాంక్‌కు మొండి పద్దుల దెబ్బ

ముంబై: మొండి పద్దుల కోసం కేటాయింపులు చేపట్టటంతో జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) లాభం 30 శాతం తగ్గి 117 కోట్ల రూపాయలుగా నమోదైంది. సమీక్షా కాలంలో స్థూల మొండి బకాయిలు 10.16 శాతం నుంచి 12.63 శాతానికి పెరగటంతో పాటు నికర ఎన్‌పిఎలు కూడా 6.16 శాతం నుంచి 7.47 శాతానికి దూసుకుపోవటం పనితీరుపై ప్రభావం చూపించిందని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజ్‌కిరణ్ రాయ్ తెలిపారు. ఈ కాలంలో మొండి పద్దుల కోసం చేసిన కేటాయింపులు 1,347 కోట్ల రూపాయల నుంచి 1,876 కోట్ల రూపాయలకు పెరిగాయని ఆయన చెప్పారు.

బడుగు వ్యాపారాలపై పిడుగు

ఏటా 37 రిటర్న్స్ దాఖలుతో బేజార్
క్రయవిక్రయాల డేటా నిర్వహణ అదనపు భారం
బడా సంస్థల పోటీకి తోడుగా జిఎస్‌టి దెబ్బ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)

పరోక్ష పన్నుల విప్లవం చిన్న కంపెనీలకు శాపంగా మారింది. ప్రతి వ్యాపారినీ పన్నుల పరిధిలోకి తేవడం ద్వారా పన్నుల రాబడిని పెంచుకోవడం జిఎస్‌టి లక్ష్యం. వ్యాపారంలో ఉన్న ప్రతి వ్యాపారి లక్షల రూపాయల లాభం సంపాదించే అవకాశం లేదు. లక్షల రూపాయల రాబడి ఉన్న ప్రతివారూ పన్నుకడతారన్న గ్యారంటీ లేదు. అందర్నీ ఒకేగాటనగట్టి జిఎస్‌టితో బాదడం వల్ల చిన్న చిన్న సంస్థలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. రూ.20 లక్షల వార్షిక టర్నోవర్ దాటిన ప్రతి సంస్థ కూడా జిఎస్‌టి కింద రిజిస్టర్ చేసుకోవాలి పన్ను చెల్లించాలి. పన్ను చెల్లించడం ఒక ఎత్తు, జిఎస్‌టి రూల్స్‌ను తూచ తప్పకుండా పాటించడం మరొక ఎత్తు. జిఎస్‌టి నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపారి ఏటా 37 రిటర్న్స్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. ఒకే చాప్టర్ హెడింగ్ కింద భిన్న పన్నురేట్లు, భిన్న జిఎస్‌టి రేట్లతో రకరకాల చాప్టర్‌సబ్ హెడింగ్స్ వారిని అయోమయంలో ముంచెత్తి భయపెడుతున్నాయి. చిన్న వ్యాపారుల కోసమంటూ ప్రభుత్వం కంపోజిషన్ స్కీమ్ ప్రకటించింది. ఇది టర్నోవర్ టాక్స్ లాంటింది. ఈ స్కీమ్ కింద రూ.70 లక్షలలోపు టర్నోవర్ ఉన్న వర్తకులు 2 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది. రెస్టారెంట్స్‌కు ఇది 5 శాతంగా నిర్ణయించారు. ఈ స్కీమ్ అంతర్ రాష్ట్ర వాణిజ్యంతో సంబంధంలేని లోకల్ వర్తకులకు మాత్రమే వర్తిస్తుంది. టర్నోవర్‌పై టాక్స్ చెల్లించాలి తప్ప, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ వంటి సౌకర్యాలు ఏమీ ఈ వ్యాపారులకు ఉండవు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యవిషయం ఒకటుంది. చిన్న వర్తకులు సాధారణంగా బ్రాండెడ్ ప్యాకేజ్డ్ గూడ్స్, నిత్యం వినియోగించే కిరాణా వస్తువులు విక్రయిస్తారు. బ్రాండెడ్ ప్యాకేజ్డ్ వస్తువులపై ఎంఆర్‌పి ఉంటుంది. నిత్య గృహ వినియోగ వస్తువులకు జిఎస్‌టి వర్తించదు. రూ.20 లక్షలుపైబడి టర్నోవర్ ఉన్న వర్తకులు కంపోజిషన్ స్కీమ్ కింద నమోదు చేసుకుంటే టర్నోవర్‌పై ఏకమొత్తంగా 2 శాతం పన్ను కట్టాలి. లేదంటే రిటర్న్స్ ఫైల్ చేస్తూ, జిఎస్‌టి రేట్ల ప్రకారం పన్నులు చెల్లించాలి. రిటైల్ వర్తకులు విక్రయించే అనేక వస్తువుల్లో మార్జిన్ 2-3 శాతం మాత్రమే ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో 2 శాతం టర్నోవర్ టాక్స్ కడితే తమకు మిగిలేదేమీ ఉండదని చిన్న వర్తకుల ఆందోళన. కంపోజిషన్ స్కీమ్ పరిధికి రాకుండా ఉంటే ఏటా 37 రిటర్న్స్ ఫైల్ చేస్తూ కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులు నిర్వహిస్తూ వచ్చిన లాభాన్ని దీనికోసమే ఖర్చుపెట్టాలన్నది వారి బాధ. పరోక్ష పన్నుల నిపుణుల అభిప్రాయమూ ఇదే.

ఎగుమతి సంస్థలకు పరేషాన్..

జిఎస్‌టి దెబ్బకు ఎగుమతుల రంగంలోని సంస్థలు విలవిలలాడుతున్నాయి. ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అనేక స్కీమ్‌లను ప్రవేశపెట్టింది. పలు వెసులుబాట్లను కల్పించింది. జిఎస్‌టి దెబ్బకు ఈ స్కీములన్నీ తల్లకిందులయ్యాయని ఎగుమతుల రంగంలోని సంస్థలు అంటున్నాయి. ఇప్పటి వరకు ఎగుమతుల రంగంలోని సంస్థలకు డొమెస్టిక్ టారిఫ్ ఏరియా (డిటిఎ) నుంచి వస్తువులు సప్లై చేస్తే వాటిని 'డీమ్డ్ ఎక్స్‌పోర్ట్స్'గా పరిగణించే వారు. జిఎస్‌టి వల్ల అలాంటి పరిగణనకు అవకాశం లేకుండా పోయింది.

పెద్ద కంపెనీలూ దెబ్బతిన్నాయి...

పెద్ద కంపెనీలు ఈ పరోక్ష పన్నుల అమల్లోకి తెచ్చిన పద్ధతిపై సంతృప్తిగా లేవు. అత్యంత సాఫీగా ఎవరికీ ఇబ్బంది లేనివిధంగా జిఎస్‌టిని అమల్లోకి తేగలిగామన్నది ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటన. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయిన కొన్ని కార్పొరేట్ కంపెనీల 2017-18 తొలి త్రైమాసిక ఫలితాలనూ, ఫలితాల సరళికి కంపెనీలు ఉటంకించిన కారణాలను గమనిస్తే ఆర్థిక మంత్రి ప్రకటనలో డొల్లతనం ఎంతో బోధపడుతుంది. జిఎస్‌టి జూలై 1 నుంచి అమల్లోకి వస్తున్న కారణంగా కనీసం నెల రోజుల ముందునుంచి డిస్ట్రిబ్యూటర్లు, హోల్‌సేల్ వ్యాపారులు స్టాక్‌ను తీసుకోవడానికి ముందుకురాలేదు. జూలై 1 తర్వాత ధరలు మారిపోతాయన్న భయం ఇందుకు కారణం. డీస్టాకింగ్ కనీసం డజను కంపెనీల ఫలితాలను ప్రభావితం చేసింది. ఉదాహరణకు ఎఫ్ఎంసిజి కంపెనీ బ్రిటానియా ఇండస్ట్రీస్ నికర లాభం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 1.5శాతం వరకు తగ్గింది. డాబర్ ఇండియా నికర లాభం ఈ తొలి త్రైమాసికంలో 9.8 శాతం వరకు తగ్గింది. ఇమామి లాభం దాదాపు 98 శాతం తగ్గింది. ఏషియన్ పెయింట్స్ లాభం 20 శాతం, అపోలో టైర్స్ లాభం 72 శాతం తగ్గాయి. సియట్ లాభాల్లో 98 శాతం కోతపడింది. అరవింద్, బజాజ్ ఎలక్ట్రికల్స్, వి-గార్డ్, ఎవరెడీ ఇండస్ట్రీస్... ఇవన్నీ జిఎస్‌టితో లాభాలపై ప్రభావం పడినట్టు వెల్లడించారు.



● రమణీయం.. రాఘవేంద్రుడి రథోత్సవం

కర్నూలు జిల్లా మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి మహారథోత్సవం రమణీయంగా సాగింది. రాఘవేంద్రస్వామి 346వ సప్తఆరాధనోత్సవాల్లో భాగంగా మహారథోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులైన ప్రహ్లాదరాయలను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి మహారథంపై అధిష్ఠించి పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేశారు.



● సినిమా హాలులో అగ్నిప్రమాదం

ప్రకాశం జిల్లా చీరాలలోని సురేష్‌మహల్ లో గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. మరమ్మతులు పూర్తయి శుక్రవారం తిరిగి ప్రారంభించడానికి సిద్ధమైన తరుణంలో సంభవించిన ప్రమాదంలో కోటిన్నర నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.

- చీరాల

ఫిలింనగర్ వినాయకుడికి
500 కిలోల తాపేశ్వరం లడ్డూ

మండపేట, 10 ఆగస్టు: హైదరాబాద్ ఫిలింనగర్ సన్నిధిలోని వినాయకుడికి ఈ ఏడాది 500 కిలోల లడ్డూప్రసాదాన్ని అందజేస్తున్నట్టు తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరం సురుచి స్వీట్స్ సంస్థ యాజమాని పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ భవన్ వద్ద ఉన్న పూరీజగన్నాథ్ స్వామి ఆలయానికి కూడా 100 కిలోల లడ్డూను ఇస్తున్నామన్నారు. లడ్డూ తయారీ ఈ నెల 22న ప్రారంభించి 24న తాపేశ్వరం నుంచి ఫిలింనగర్‌కు తరలిస్తామన్నారు. అమెరికాలోని వర్జీనియాలో వినాయక పూజలకు సంబంధించి అక్కడ తయారు చేసే లడ్డూకు తమ సిబ్బంది సహకరిస్తారని మల్లిబాబు తెలిపారు.

నష్టం చేస్తేఒప్పందం రద్దు!

- వైఎస్ జమానాలోని కంపెనీలపై ఏపీఎండీసీ ఉక్కుపాదం
- చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ జేవీపై కొరడా

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఖనిజ తవ్వకాల విషయంలో తమకు నష్టం వచ్చేలా కంపెనీలు వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) నిర్ణయించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి 2007లో కట్టబెట్టిన తవ్వకాల వల్ల ఏపీఎండీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులపై ఇప్పటికీ తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కాగ్ తీవ్రంగా తప్పుబట్టిన దరిమిలా.. ఏపీఎండీసీ ఇటీవల వరుసగా... జేవీ మినరల్స్, బీచ్ శాండ్‌కు సంబంధించి బొత్తీ జేవీ కంపెనీలతో సహా బాక్సైట్ తవ్వకాలపై రస్‌అల్ ఖైమాతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ క్రమంలోనే... ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్‌కు సంబంధించి మిడ్‌వెస్ట్, పల్లవ రెడ్ సంస్థలతో ఒప్పందాలనూ తిరగదోడింది. ఈ సంస్థలు నిబంధనలు పాటించకపోయినా, ఎండీసీకి ఆర్థికంగా ప్రయోజనం కలిగించేలా వ్యవహరించకపోయినా నోటీసులు జారీ చేయకూడదంటూ షరతు ఉండడం చూసి ఆశ్చర్యపోయింది. పల్లవ గ్రానైట్స్ కార్యకలాపాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

అరకు కేంద్రంగా కళాగ్రామం

- అమరావతిలో మెగా శిల్పారామం

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అరకు కేంద్రంగా కళాగ్రామం ఏర్పాటు చేయనున్నట్టు పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. విజయవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన శిల్పారామం కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేతి వృత్తులు, కళలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రతి జిల్లాలోనూ ఒకశిల్పారామం అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగానే ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. చేతి వృత్తుల వారు తమ ఉత్పత్తులను, కళాకృతులను నేరుగా విక్రయించుకోగలిగేలా శిల్పారామం పని చేస్తుందని తెలిపారు. అమరావతి వేదికగా అంతర్జాతీయ ప్రమాణాలతో మెగా శిల్పారామం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇది ఏపీ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని అన్నారు.



ఇ'లా'గైతే ఎలా!?



విశాఖ జిల్లా సబ్బవరం మండలం అసకపల్లిలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం

- తరచూ వివాదాల్లోకి లా విద్యార్థులు
- తాగుడు..తన్నులాటలతో వార్తల్లోకి
- ఊతమిస్తోన్న రాజకీయ పలుకుబడి
- మసకేస్తున్న ఏపీ నల్సార్ ప్రతిష్ఠ
- చర్యలు తప్పవు: విశాఖ పోలీస్

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

న్యాయంగా పోవాల్సినవారు, చట్టానికి పట్టం కట్టాల్సిన వారే దారితప్పడం, దాడులకూ తెగబడుతుండటం 'ఏపీ నల్సార్' ప్రతిష్ఠకి మచ్చని తెస్తోంది. తరగతి గదుల్లో నేర్చుకొనే న్యాయ సంస్కారం ఎటు పోతుందో గానీ.. వర్సిటీలోనూ, బయటా అరాచక కార్యకలాపాలకు వారే కేంద్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. విశాఖ జిల్లా సబ్బవరం మండలం అసకపల్లిలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం ప్రాంగణంలో వరుసగా చోటుచేసుకుంటున్న సంఘటనలు స్థానికులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉదాహరణకు.. అర్ధరాత్రి దాకా తాగి, ఆ మైకంలో కొందరు విద్యార్థులు ఈ నెల రెండో తేదీన వర్సిటీ బయట గలాటా సృష్టించారు. వర్సిటీ ఎదురుగా ఉన్న గొటివాడ గ్రామస్థులతో గొడవపడ్డారు. తమ కుర్రాళ్లను వర్సిటీ లోపలకు లాక్కెళ్లి విపరీతంగా కొట్టారని గ్రామస్థులు వాపోతున్నారు.

ప్రస్తుతం 520 మంది విద్యార్థులుంటే, అందులో తెలుగు రాష్ట్రాలవారు దాదాపు అరవై శాతం మంది ఉన్నారు. మిగతా 40శాతం ఉత్తరాది రాష్ట్రాల నుంచి అడ్మిషన్ తీసుకొన్నవారు. వర్సిటీ పరిధిలో జరుగుతున్న గొడవలకు వీరే కారణం అవుతున్నారని చెబుతున్నారు. తల్లిదండ్రులు దూరంగా ఉండటం, జేబు నిండా డబ్బులు ఆడుతుండటంతో, బిందాస్ జీవితాలకు అలవాటు పడ్డారు. పగలంతా హైవేలపై డ్రంక్ అండ్ డ్రైవ్‌లు, రాత్రయితే మందు పార్టీలతో గడిపేస్తున్నారు. ఈ క్రమంలో చిన్న చిన్న విషయాలే పెద్ద పెద్ద గొడవలకు దారితీస్తున్నాయి.

సాయం చేయడమే తప్పన్నట్టు..


ఇద్దరు విద్యార్థులు మద్యం తాగి బైక్ నడుతూ,సెల్ఫ్ యాక్సిడెంట్ చేసుకొన్నారు. దెబ్బలు తగిలించుకొన్న వారికి స్థానికులు సపర్యలు చేశారు. మత్తులో ఊగుతూ, ఒక విద్యార్థి కింద పడిపోయిన బైకుని లేపబోయాడు. 'ఇంత మత్తులో ఎక్కడకు వెళతారు' అంటూ అక్కడున్న వారిలో ఒకరు వారించాడు. 'బండిపై చెయ్యి వేస్తావా' అంటూ ఆ విద్యార్థులు ఆయనని చితగ్గొట్టారు. అంతేకాదు, తప్పు తమదయినా.. తిరగబడిపోతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆగి వున్న ఆటోను బైక్‌పై వచ్చిన ఇద్దరు విద్యార్థులు ఢీకొన్నారు. వారిలో ఒక విద్యార్థి క్షమాపణ చెబుతుండగా, మరో విద్యార్థి అతణ్ణి ఆపి.. డ్రైవరుతో దురుసుగా ప్రవర్తించాడు. తమ సహచరులను డ్రైవరు ఏదో చేసేస్తున్నాడనుకొని.. వర్సిటీలోని మిగతా విద్యార్థులూ పోగయిపోవడంతో, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

వర్సిటీలోని క్యాంటీన్ నిర్వహణ కోసం ఉత్తరాది విద్యార్థులు పట్టుబట్టారు. చివరకు స్థానికులకే ఆ బాధ్యతలు ఇవ్వడం జరిగింది. దీనిపై ఓర్వలేకపోయిన స్థానికేతర విద్యార్థులు.. ఏదో ఒక సమస్యపై యాగీ చేస్తున్నట్టు సమాచారం. వర్సిటీలో పురుగుల అన్నం పెడుతున్నారని ఆందోళన చేయడం ఇందులో భాగమేనని చెబుతున్నారు. ఇది చాలదన్నట్టు వర్సిటీపై రాజకీయ నీడలు పరుచుకొంటున్నాయి. ఇటీవల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద టూవీలర్ ఆపి.. సిగరెట్ తాగుతున్న యువతిని పోలీసు వారించాడు. పబ్లిక్‌లో ఇదేం పనని మందలించాడు. బండి తాళాలు తీసుకోబోయిన ఆయన చేతిని పక్కకు లాగేసింది. అప్పటికప్పుడు ఎవరికో ఫోన్ చేయడం, క్షణాల్లో ఆ పోలీసుకు ఫోన్ రావడం జరిగిపోయాయట! ఈ పరిస్థితుల్లో విద్యార్థుల కదలికలపై వర్సిటీ యాజమాన్యం ఆంక్షలు విధించింది. "రాత్రి 8.30 గంటల తర్వాత వర్సిటీ బయట తిరగరాదు. ప్రతి విద్యార్థి గుర్తింపు కార్డును వెంట తీసుకుని వెళ్లాలి. అధికారులు అడిగినప్పుడు దానిని విధిగా చూపాలి. గ్రూపులుగా సంచరించడం, రాత్రి సమయాల్లో గ్రామాల పరిసరాల్లో తిరగడం చేయరాదు. డ్రంక్అండ్ డ్రైవ్ చేస్తే చర్యలు తప్ప"వంటూ సర్క్యులర్ జారీచేసింది.

ఊరుకోం: పోలీసులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కఠినంగా వ్యవహరించేందుకు వెనుకాడబోమని అనకాపల్లి సర్కిల్ సీఐ రామచంద్రరావు హెచ్చరించారు. విద్యార్థుల దృక్పథంలో మార్పు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భావిస్తున్నామని చెప్పారు. కాగా, మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని డీటీసీ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. విద్యార్థులకు ముందుగా అవగాహన తరగతులు నిర్వహించి, ఆపై పట్టుబడితే ప్రాసిక్యూషన్ విధిస్తామని తెలిపారు.

'బాధ్యత'కు సత్కారం!



- పౌరులకు పన్ను రాయితీ
- నగరాలు, పట్టణాల్లో అమలు
- అధికారులకు సీఎం ఆదేశం

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణాల్లో పారిశుధ్యం, ఇతర విషయాల్లో బాధ్యతగా వ్యవహరించే పౌరులకు పన్నుల్లో రాయితీ కల్పించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కమాండ్ కమ్యునికేషన్ సెంటర్ (సీసీసీ)ను గురువారం సీఎం ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా కొన్ని మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆ శాఖ పనితీరును సమీక్షించారు. సమీక్షలోను, సమీక్ష తర్వాత విలేకరులతోను సీఎం మాట్లాడారు. బాధ్యతతో మెలిగే పౌరులకు పన్ను రాయితీ ఇవ్వాలని, బిరుదులు ఇచ్చి సన్మానం కూడా చేయాలని సూచించారు. రానున్న మూడు నెలల్లో మున్సిపల్‌శాఖ పనితీరు పట్ల ప్రజల్లో 80 శాతానికి మించి సంతృప్తి కనిపించాలని, ఆ తర్వాత అది వంద శాతానికి చేరేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాలనకు సంబంధించి ఏ పనికైనా ప్రజల సంతృప్తే ముఖ్యమని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలను సుందరంగా ఉంచేందుకు విద్యార్థులనూ భాగస్వాములను చేయాలని, అలాగే వారు కొత్తగా చేసే ఆలోచనలకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్‌ను కూడా పొందాలని సూచించారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలు.. పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేయకపోతే వారికి ఇచ్చే డబ్బుకు కోత విధించడంతోపాటు ఇతర రకాల చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఏజెన్సీ రద్దు చేయాలని సూచించారు. అలాగే పనులను సక్రమంగా చేసేవారిని ప్రోత్సహించాలన్నారు. ఆన్‌లైన్ వినియోగంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముందుండటం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ముఖ్యమైన శాఖలూ ఇదే మాదిరి కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని స్మార్ట్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.

శంకరంబాడికి సీఎం నివాళి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతం 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతిని పురస్కరించుకొని సీఎం చంద్రబాబు ఆయను ఘనంగా నివాళులర్పించారు. తెలుగుజాతి ఉన్నంత కాలం శంకరంబాడి పేరు నిలిచిపోతుందని అన్నారు.

'ప్రకాశం' దిగువన బ్యారేజీ నిర్మాణానికి
డీపీఆర్ పంపండి: కేంద్రమంత్రి ఉమాభారతి



అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానదిపై నిర్మించదలచిన బ్యారేజీ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికను పంపాలని కేంద్ర జలవనరుల శాఖమంత్రి ఉమాభారతి కోరారు. ఈ మేరకు ఆమె సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీకి దిగువన 12 కిలోమీటర్ల వద్ద నిర్మించదలచిన బ్యారేజీ కోసం డీపీఆర్‌ను పంపితే నిబంధనల మేరకు కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు పంపుతామని అందులో పేర్కొన్నారు. కృష్ణానదిపై ట్రైబ్యునళ్లు ఇచ్చిన ఆదేశాలను కేంద్ర జలసంఘం పరిగణనలోకి తీసుకుంటుందని, దీనిని అంతర్ రాష్ట్ర నదీజలాల కోణంలో పరిశీలన చేస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టుకు టెక్నో-ఎకనామిక్ ఆమోదంతోపాటు కేంద్ర జలవనరుల శాఖ సలహా సంఘం సమ్మతి కూడా కావాల్సి ఉంటుందన్నారు. ఏఐబీపీ కింద ఆర్థిక సహాయం ఇవ్వాలంటే ఇందుకు తగిన అర్హత ఉందో లేదో పరిశీలించాల్సి ఉందని, వీటన్నింటి నేపథ్యంలో డీపీఆర్‌ను పంపితే పరిశీలించి కేఆర్ఎంబీకి పంపుతామని ఆ లేఖలో కేంద్రమంత్రి తెలిపారు.

డ్రగ్స్ కేసులో జాతకాలు సిద్ధం

- తుది దశకు చేరుకున్న చార్జిషీట్
- ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పరీక్ష ఫలితాలు
- ఒక్కరి విషయంలో కొంత గందరగోళం

హైదరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న వారి జాతకాలు సిద్ధమయ్యాయి. డ్రగ్స్‌ను అమ్మినవారితోపాటు గుడ్‌విల్ కింద సరఫరా చేసినవారు, వాటిని వినియోగించిన వారి జాబితా రెడీ అయింది. ఈ కేసులో సాక్షులు కూడా ఓకే అయ్యారు. కీలకంగా మారిన ఇద్దరు సినీ ప్రముఖుల రక్తం, తలవెంట్రుకల పరీక్షా ఫలితాలు కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ చేతికి అందాయి. ఇక మిగిలిందల్లా చార్జిషీటే. కేసు డైరీని దాదాపుగా కొలిక్కి తీసుకొచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ మరో రెండు రోజుల్లోగా చార్జిషీట్‌ను ఖరారు చేయనుంది. విచారణ దశలోనే కేసు వీగిపోయిందని, ఖేల్‌ఖతమ్...దుకాణమ్ బంద్ అంటూ జరుగుతోన్న ప్రచారానికి గట్టి సమాధానం ఇచ్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కసరత్తు 95 శాతం మేరకు పూర్తయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఈ కేసులో రెండో చార్జిషీట్ కూడా ఉండొచ్చని తెలుస్తోంది. విచారణ ఇంకా పూర్తికానందున... తదుపరి విచారణాంశాల ఆధారంగా రెండో చార్జిషీట్ ఉండొచ్చని తెలిసింది.

కదులుతున్న డొంక

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి గత నెల 3న డ్రగ్స్ కేసును ఛేదించిన విషయం తెలిసిందే. ఈ కేసులో కెల్విన్, జీషాన్‌తోపాటు ఇప్పటి వరకు 15మంది పైనే అరెస్ట్ అయ్యారు. తొలుత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌ను అమ్మిన కేసు విచారణ అంతా గోప్యంగానే జరిగిపోయింది. రెండో విడతగా 12 మంది సినీ ప్రముఖులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిట్ విచారించింది. విచారణకు హాజరైన వారు వెల్లడించిన విషయాలను సిట్‌తోపాటు మరో నలుగురు అధికారుల బృందం క్రోడీకరించింది. సినిమారంగంలోని 12 మంది, కెల్విన్, జీషాన్‌తోపాటు మరో 18మంది వాంగ్మూలాలను కూడా పూర్తిగా క్రోడీకరించారు. డ్రగ్స్ అమ్మకందారులుగా కెల్విన్, జీషాన్‌తోపాటు కమింగా, మరో ముగ్గురు నైజీరియన్లను చేర్చారు. సినీ ప్రముఖుడు ఒకరిని అమ్మకంతోపాటు సరఫరాదారుడి జాబితాలో చేర్చినట్లు తెలిసింది. ఓ ప్రముఖుడు కొందరికి గుడ్‌విల్ కింద సరఫరా చేసినట్లు, స్వయంగా వినియోగించినట్లు నిర్ధారించింది. మరో సినీ ప్రముఖుడు కూడా బ్యాంకాక్‌లో ఉండగా పలు చోట్ల నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు ధ్రువీకరించుకున్నారు. ఓ సినీ పెద్ద సూచన మేరకే ఆయన రెండుసార్లు బ్యాంకాక్‌లోని ఓ ప్రాంతం నుంచి డ్రగ్స్ తెచ్చిన ఆ వ్యక్తిని కొరియర్, ప్రధాన సాక్షిగా చేర్చుతున్నట్లు తెలిసింది. ఇదే కేసులో కెల్విన్, జీషాన్‌తోపాటు మరో ఇద్దరిని సరఫరాదారులుగా నిర్ధారణ చేయనున్నారని సమాచారం.

విచారణ ఎదుర్కొన్న ఓ ప్రముఖ నటుడి విషయంలో కొంత గందరగోళం ఉన్నట్లు తెలిసింది. అతను పరీక్షల కోసం ఎలాంటి శాంపిల్స్ ఇవ్వకున్నా... ఇప్పటి వరకు డ్రగ్స్ వినియోగించినట్లు గానీ, తన కోసం, ఇతరుల కోసం తెప్పించిన ఆనవాళ్లుగానీ కనిపెట్టలేకపోయారట. అయితే, గతంలో తాను డ్రగ్స్ వినియోగించానని, ప్రస్తుతం వాడడం లేదని ఆ నడుమ విచారణలో అంగీకరించారని సమాచారం. మరో సినీ ప్రముఖుడి విషయంలో అతడు ఇచ్చిన స్టేట్‌మెంట్ సాక్ష్యానికి పనికొస్తుందని అంచనా వేస్తున్నారు.

వాంగ్మూలాల క్రోడీకరణ పూర్తి

విచారణకు వచ్చిన వారిలో ఐదుగురిని డ్రగ్స్‌ను వినియోగించిన వారిగా, కెల్విన్, జీషాన్ నుంచి వారికి సరఫరా అయినట్లుగా పేర్కొననున్నారు. ఈవెంట్స్‌తోపాటు, పబ్‌లకు సరఫరా చేశారనే అభియోగాలతోపాటు, తమ నుంచి డ్రగ్స్ తీసుకునేవారని కెల్విన్ ఇప్పటికే ఓ నటుడి గుట్టు విప్పాడని తెలిసింది. ఇలా ఈ కేసులో ఎవరి పాత్ర ఏమిటి? అన్నదానిపై స్పష్టతకు వచ్చారు.

డ్రగ్స్ కేసులో గాబ్రియేల్ అరెస్టు


- బడా వ్యాపారవేత్తల ఫోన్లు స్విచ్ఛాఫ్..!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నైజీరియన్ ముఠాకు డ్రగ్స్ విక్రయించిన గాబ్రియేల్ పోలీసులకు చిక్కాడు. 2012 నుంచి ఓ డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్న గ్రాబియేల్ యాప్రాల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో తన ప్రేయసితో ఉండగా స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్‌వోటీ) పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారు. విచారణ క్రమంలో అతడి సెల్‌ఫోన్‌లో 500కు పైగా ఫోన్ నంబర్లను పోలీసులు గుర్తించారు. అతడి వలలో బడా వ్యాపారవేత్తలు చిక్కుకున్నట్లు నిర్ధారించారు. వారిలో ఎవరికి డ్రగ్స్ విక్రయించాడు? నిత్యం ఎవరెవరితో టచ్‌లో ఉంటున్నాడు? అనే విషయాలను ఆరా తీస్తున్నారు. కాగా, గాబ్రియేల్ పోలీసులకు చిక్కాడనే వార్త తెలియగానే వ్యాపారవేత్తలంతా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో సంగీత, ఒజుకు కాస్మోస్, జాన్ ఒకిరే, ఒకరేకే సిరిల్, జాన్ సిరిల్, ఒగుంకా హెన్రీలను జూలై 24న రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కొకైన్, బ్రౌన్ షుగర్, ఆప్తిటమైన్ ట్యాబెట్లు, గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ ముఠాను ఏడు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. డ్రగ్స్‌ను గాబ్రియేల్ నుంచి కొనుగోలు చేశామని ఈ ముఠా అంగీకరించినట్లు తెలిసింది. దీంతో కీలక వ్యక్తిగా మారిన గ్రాబియేల్‌ను ఎస్‌వోటీ పోలీసులు యాప్రాల్‌లో పట్టుకున్నారు.

రాష్ట్రంలో "బుద్ధిస్ట్ సర్క్యూట్"

- "స్వదేశీ దర్శని స్కీమ్" ద్వారా అభివృద్ధి
- రూ.100 కోట్లు విడుదలకు కేంద్రం ఆమోదం
- మొదటి దశలో ఏడు ప్రాంతాలను గుర్తింపు
- శ్రీకాకుళం, విశాఖ, అమరావతిల్లో ముఖ్య ప్రాంతాలు ఎంపిక

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి విదేశీ పర్యాటకుల్ని ఆకర్షించేందుకు ప్రభుత్వం అనేక మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న బుద్ధిజం ఆలయాలను, ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కేంద్రం ప్రభుత్వం ప్రారంభించిన "స్వదేశీ దర్శనీ" పథకంలో భాగంగా "బుద్ధిస్ట్ సర్క్యూట్" పేరుతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే బౌద్ధ ఆలయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం కొన్ని మార్పులు చేస్తూ రూ.100 కోట్ల విడుదల చేసేందుకు సిద్ధమయింది. ప్రాజెక్టు పేరులోనే ఉన్నట్లుగా శ్రీకాకుళం దగ్గర నుంచి అమరావతి వరకూ ఒక సర్క్యూట్‌గా ఆలయాలను అభివృద్ధి చేయనున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖలో మధ్యలో ఉన్న తోట్లకొండ, బావికొండ, బజ్జనకొండతో పాటు లింగాలకొండ, సాలిహుందం ప్రాంతాల్లో 190.65 ఎకరాలను అభివృద్ధి చేస్తారు. దీంతో పాటు గుంటూరు జిల్లాల్లో పాత అమరావతిలో 7.68 ఎకరాలు, అనుపులో 117 ఎకరాలు అభివృద్ధి చేయనున్నారు. పర్యాటక శాఖ ఎంపిక చేసిన ప్రాంతాల్లో మ్యూజియంలు, మెడిటేషన్ సెంటర్లుతో పాటు ఆ ప్రాంతంలో పార్కులు, రిసార్టులు వంటివి అభివృద్ధి చేస్తారు. మన రాష్ట్రంలో ముఖ్యమయిన బుద్ధిజం ప్రాంతాలు సుమారు 20 వరకూ ఉన్నాయి. వీటిలో 15 ప్రాంతాలను స్వదేశీ దర్శనీ భాగంగా "బుద్ధిస్ట్ సర్క్యూట్"గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలించిన కేంద్రం మొదట విడతలో 7 ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచిస్తూ... రూ.100 కోట్లు కేటాయించేందుకు సిద్ధమయింది. అలాగే, రూ.33 కోట్లతో నాగార్జున కొండను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు కేంద్రానికి సంబంధించి "ప్రసాద్ స్కీమ్"లో భాగంగా అభివృద్ధి చేస్తున్న ధ్యాన బుద్ధా ప్రాజెక్టు కూడా మరో రెండు నెలల్లో పూర్తి కావస్తోంది. రూ.27 కోట్లతో అభివృద్ధి చేయాలని తలపెట్టిన ధ్యాన బుద్ధా ప్రాజెక్టులో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి అయ్యాయి. మరో 30 శాతం పనులు కొనసాగుతున్నాయి. ఆక్టోబర్ చివరి నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే అమరావతి పేరు ప్రఖ్యాతలు ప్రపంచ వ్యాప్తం అవుతాయి.



తేలని 'దీపం' లెక్క



- జూన్ 8కే పూర్తయిన గడువు
- కొత్త కనెక్షన్లు ఎన్నో ఇంకా అస్పష్టత

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 'దీపం' గ్యాస్ కనెక్షన్లపై అస్పష్టత నెలకొంది. ప్రతి ఇంటికీ దీపం కనెక్షన్ ఇచ్చామని ప్రభుత్వం చెబుతుంటే... కొత్తగా ఎన్ని కనెక్షన్లు ఇచ్చారనే వివరాలను బహిర్గతం చేసేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. రెండు నెలల క్రితం వరకూ రోజువారీ కనెక్షన్ల జారీ వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన పౌరసరఫరాల శాఖ అధికారులు... గడువు ముగిసే సమయం నుంచి వాటిని తొలగించారు. టీడీపీ అధికారంలోకి వచ్చే సమయానికి 30లక్షల కొత్త దీపం కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. తర్వాత వాస్తవ డిమాండ్‌ను 17.5 లక్షలకు తీసుకొచ్చింది. అప్పటికే సుమారు 2లక్షల మందికి దీపం కనెక్షన్లు మంజూరుచేశారు. దీపంలో నూరుశాతం లక్ష్యం సాధనకు అనేకసార్లు టార్గెట్లు పెట్టుకున్న అధికారులు చివరిగా నవనిర్మాణ దీక్షను గడువుగా నిర్దేశించారు. జూన్ 8 నాటికి మొత్తం కనెక్షన్లు ఇవ్వాలన్నారు. నెల రోజుల్లోనే లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున పేదలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరుచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కానీ దీక్ష పూర్తయ్యే సమయానికి లక్ష్యం పూర్తిచేశారో లేదో ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. నూరుశాతం ఇచ్చామని ప్రకటనలు చేశారు తప్ప అధికారికంగా గణాంకాలు విడుదల చేయలేదు. దీపం పథకంలో సాధారణంగా మహిళల పేరిటే గ్యాస్ కనెక్షన్‌ను మంజూరుచేస్తారు. నూరు శాతం సాధించాలనే ఉద్దేశంతో ఒంటరి పురుషులకు సైతం మంజూరుచేసేలా నిబంధనలు మార్పు చేశారు. ఏజెన్సీల్లో నివసించే వారికి పెద్ద సిలిండర్ల రవాణా కష్టంగా మారినందున 5కిలోల సిలిండర్లతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టినా నూరుశాతం లక్ష్యం పూర్తిచేశారో... లేదో అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కాగా పశ్చిమగోదావరి జిల్లా మాత్రమే నూరుశాతం దీపం కనెక్షన్లు జారీ చేసిన మొదటి జిల్లాగా నిలిచింది.



ప్రధాని మోదీకి వినతి పత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య బృందం

మోదీని కలిసిన ఆర్.కృష్ణయ్య బృందం

- బీసీ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): దేశంలో మెజారిటీ జనాభా కలిగిన బీసీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని ఆర్.కృష్ణయ్య బృందం కోరింది. గురువారం పార్లమెంట్‌లో ప్రధానిని కలిసి 13 డిమాండ్లతో వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మోదీని శాలువాతో సన్మానించారు. వారితోపాటు ఎంపీలు కొనకళ్లనారాయణ, నిమ్మల కృష్ణప్ప, కొత్తపల్లి గీత, మురళీ మోహన్ కూడా ప్రధానిని కలిశారు.

ఒకే సబ్జెక్టులో బదిలీ అంటే ఎలా?

- సంఖ్య సమానంగా చూసుకుని మిగతావి సడలించాలంటున్న టీచర్లు

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర బదిలీలకు రెండు ప్రభుత్వాలు అవకాశం ఇవ్వడంతో సొంత రాష్ట్రానికి, సొంత ప్రాంతాలకు చేరిపోతానుకుంటున్న ఉద్యోగులకు... ఆ బదిలీల నిబంధనలు చూశాక మింగుడు పడడం లేదు. పలు నిబంధనలు తమ బదిలీలకు ఆటంకంగా మారతాయనే ఆందోళనతో ఉన్నారు. ఉపాధ్యాయుల బదిలీల విషయానికి వస్తే ఒకే సబ్జెక్టు, ఒకే నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులే పరస్పరం బదిలీ కావొచ్చు. ఉదాహరణకు... తెలంగాణ నుంచి ఏపీకి ఒక లెక్కల టీచర్ రావాలనుకుంటే... ఏపీ నుంచి తెలంగాణకు కూడా లెక్కల టీచరే వెళ్లాలి. అదే సమయంలో ఇద్దరూ పురపాలక పాఠశాల కానీ, జిల్లా పరిషత్ పాఠశాల కానీ... ఒకే దానిలో పనిచేస్తూ ఉండాలి. ఇలాంటి నిబంధనల వల్ల పరస్పర బదిలీకి ఉద్యోగులు దొరకరని టీచర్లు అంటున్నారు. అదే సమయంలో భార్యాభర్తల కేసులో... భార్య, భర్త ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి... ఎవరో ఒకరు సొంత రాష్ట్రానికి రావొచ్చు. అయితే పలువురు భార్యభర్తల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటే... ఒకరు ప్రైవేటు ఉద్యోగంలో ఉంటున్నారు. భర్త హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగంలో ఉంటే... భార్య విజయవాడలో ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవాళ్లు, దానికి భిన్నంగా ఉన్నవాళ్లూ పలువురు ఉన్నారు. ప్రభుత్వాల నిబంధనలతో వీరి బదిలీలకు అవకాశం ఉండదు. ఈ నిబంధన తమ ఆశలపై నీళ్లు చల్లిందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. అటునుంచి ఇటు, ఇటునుంచి అటు వెళ్లేవారి సంఖ్య సమానంగా ఉండడమే ప్రధానమని, మిగతా నిబంధనలు సడలించాలని కోరుతున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఏ ప్రభుత్వంపైనా అదనపు ఆర్థిక భారం పడకుండా... మిగతా నిబంధనలను సడలించి మానవతా దృక్పథంతో వ్యవహరించాలనే అభిప్రాయం ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య సమాన సంఖ్యలో ఉద్యోగులు బదిలీ కావడం, ఇరు రాష్ట్రాల మధ్య ఆర్థిక భారం సమానంగా పరస్పరం మారడం అన్న సూత్రాన్ని తీసుకుంటే సరిపోతుందని అంటున్నారు. రెండు వేర్వేరు శాఖల్లోని ఉద్యోగుల పరస్పర బదిలీకి అంగీకరించకపోయినా... కనీసం ఉపాధ్యాయుల బదిలీల్లో ఒకటే సబ్జెక్టు వారినే పరస్పరం బదిలీ చేయాలన్న నిబంధన అయినా మార్చాలంటున్నారు.

పాతనోట్లతో కొత్త మోసం!

- నోట్ల మార్పిడి కేసుల్లో కొత్తకోణం
- ప్రాసెసింగ్ ఫీజు పేరుతో లక్షల వసూలు
- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో సూత్రదారులు
- వీరిని గుర్తించే పనిలో పోలీసులు



అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో రూ.500, రూ.1000 పాత పెద్ద నోట్లు రద్దయి దాదాపు 9 నెలలు గడిచిపోయాయి. వీటిని మార్చుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా పూర్తయిపోయి చాలా కాలమే అయింది. అయినప్పటికీ.. ఇంకా పాత నోట్లను మారుస్తామంటూ కొన్ని ముఠాలు హల్ చల్ చేస్తూనే ఉన్నాయి. దీంతో పాత పెద్ద నోట్లను మార్చుకోలేక సతమతమవుతున్న వారు ఈ ముఠా సభ్యులను ఆశ్రయిస్తున్నారు. అయితే, ఇక్కడే ఈ ముఠా భారీ మోసాలకు తెరతీస్తోంది. పాత పెద్ద నోట్లను మార్చాలంటే రూ.కోటికి రూ.15 లక్షలు ముందుగానే ఇవ్వాలని ఆ తర్వాతే వ్యవహారం ముందుకు సాగుతుందని చెబుతూ.. పక్కాగా నమ్మించి మోసాలకు ఒడిగడుతోంది. దీంతో పోలీసులు ఈ ముఠాలపై దృష్టి పెట్టారు. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొందరు పాత నోట్లు మారుస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని విచారించిన పోలీసులు పాత నోట్లను అడ్డుపెట్టుకుని కొత్త మోసాలకు పాల్పడుతున్న వైనం బయటకు వచ్చింది. దీంతో జిల్లాల ఎస్పీలను అప్రమత్తం చేసి కొత్త మోసాలకు తెరతీస్తున్న అసలు వ్యక్తులను గుర్తించాలని డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి.

ఇదీ జరుగుతోంది!

రూ.500, రూ.1000 నోట్లను గత ఏడాది నవంబరు 8న కేంద్రం రద్దు చేసింది. దీంతో అక్రమంగా డబ్బులు దాచిన వారిలో ఆందోళన మొదలైంది. అలాంటి వారే లక్ష్యంగా కొన్ని ముఠాలు కొత్త మోసానికి తెరతీశాయి. ఎవరి దగ్గర డబ్బుందో మొదట గుర్తించి ఏదో ఒక రూపంలో వారిని సంప్రదిస్తారు. తమకు రిజర్వ్ బ్యాంకులో తెలిసిన వారున్నారని, వారి ద్వారా డబ్బులు మారుస్తామని బుట్టలో పడేస్తారు. ఆర్బీఐ నుంచి నేరుగా బ్యాంకులకు డబ్బు వస్తుందని, అక్కడి నుంచి మీకు అందజేస్తామని అందుకు గాను బ్యాంకు మేనేజర్‌కు, చార్టెడ్ అకౌంటెంట్‌కు, సెక్యూరిటీ ఇన్‌చార్జ్‌కు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని కోటికి రూ.15 లక్షలు ముందే ఇవ్వాలని చెబుతారు. ఈ మొత్తం ఇస్తే రద్దయిన నోట్లకు సగానికి సగం నుంచి 35% వరకు రూ.2 వేల నోట్లు తీసుకోవచ్చని చెబుతున్నారు. ఇలా.. ఎదుటి వ్యక్తిని నమ్మించి ఎంతో కొంత డబ్బులు లాగేస్తారు. ఆ తర్వాత డబ్బు బెంగళూరులో బ్యాంకు మేనేజర్ ద్వారా మారుద్దామని అక్కడికి తీసుకెళతారు. అక్కడ బాక్సుల్లో అడుగున తెల్లకాగితాలు పెట్టి పైన కొత్త రూ.2 వేలు, రూ.500 నోట్ల కట్టలను ఒక వరుస పెట్టి చూపిస్తారు. తాజాగా రెండు రోజుల క్రితం రాజమండ్రి పోలీసులు కడప జిల్లాకు చెందిన పదిమందిని అరెస్టు చేశారు. వారి నుంచి పాత నోట్లు రూ.1.10 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రిలో ఉంటూ గోదావరి జిల్లాల్లో పలువురితో 10% కమీషన్‌కు డబ్బులు సేకరించి ఆ మొత్తాన్ని 30 నుంచి 40 శాతానికి మార్చే ప్రయత్నాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. పాత నోట్లను మార్చడం అసాధ్యమని తెలిసీ ఈ ముఠాలు ఇలా చేయడంపై పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రద్దయిన నోట్లు మారుస్తామని ఎవరైనా వస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

సౌర విద్యుదుత్పత్తిలో ఏపీ టాప్

- కేంద్రమంత్రి పీయూష్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 10: దేశ వ్యాప్తంగా సౌర విద్యుదుత్పత్తి 13 గిగావాట్ల సామర్థ్యాన్ని దాటిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయంలో ఏపీ, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయని తెలిపింది. గురువారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ... ఈ ఏడాది జూలై 31 నాటికి ఏపీ, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు వాటికి కేటాయించిన 1 జీడబ్ల్యూ సామర్థ్యం కంటే అధికంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయని వెల్లడించారు. 2,048 ఎంవీల ఉత్పత్తితో ఏపీ అగ్రస్థానం దక్కించుకోగా, రాజస్థాన్ (2,022 ఎంవీ), తమిళనాడు (1,697 ఎంవీ), తెలంగాణ (1609.32 ఎంవీ) తర్వాత స్థానాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు.



- జంతర్‌మంతర్‌లో మాల మహానాడు ధర్నా



జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

న్యూఢిల్లీ, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టవద్దని ఏపీ మాలమహానాడు ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మూడో రోజు గురువారం ధర్నా చేపట్టారు. వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పుకు, ఎస్సీ కమిషన్ నివేదికకు, రాజ్యాంగస్ఫూర్తికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ధర్నాలో జి.చెన్నయ్య, పసుల రాంమూర్తి, జంగాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గృహాల కేటాయింపు నిబంధనలు ఖరారు

- అమరావతిలో ఆవాసాలకు దరఖాస్తుకు చివరి తేదీ 17

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని 27 గ్రామాలకు చెందిన పేదలకు అమరావతిలో గృహాలను కేటాయించేందుకు ఏపీసీఆర్డీయే నిబంధనలను ఖరారు చేసింది. 'అమరావతి గృహనిర్మాణ పథకం' కింద మొత్తం 5,024 మందికి ఏపీ టిడ్కో సహకారంతో జి+3 విధానంలో ఈ ఇళ్లను సీఆర్డీయే నిర్మించనుంది. తెల్లరేషన్ కార్డు ఉండి, ఇల్లు గానీ, ఇంటి స్థలం గానీ లేనివారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. లబ్ధిదారుల కుటుంబ సభ్యులెవరూ గతంలో ఏ విధమైన ప్రభుత్వ గృహనిర్మాణ పథకం ద్వారా లబ్ధి పొంది ఉండకూడదని నిబంధన విధించింది. ఆసక్తి ఉన్నవారు తమ దరఖాస్తులను ఫొటో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్‌ల జిరాక్స్ కాపీలతో ఈనెల 17లోగా రాజధాని గ్రామాల్లో ఉన్న సీఆర్డీయే లోకల్ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయాల్లో సమర్పించాలని సీఆర్డీయే ల్యాండ్స్ అండ్ సామాజికాభివృద్ధి విభాగ సంచాలకుడు బి.ఎల్.చెన్నకేశవరావు తెలిపారు.

ఐవైఆర్ అప్పుడెందుకు మాట్లాడలేదు?

- పదవి పోగానే అభిప్రాయాలు మారతాయా: లింగారెడ్డి

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'ఐవైఆర్ కృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయం ఎలా పనిచేయాలో చెప్పలేదు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడూ మాట్లాడలేదు. ఆ పదవి పోగానే ఇప్పుడు సీఎం కార్యాలయం సమాంతర సచివాలయం మాదిరిగా పనిచేస్తోందని అంటున్నారు. పదవి పోగానే అభిప్రాయాలు మారతాయా?' అని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మల్లెల లింగారెడ్డి గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు.

జెన్‌కో లిఖితపూర్వక హామీ ఇవ్వాలి

- బకాయిలపై తెలంగాణకు లీగల్ నోటీసులు

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హిందూజాతో సహా పలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు రద్దు చేసుకోవాలంటే భవిష్యత్‌లో అవరోధాలను సాకుగా చూపకుండా రాష్ట్రావసరాలకు తగినంత విద్యుత్తును అందిస్తాంటూ లిఖిత పూర్వకంగా తెలియజేయాలంటూ ఏపీ జెన్కోను ప్రభుత్వం కోరింది. గురువారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్, జెఎండీ దినేశ్ పరుచూరి, ప్రభుత్వ సలహాదారు రంగనాథం, డిస్కమ్ సీఎండీ హెచ్‌వై దొర తదితరులతో సీఎస్ దినేశ్ కుమార్ సమావేశమయ్యారు. ట్రాన్స్‌కో కొత్తగా అభివృద్ధి పథకాలు చేపట్టరాదని, రూ.4200కోట్ల బకాయిలను తెలంగాణ తక్షణమే చెల్లించాలంటూ లీగల్ నోటీసులు జారీ చేయడంతోపాటు పారిశ్రామిక ట్రిబ్యునల్‌కూ వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు సబ్సిడీ విత్తనాలు

- వ్యవసాయ కమిషనర్ హరిజవహర్‌లాల్

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు లక్షా 35వేల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం.హరిజవహర్‌లాల్ గుంటూరులో చెప్పారు. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 125 మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఈనెల 15నుంచి అమలు చేస్తామని చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1680కోట్లు విడుదల కాగా, రూ.1382కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

నెలాఖరులోగా వ్యవసాయ ఉద్యోగుల రోస్టర్

అమరావతి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో ఉద్యోగుల రోస్టర్ తయారు చేస్తున్నారు. నాలుగో తరగతి నుంచి అదనపు డైరెక్టర్ స్థాయి వరకు ఉద్యోగుల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని నెలాఖరులోగా జాబితాను సిద్ధం చేయనున్నారు. హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(హెచ్‌ఆర్ఎంఎస్) సాఫ్ట్‌వేర్ ద్వారా వ్యవసాయశాఖ ఉద్యోగులందరి సర్వీస్‌ను అందులో నమోదు చేసి, పదోన్నతుల జాబితాను రూపొందించనున్నారు.

కేంద్ర విద్యాసంస్థలకు 7వేల కోట్లు: గంటా

తాడేపల్లిగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏర్పాటైన ఐదు కేంద్ర విద్యాసంస్థలకు శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి రూ.7వేల కోట్ల నిధులు మంజూరుకు కసరత్తు జరుగుతోందని మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. నిధుల విడుదల చేయడంలో కేంద్రం చేస్తున్న జాప్యాన్ని నివారించేందుకే బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునే ప్రక్రియ చేపట్టామన్నారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని మంత్రి మాణిక్యాలరావు నివాసంలో ఆయన మాట్లాడారు.

ఫార్మాసిస్టులుగా ఆయుష్ కంపౌండర్లు

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగంలో పనిచేస్తున్న కంపౌండర్లను ఇకనుంచి ఫార్మాసిస్టులుగా పరిగణించనున్నారు. ఈ మేరకు గురువారం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఆయుష్ ఆస్పత్రుల్లో కంపౌండర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది వరకు పనిచేస్తున్నారు. వీరిని ఫార్మాసిస్టులుగా పరిగణించాలన్న డిమాండ్ చాలాకాలం నుంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది.

తూకంలో తేడాలకు ఫుల్‌స్టాప్!

- ఎంఎల్ఎస్ పాయింట్‌లకు ఈపోస్ యంత్రాలు
- ప్రప్రథమంగా 'తూర్పు'లో పంపిణీ
- దశలవారీగా అన్ని జిల్లాలకూ




గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): మండల స్థాయి నిల్వ(ఎంఎల్ఎస్) కేంద్రాల నుంచి రేషన్ డీలర్లకు పంపిణీ చేస్తున్న సరుకు తూకంలో తేడాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు డీలర్ల వద్ద మాత్రమే ఉన్న ఈపోస్ యంత్రాలను ఈ కేంద్రాలకు పంపిణీ చేయనుంది. రాష్ట్రంలో ప్రప్రథమంగా తూర్పు గోదావరి జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లన్నింటికీ ఈపోస్ యంత్రాలను పంపిణీ చేశారు. దశలవారీగా 2-3 నెలల్లోనే రాష్ట్రంమొత్తం వీటిని సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్‌లలో జీసీసీ 10, పౌరసరఫరాల సంస్థ 410 కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో వీటిని స్టేజ్-2 కింద పరిగణిస్తారు. తొలుత ఎఫ్‌సీఐ గిడ్డంగుల నుంచి బియ్యం లిఫ్టింగ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు తీసుకొస్తారు. ఇక్కడినుంచి జీపీఎస్ అమర్చిన లారీల్లో రేషన్ షాపులకు సరుకులు చేర్చి ప్రజలకు పంపిణీ చేస్తారు. ఇటీవల తమకు సరఫరా చేస్తున్న బియ్యం బస్తాల తూకంలో 2నుంచి 5 కేజీల తరుగుదల ఉంటోందని డీలర్లు ఫిర్యాదు చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు సరఫరా చేస్తున్న బియ్యం బస్తాల తూకం కూడా తక్కువగా ఉంటోందని ఐసీడీఎస్ సీడీపీవోలు ఫిర్యాదు చేస్తున్నారు. వీటిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈపోస్ యంత్రాలను అమర్చాలని నిర్ణయించింది. డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లి వేలిముద్ర వేస్తే వారి షాపునకు కేటాయించిన కోటా ప్రకారం కచ్చితమైన తూకంతో బియ్యం రిలీజ్ అవుతుంది. దీని వల్ల తూకంలో మోసాలకు అడ్డుకట్ట పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రానున్నది కొలువుల పండుగ

- రాష్ట్రంలో భారీ పరిశ్రమల ఏర్పాటు
- సింహభాగం రాయలసీమలోనే...
- మూడేళ్లలో రూ.83వేల కోట్ల పెట్టుబడులు
- లక్షా 30వేల మందికి ఉద్యోగాలు
- పరిశ్రమల శాఖాధికారుల వెల్లడి

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం పారిశ్రామిక హబ్‌గా మారుతోంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అనేక పెద్దసంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. రానున్న కాలంలో ఏపీలో భారీ పరిశ్రమలు స్థాపితం కానున్నాయని, అదే స్థాయిలో ఉద్యోగావకాశాలూ పెరుగుతాయని పరిశ్రమల శాఖాధికారులు చెబుతున్నారు.



గత మూడేళ్లలో పరిశ్రమల స్థాపన కోసం పలు సంస్థలు రూ.83,000 కోట్ల పెట్టుబడులు పెట్టాయని, దీని ద్వారా ప్రత్యక్షంగా 1,30,000 మందికి, పరోక్షంగా 4,50,000 మందికి ఉపాధి దక్కిందని అంటున్నారు. వీటిలో ఎక్కువ శాతం పరిశ్రమలు రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయంటున్నారు.

జిల్లా	పరిశ్రమ	పెట్టుబడులు (రూ. కోట్లలో)	ఉద్యోగాలు
చిత్తూరు	ఇసుజు మోటార్స్	3,000	3,000
చిత్తూరు	హీరో మోటర్ కార్ప్	1,600	5,000
చిత్తూరు	లాంజీ సోలార్ సెల్స్	1,500	1,000
కర్నూలు	సోలార్ రెన్యూ	150	100
కర్నూలు	డీఆర్‌డీవో యూనిట్	1,000	3,000
అనంతపురం	కల్యాణి స్టీల్స్	1,000	2,000
అనంతపురం	విటల్ ఇన్నోవేషన్స్	5,000	5,000
అనంతపురం	భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్	500	300
అనంతపురం	కియ మోటార్స్	7,000	11,500
నెల్లూరు	భారత్ ఫోర్జ్ యూనిట్	1,200	3,000
నెల్లూరు	ఆటా టర్బైన్ల సంస్థ	1,000	1,000
నెల్లూరు	బ్రేక్స్ ఇండియా(టీవీఎస్)	150	600
కృష్ణా జిల్లా	అశోక్ లేలాండ్	1,000	1,500
కృష్ణా జిల్లా	భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్	300	200
విశాఖ	ఎస్సెల్ ఇన్‌ఫ్రా	10,000	15,000
విశాఖ	హరోన్ సంస్థ	1,188	1,200
విశాఖ	ట్రిని సోలార్	2,800	3,500
విశాఖ	పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ	4,500	5,000

ఏపీకి మరో రెండు భారీ పరిశ్రమలు

- వెయ్యి కోట్లతో జపాన్ కంపెనీ టోరే
- 540 కోట్లతో హీరో అనుబంధ సంస్థ
- సీఎంతో కంపెనీల ప్రతినిధుల భేటీ

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్‌కు మరో రెండు భారీ పరిశ్రమలు రానున్నాయి. రాష్ట్రంలో రూ.1000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను స్థాపించేందుకు జపాన్‌కు చెందిన టోరే కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రంలో పరిస్థితిని అధ్యయనం చేసిన తర్వాత ఏపీలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు టోరే కంపెనీ ప్రతినిధులు తెలిపారు. శ్రీసిటీలో పరిశ్రమను ఏర్పాటు చేస్తామని, 100 మందికి ప్రత్యక్షంగా, 300 మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని చెప్పారు. టోరే గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వార్షిక టర్నోవర్ 20.3 బిలియన్ డాలర్లని, తమ సంస్థల్లో 48,248 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని సంస్థ ప్రతినిధులు వివరించారు. టోరే గ్రూప్.. ఫైబర్, టెక్స్‌టైల్, లైఫ్ సైన్సెస్, తదితర రంగాల్లో వ్యాపారం చేస్తోందని వివరించారు. గురువారం సచివాలయానికి వచ్చిన టోరే సంస్థ ప్రతినిధులు సీఎంతో సమావేశమయ్యారు. తమ కంపెనీకి వచ్చే జనవరిలో శంకుస్థాపన చేసి 2020కి ప్రారంభోత్సవం చేస్తామని వారు సీఎంకి తెలిపారు. కాగా, హీరోమోటార్ కార్ప్‌కు అనుబంధ సంస్థ అయిన రాక్‌మెన్ ఇండస్ట్రీస్ రాష్ట్రంలో రూ.540 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ ప్రతినిధులు కూడా సీఎంని కలిశారు. ఈ గ్రూప్ చిత్తూరు జిల్లాలో తన ఉత్పాదక ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. హీరో మోటర్ కార్ప్, ఫోర్డ్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ అవసరాలను తమ సంస్థ తీరుస్తోందని, ఏపీలో ఏర్పాటు చేసే ప్లాంటు ద్వారా 4000 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఏపీలో తమ ఉత్పాదక యూనిట్ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు కావాల్సిన అల్యూమినియం డైకాస్ట్ భాగాలను ఉత్పత్తి చేస్తుందని అన్నారు. తమ ప్రాజెక్టును మూడు దశల్లో నెలకొల్పుతామని అన్నారు. మొదటిదశలో 2019 నాటికి రూ.300 కోట్ల పెట్టుబడులతో 600 నుంచి 700 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. భూ కేటాయింపులు జరిగిన నెలరోజుల్లో శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లాను భారతదేశానికే లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.



సీఎం చంద్రబాబుతో సమావేశమైన జపాన్ కంపెనీ ప్రతినిధులు

జాబ్స్.. జోష్

(మూడో పేజీ తరువాయి)

తీర్చిదిద్దుతామని అన్నారు. బెంగళూరుకు చెందిన బీఆర్ శెట్టి సంస్థ ద్వారా రాజధానికి రూ.12 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. దీంతో వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. బీఆర్ శెట్టితోపాటు గల్ఫ్ దేశాల నుంచి ఎంతో మంది అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని సీఎం వివరించారు. త్వరలో అమరావతి నుంచి ఎమిరేట్స్‌కు విమానం తిరుగుతోందని అభిలషించారు. త్వరలోనే మరో ప్రఖ్యాత సంస్థ ఇండో-యూకే ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. రాజధాని ప్రాంతానికి 13 వైద్య కళాశాలలు వస్తున్నాయిని తెలిపారు. అమరావతిలో పరిపాలనా భవనాల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు సీఎం తెలిపారు. అమరావతిలో 27 టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అలాగే అమరావతిలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా 15 నిమిషాల్లోనే చేరుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరంలో గేమింగ్, వర్చువల్ స్టూడియోలను ఏర్పాటు చేయటంతోపాటు అమరావతిని నాలెడ్జ్, మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల నివసించేందుకు సుమారు 4 వేల గృహాల నిర్మాణం కోసం రూ.2 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పేదవారి ఆదాయాన్ని పెంచడానికి ఒక ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సీఎం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఇంధనశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సీఆర్డీయే కమిషనర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మెడిసిటీలో ఏముంటాయంటే!

మెడిసిటీ నిర్మాణాన్ని లాభాల కోసం చేపట్టడం లేదని, సామాజిక సేవాదృక్పథంతోనే చేపడుతున్నామని డాక్టర్ బీఆర్ శెట్టి వెల్లడించారు. మెడిసిటీలో రూ.3 వేల కోట్లతో వైద్య వర్సిటీ, వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రూ.600 కోట్లతో వైద్య ఉపకరణాల తయారీ యూనిట్, రూ.250 కోట్లతో క్వాంటం డేటా సెంటర్, రూ.400 కోట్లతో అమరావతి ఐబీ స్కూల్, రూ.250 కోట్లతో నాలెడ్జ్ ప్రాసెసింగ్ ఔట్ సోర్సింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



డీఎంకేలో ఎప్పుడో చేరేవాణ్ని

• మురసోలి వార్షికోత్సవంలో కమల్

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డీఎంకేలో చేరేందుకే ఆ పార్టీ అధికార పత్రిక 'మురసోలి' వజ్రోత్సవంలో పాల్గొనేందుకు వెళ్తున్నారన్న ఊహాగానాలపై విశ్వనటుడు కమల్‌హాసన్ ఘాటుగా స్పందించారు. తాను డీఎంకేలో చేరాలనుకుంటే 1983లోనే చేరేవాడినని చెప్పారు. గురువారం చెన్నైలో జరిగిన మురసోలి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కమల్ మాట్లాడుతూ.. "శివాజీ గణేశన్‌కు సంభాషణలు రాసింది కరుణానిధి అని తెలుసుకున్నప్పటి నుండి నేను ఆయనకు వీరాభిమానిగా మారిపోయాను. ఈ సభలో పాల్గొనటానికి వెళ్లి డీఎంకేలో చేరతానని పలువురు విమర్శించారు. కావాలనుకుంటే 1983లోనే చేరేవాణ్ని. 'నువ్వు ఎందుకు డీఎంకేలో చేరకూడదు' అని కరుణానిధి నుంచి అప్పట్లో టెలిగ్రామ్ వచ్చింది. దానికి ఏం సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. చేరను అని చెప్పడానికి, చేరడానికీ ధైర్యం లేకపోయింది. ఇప్పటికీ నేను ఆ టెలిగ్రాంకు సమాధానం ఇవ్వలేదు, ఆయనా పట్టించుకోలేదు" అని కమల్ పేర్కొన్నారు. మన జాతీయ గీతం 'జనగణమన'లో ద్రావిడం ఉన్నంతవరకు ద్రావిడ భావాలు సుస్థిరంగా ఉంటాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమానికి డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షత వహించగా..సూపర్‌స్టార్ రజనీకాంత్, వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. అయితే వేదికపై కమల్, వేదిక కింద రజనీ కూర్చోవడం చర్చనీయాంశమైంది. రజనీ, కమల్ తదితర అతిథులను స్టాలిన్ సత్కరించారు.

వడివడిగా విలీనం?

బీజేపీ హెచ్చరికతో అన్నాడీఎంకే వర్గాల్లో కదలిక.. నేడు ఢిల్లీలో ఓపీఎస్-ఈపీఎస్ భేటీ?

- కమలనాథుల సమక్షంలోనే మంతనాలు
- పన్నీర్‌కు ఉపముఖ్యమంత్రి పదవి?
- ప్రధాన కార్యదర్శి పదవీ కోరుతున్న ఓపీఎస్
- దినకరన్‌పై సీఎం వర్గం వేటు
- ఆయన నియామకం చెల్లదని తీర్మానం
- శశికళనూ సాగనంపాలని పన్నీర్ పట్టు
- 15వ తేదీకల్లా విలీన ప్రక్రియ పూర్తి!



చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో సీఎం ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వర్గం, మాజీ సీఎం పన్నీర్ సెల్వం (ఓపీఎస్) వర్గం విలీనం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాయి. బీజేపీ అధినాయకత్వం అల్టిమేటంతో దిగివచ్చి.. ఒక్కో అడ్డంకిని తొలగించుకుంటున్నాయి. ఇందులో భాగంగా పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ నియామకం చెల్లదని ఈపీఎస్ వర్గం ప్రకటించింది. దీంతో రెండు వర్గాలు కలిసిపోవడానికి మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో ఈపీఎస్, ఓపీఎస్ ఇద్దరూ శుక్రవారం ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో మంతనాలు జరుపనున్నారు. ఓపీఎస్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు ఎడప్పాడి సుముఖంగా ఉన్నారు. అయితే ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కూడా పట్టుబడుతున్నట్లు సమాచారం. హస్తిన చర్చల్లో రాజీ కుదురుతుందని, 15వ తేదీలోపు విలీన ప్రక్రియ ముగిసిపోతుందని ఉభయ వర్గాల నేతలు ఆశాభావంతో ఉన్నారు.

చకచకా పరిణామాలు..

గురువారం ఉదయం నుంచే తమిళనాడులో శరవేగంగా కీలక పరిణామాలు సంభవించాయి. పళనిస్వామి నేతృత్వంలో ఆయన వర్గ (అన్నాడీఎంకే-అమ్మ) నేతలు పార్టీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఉప ప్రధాన కార్యదర్శిగా దినకరన్ నియామకం చెల్లదని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీనిపై 27 మంది పార్టీ నిర్వాహకులు సంతకం చేశారు. వివిధ పదవుల్లో ఆయన నియమించిన 64 మంది నియామకాలు కూడా చెల్లుబాటు కావని జయ నియమించిన కార్యవర్గమే చెల్లుబాటవుతుందని, ఆ కార్యవర్గమే పార్టీని, ప్రభుత్వాన్ని నడుపుతోందని కూడా తీర్మానం చేయడంతో శశికళను కూడా పక్కనబెట్టినట్లే అయింది. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య చర్చలకు మార్గం సుగమమైందని భావిస్తున్నారు. భేటీ అనంతరం మంత్రి వైద్యలింగం విలేకరులతో మాట్లాడుతూ... త్వరలోనే విలీన ప్రక్రియ ముగుస్తుందన్నారు. 15వ తేదీలోపే కలిసిపోతామని మరో మంత్రి డి.జయకుమార్ కూడా చెప్పారు.

బీజేపీ అల్టిమేటంతో..

'మీరు కలుస్తారా? లేక మమ్మల్నే కలిపేసుకోమంటారా?' అంటూ ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం అన్నాడీఎంకేలోని రెండు వర్గాలకు అల్టిమేటం జారీ చేసింది. ఈ నెల 22న అమిత్‌షా తమిళనాడులో పర్యటించేలోపే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. దీంతో రెండు వర్గాల్లోనూ కదలిక వచ్చింది. గురువారం సాయంత్రం ఢిల్లీ బయల్దేరే ముందు పళనిస్వామి సీనియర్లతో భేటీ అయ్యారు. శుక్రవారం ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడి ప్రమాణస్వీకారం ముగియగానే ఈపీఎస్, ఓపీఎస్ బీజేపీ నేతల సమక్షంలో భేటీ అవుతారని సమాచారం. ఓపీఎస్ కూడా ఢిల్లీ బయల్దేరే ముందు మీడియాతో మాట్లాడుతూ.. తమ డిమాండ్లలో సగం పూర్తయ్యాయని, మిగతా సగం కూడా నెరవేర్చితే విలీనానికి అభ్యంతరం లేదన్నారు.



సిద్ధర్ ఆశ్రమంలో దినకరన్

నన్నెవరూ తొలగించలేరు: దినకరన్

చెన్నై, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి)తనను తొలగించే అధికారం పార్టీ నిర్వాహకులకు లేదని దినకరన్ ప్రకటించారు. తంజావూరులో విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసేవారిపై చర్య తీసుకునే అధికారం తనకుందని హెచ్చరించారు. శశికళ నియమించిన దిండుగల్ శ్రీనివాసన్ కోశాధికారిగా పనిచేసేందుకు అంగీకరించిన సీఎం వర్గం.. ఆమే నియమించిన తనను ఎలా దూరం చేస్తారని ప్రశ్నించారు. తాను నోరు విప్పితే ఈపీఎస్ పదవి పోవడం ఖాయమన్నారు. తాను రాష్ట్ర పర్యటన తలపెట్టడంతో పళనిస్వామి భయపడుతున్నారని ఆరోపించారు.

సిద్ధర్ ఆశీస్సులు పొందిన దినకరన్

దినకరన్ శ్రద్ధగా.... భక్తి ప్రవత్తులతో బాసింపట్టు వేసుకుని కూర్చుని ధ్యానం చేస్తున్నారు కదా... ఆ బాబా పేరు ముక్కుపొడి సిద్ధర్. గురువారం ఆయన ఆశ్రమానికి వెళ్లిన దినకరన్ ఓ పదిహేను నిమిషాలు ఇలా ధ్యానం చేస్తూ గడిపారు. ఆ తర్వాత సిద్ధర్ వద్ద ఆశీస్సులు పొంది తంజావూర్ వెళ్లారు. అంతకుముందు శత్రు నాశనం అయ్యేందుకు దినకరన్ రహస్యంగా వేకువజామునే వరాహి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.



91 ఏళ్ల వయసులో

బామ్మ డిగ్రీ!

బ్యాంకాక్: చదువుకు వయసుతో సంబంధం లేదని నిరూపించింది థాయ్‌లాండ్‌కు చెందిన ఓ బామ్మ. 91 ఏళ్ల వయసులో పదేళ్లపాటు కష్టపడి చదివి బ్యాచిలర్ డిగ్రీ సంపాదించింది కిమ్లాన్ జినాకుల్. ఆమెకు బ్యాచిలర్ డిగ్రీ పట్టాను స్వయంగా థాయ్‌లాండ్ రాజు వజిరలాంగ్‌కోర్న్ అందించారు.

సైనికులు రేపిస్టులు!

• కర్ణాటకలో విద్యార్థులకు వివాదాస్పద పాఠం

బెంగళూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంగళూరు విశ్వవిద్యాలయంలో బీసీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉద్దేశించిన పాఠ్యాంశాల్లో 'సైనికులు రేపిస్టులు' అనే అంశం ప్రచురితం కావడం కర్ణాటకలో పెనువివాదానికి కారణమైంది. సీనియర్ సాహితీవేత్త బరుగూరు రామచంద్రప్ప రచించిన 'యుద్ధం ఒక పరిశ్రమ' అనే పాఠ్యాంశంలో సైనికుల గురించి ప్రస్తావించిన అంశాలు వివాదాస్పదం అయ్యాయి. యువతకు సైనికుల పట్ల గౌరవం పెంచేలా కాకుండా ఇటువంటి నీతిలేని అంశాలను పాఠ్యాంశంగా ముద్రించడం ఎంతవరకూ సమంజసమని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. దీనిపై రచయిత బరుగూరు రామచంద్రప్ప వివరణ ఇస్తూ.. ఓ మిత్రుడు చెప్పిన మేరకు పాఠ్యాంశంలో సైనికులను రేపిస్టులుగా ప్రస్తావించానని, అది పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయం కాదన్నారు. తన రచనను పాఠ్యాంశంగా ఎంపిక చేసి ముద్రించేందుకు ఒక కమిటీ ఉంటుందని వారు కూడా పరిశీలించాక స్పందిస్తానన్నారు. సైనికుల పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని ఎప్పటికీ వారి సేవలను కించపరచే లేదన్నారు.

నవీన భారతాన్ని సృష్టించండి

- **10-15 అంశాలతో లక్ష్యాన్ని పెట్టుకోండి**
- **2022 కల్లా అభివృద్ధికి బాటలు వేయండి**
- **కలెక్టర్లకు ప్రధాని మోదీ 10 ఆదేశాలు**



హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సమర్థత, ప్రతిభా పాటవాలతో 2022 కల్లా నవీన భారతదేశాన్ని సృష్టించాలని జిల్లా కలెక్టర్లకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. వారితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. కార్యాలయాలు వదిలి, క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రజలు పడుతున్న ఇబ్బంది లేంటో తెలుసుకుని, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. పంద్రాగస్టుకల్లా 10-15 అంశాలతో ప్రణాళికను సిద్ధం చేసుకుని, 2022 కలా పరిష్కారానికి రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు.

- పలు జిల్లాల్లో ప్రజలకు కరెంట్, నీరు, విద్యా, వైద్యం అందడం లేదు.
- దేశంలోని 100 అత్యంత వెనుకబడిన జిల్లాల్లోని సామాజిక ఆర్థిక స్థితి గతులు మెరుగుపరచాలి. దీనివల్ల దేశసమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. ఆయా జిల్లాల్లో శరవేగంగా పనులు చేసి, పురోగతిని సాధించండి.
- జిల్లాలు ఏం కోరుకుంటున్నాయో పంద్రాగస్టుకల్లా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోండి. 10-15 అంశాలతో నివేదికను సిద్ధం చేసి, 2022 కల్లా ఆయా అంశాలవారీగా జిల్లాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి వీలుగా కసరత్తు చేయండి.
- ఎల్‌ఈడీ బల్బులు, భీమ్ యాప్‌ల ప్రయోజనాలను వివరించండి.
- ప్రతీ వ్యాపారి జీఎస్టీలో రిజిస్టర్ అయ్యేలా చొరవ తీసుకోండి.



మినపగుళ్ల ప్యాకెట్‌లో ఎలుక

కంగుతిన్న ఇల్లాలు.. బిగ్‌బాస్కెట్ డాట్‌కామ్ లీల!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కిరాణా సరుకులను మీరు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించుకుంటారా? అయితే.. జాగ్రత్తండోయ్. ఏ ప్యాకెట్లో ఏ కళేబరం ఉంటుందో ఎవరు చెప్పగలరు? బస్తాల్లో పురుగులేవీ లేకుండా స్వచ్ఛమైన బియ్యం లభిస్తున్న రోజులివి! అలాంటిది.. ఓ చిన్న మినపగుళ్ల ప్యాకెట్లో చచ్చిపడివున్న ఓ పెద్ద ఎలుకే బయటపడింది. అంతే.. ఇడ్లీల కోసం చక్కగా మినపగుళ్లను నానబెట్టాలని ప్యాకెట్ తెరిచిన ఆ ఇల్లాలు.. అందులో మూషిక కళేబరాన్ని చూసి కంగుతింది! హైదరాబాద్‌లోని మాదాపూర్ శ్రీరామా కాలనీలో ఉంటున్న పరమట సుమన దంపతులు ఈ నెల 6న "బిగ్‌బాస్కెట్ డాట్‌కామ్"లో నిత్యావసర వస్తువులను ఆర్డర్ చేశారు. మరుసటి రోజే సరుకులన్నీ డెలివరీ అయ్యాయి. మినపప్పు అవసరమవడంతో ప్యాకెట్ తీసిన సుమన.. తన చేతికి ఏదో మెత్తగా తగలడంతో అనుమానించారు. వెంటనే ఏబీఎన్‌కు ఆమె సమాచారమిచ్చారు. మీడియా ప్రతినిధుల సమక్షంలో ప్యాకెట్ తెరిచి చూడగా.. అందులోంచి చచ్చిపడివున్న ఎలుక బయటపడింది. బయట నాణ్యతలేని వస్తువులు అమ్ముతుంటారనే అనుమానంతో రెండేళ్లుగా బిగ్‌బాస్కెట్ డాట్‌కామ్ నుంచే తాము కిరాణా సరుకులు కొంటున్నామని సుమన తెలిపారు. గతంలో ఓసారి మామిడి పళ్లను ఆర్డర్ చేసి తెప్పించుకుంటే.. అవి రెండ్రోజుల్లోనే నల్లగా మారిపోయాయని ఆమె వాపోయారు. కాగా ఈ ఘటనపై సుమన మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రతినిధి ప్రయత్నించగా.. బిగ్‌బాస్కెట్ డాట్‌కామ్ వారు అందుబాటులోకి రాలేదు.

• ఎర్ర సముద్రంలో 56 మంది మృతి!



దుబాయ్, ఆగస్టు 10: డబ్బులకు కక్కుర్తి పడిన స్మగ్లర్లు 56 మంది ప్రాణాలను బలిగొన్నారు. ఆఫ్రికాలోని ఇథియోపియా, సోమాలియా నుంచి యెమన్‌కు ఎర్ర సముద్రం ద్వారా అక్రమంగా వలసదారులను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న సమయంలో రెండు చిన్నబోట్లలో పరిమితికి మించి 300 మందిని బలవంతంగా తరలిస్తుండగా ఒక బోటు అదుపుతప్పింది. ఆ బోటులో ఉన్న 56 మంది ఆఫ్రికన్ వలసదారులు మృత్యువాత పడ్డారు.తీరానికి చేరిన తర్వాత అరెస్ట్ చేస్తారేమోనని వలసవాదులు భయపడినప్పటికీ స్మగర్లు వారిని బలవంతంగా బోట్లలోనికి ఎక్కించారని ఐఓఎమ్ ప్రతినిధి తెలిపారు. భవిష్యత్తు మీద ఆశతో ఎందరో యువకులు తమ ప్రాణాలను స్మగర్ల చేతిలో పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జపాన్ శాస్త్రవేత్తకు గీతం అవార్డు



విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆగస్టు): ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, టోక్యో(జపాన్) కాస్మిక్ రే రీసెర్చి ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ టకాకి కజితను గీతం ఫౌండేషన్ అవార్డు-2017కు ఎంపిక చేసినట్టు గీతం వైస్ ఛాన్సలర్ ఎం.ఎస్.ప్రసాదరావు గురువారం తెలిపారు. గీతం 37 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 12వ తేదీన నిర్వహించే వ్యవస్థాపక దినోత్సవంలో టకాకి కజితకు ప్రశంసాపత్రంతోపాటు రూ.10 లక్షల నగదును అందజేస్తామని పేర్కొన్నారు. కాస్మిక్ రే ఫిజిక్స్‌లో పేరొందిన టకాకి కజిత కెనడాకు చెందిన ఆర్థర్ మెక్‌డొనాల్డ్‌తో కలిసి 2015లో నోబెల్ బహుమతిని కూడా పొందారని ప్రసాదరావు పేర్కొన్నారు.

కార్తీ చిదంబరానికి కోర్టులో ఊరట

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అవినీతి కేసులో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ, మరో నలుగురికి పాస్‌పోర్ట్ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 'లుక్ అవుట్' నోటీసుపై మద్రాసు హైకోర్టు గురువారం స్టే విధించింది. ఈ నోటీసును రద్దు చేయాలని కార్తీ చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.దురైస్వామి గురువారం విచారణ జరిపారు. లుక్‌అవుట్ నోటీసుపై స్టే విధించి, సెప్టెంబరు 4లోపు కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించారు.

• లోక్‌సభలో కనీస వేతన బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: నూతన కనీస వేతన బిల్లు(ది కోడ్ ఆన్ వేజెస్)ను కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ప్రకారం అన్ని రంగాల్లో కనీస వేతనాలను నిర్ణయించే అధికారం కేంద్రానికి లభిస్తుంది. సభలో బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఇది కార్మికుల వేతనాల్లో చారిత్రక మార్పు తీసుకువస్తుందన్నారు

• కూతురిపై అత్యాచారం.. 1200 ఏళ్ల శిక్ష?

కౌలాలంపూర్: కన్న కూతురిపై దాదాపు ఏడు నెలలపాటు అతిక్రూరంగా అత్యాచారానికి పాల్పడిన మలేసియా వ్యక్తిపై 626 అత్యాచార కేసులు నమోదయ్యాయి. దీంతో నిందితుడికి 1200 ఏళ్లపాటు జైలు శిక్ష పడే అవకాశమున్నట్టు తెలుస్తోంది. 626 కేసులను చదవడానికి కోర్టు అధికారులకు రెండ్రోజులు పట్టింది. ఒక్కో కేసుకు గరిష్ఠంగా 20 ఏళ్లపాటు జైలుశిక్ష విధించే అవకాశమున్నట్టు కేసులను విచారించే స్పెషల్ కోర్టు న్యాయవాది తెలిపారు.

• హసన్ అలీ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

ముంబై, ఆగస్టు 10: హవాలా కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్న ఈడీ పుణేకు చెందిన గుర్రపుశాల యజమాని హసన్ అలీ ఖాన్(62)కు చెందిన నాలుగు కార్యాలయాల్లో గురువారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించింది. సీబీఐ కూడా అతనిపై ఈ ఏడాది ఆరంభంలో అవినీతి, క్రిమినల్ కేసులు నమోదు చేసింది. హసన్ అలీపైనా అతడి నలుగురు సహచరులపైనా 2011లో ఈడీ హవాలా కేసు నమోదు చేసింది. హవాలా కేసులో జైలుకు కూడా వెళ్లిన హసన్ అలీ 2015లో బెయిల్‌పై విడుదలయ్యాడు.

• చీలిక దిశగా జేడీ (యూ)!

పాట్నా, ఆగస్టు 10: జనతా దళ్ (యూ) చీలికపై ఆ పార్టీ నేత శరద్ యాదవ్ సంకేతాలిచ్చారు. తాను మహా కూటమితోనే ఉంటానని స్పష్టం చేశారు. 'సర్కారీ (అధికార) జనతా దళ్ వాళ్లు పాట్నాలో ముఖ్యమంత్రి, మంత్రులు అయ్యారు. నిజమైన జనతా దళ్ మాత్రం ప్రజల్లో ఉంది' అని వ్యాఖ్యానించారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్‌తో విభేదించిన శరద్ యాదవ్.. ఆ పరిణామాల తర్వాత తొలిసారి రాష్ట్ర పర్యటనకు వచ్చారు. మహా కూటమి నుంచి విడిపోవడం 11 కోట్ల మంది రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని విచ్ఛిన్నం చేసిందని శరద్ యాదవ్ అన్నారు.

పార్లమెంట్‌లో ప్రశ్నలకు ముడుపుల కేసు..

• మాజీ ఎంపీలపై అభియోగాల నమోదుకి కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 10: పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినందుకు ముడుపులు తీసుకున్న కేసులో చార్జిషీట్ దాఖలైన 11 మంది మాజీ ఎంపీలపై అవినీతి, నేరపూరిత కుట్ర అభియోగాల నమోదుకు ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2005లో ఈ అవినీతి కేసు వెలుగులోకి వచ్చాక ఆయా పార్టీలు వారిని బహిష్కరించాయి.

• సైగలతో జాతీయగీతం వీడియో

న్యూఢిల్లీ: బధిరుల కోసం జాతీయగీతాన్ని సైగలతో రూపొందించారు. 3.35 నిమిషాలున్న ఈ వీడియోను గోవింద్ నిహలానీ రూపొందించారు. ఇందులో సైగలతో జాతీయగీతాన్ని ఎర్రకోట బ్యాక్‌గ్రౌండ్‌లో దివ్యాంగులైన చిన్నారులతో కలిసి ప్రముఖ నటుడు అమితాబ్‌బచ్చన్ ఆలపించారు. ఈ వీడియోను కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే ఆవిష్కరించారు.

పెళ్లి ముచ్చట అలా తీరింది!

• జైల్లో దిగిన చాపర్.. పోలీసుల అదుపులో కుటుంబం

ఢాకా, ఆగస్టు 10: బంగ్లాదేశ్ నుంచి మలేషియా వెళ్లి స్థిరపడిన ఓ పెద్దమనిషికి బంధువుల పెళ్లికి రావాలంటూ స్వగ్రామం నుంచి ఆహ్వానం అందింది. దీంతో భార్యా పిల్లలతో వెళ్లడానికి ప్రైవేట్ హెలీకాప్టర్ బుక్ చేసుకున్నాడు. పెళ్లి జరిగే గ్రామంలో దించాల్సిన పైలట్ పొరబాటున అక్కడకు సమీపంలో ఉన్న కశింపూర్ సెంట్రల్ జైలు ఆవరణలో ల్యాండ్ చేశాడు. జరిగిన తప్పిదాన్ని గుర్తించిన పైలట్.. అందరూ కిందకు దిగగానే పోలీసులు అక్కడకు వచ్చేలోగా హెలికాప్టర్‌తో సహా ఎగిరిపోయాడు. మొత్తం ఐదురుగు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్న గార్డులు, విచారణ అనంతరం వదిలేయడంతో బతుకుజీవుడా అని వెళ్లిపోయారు.

చిన్నారి మెదడులో కణితి తొలగింపు

• చెన్నై అపోలోలో అరుదైన శస్త్రచికిత్స



చిన్నారితో డాక్టర్ బాలమురుగన్

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అరుదైన శస్త్రచికిత్స ద్వారా నాలుగేళ్ల బాలిక మెదడు నుంచి కణితిని తొలగించి చెన్నై అపోలో క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు కొత్త చరిత్ర సృష్టించారు. అసోంకు చెందిన మహిలాల్ నర్జరీ, లీలా దంపతుల కుమార్తె కోనికా నర్జరీ (4) మెదడులో కణితి కారణంగా తరచూ మూర్ఛపోతుండేది. రెండు నెలల కిందట బాలికను న్యూరో సర్జన్ డాక్టర్ బాలమురుగన్ నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందం పరీక్షించి.. ఆమె మెదడులో 20 గ్రాముల బరువున్న, టెన్నిస్ బంతి పరిమాణంలో కణితి ఉన్నట్లు గుర్తించింది. అనంతరం ఫ్లోరోసెన్స్ గైడెడ్ శస్త్రచికిత్స పద్ధతి ద్వారా కణితి తొలగించినట్లు డాక్టర్ బాలమురుగన్ తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో మెదడులో ఇలాంటి కణితి రావడం చాలా అరుదైన విషయమని.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకూ ఏడుగురు చిన్నారులకు మాత్రమే ఈ శస్త్రచికిత్స నిర్వహించారని పేర్కొన్నారు. ఈ విధానంలో ఆపరేషన్‌కు గంట ముందు తైలం లాంటి ద్రవాన్ని తలకు పూస్తారు. అది బాలిక మెదడులోని కణితిని స్పష్టంగా లేత పసుపురంగులో మెరిసేటట్టు చేస్తుందని.. 560 ఫిల్టర్‌ను ఉపయోగించి మెదడుకు హాని కలగకుండా కణితిని తొలగించామని వెల్లడించారు. అంతే కాకుండా బాలిక వయస్సు రీత్యా రేడియేషన్ థెరపీ సవాలుగా మారిందని, అయినా 30 రోజులపాటు రేడియేషన్ చికిత్సను విజయవంతంగా అందించామని చెప్పారు. ప్రస్తుతం ఆ బాలిక పూర్తిగా కోలుకుందని మురుగన్ వివరించారు.



సీఎం చంద్రబాబును కలిసిన కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు

నంద్యాలవాసి గుండె మార్పిడికి రూ. 15 లక్షల సాయం

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నంద్యాల పట్టణం అంబేద్కర్ నగర్‌కి చెందిన కిరణ్‌కుమార్ కష్టం..ముఖ్యమంత్రి చంద్రబాబుని కదిలించింది. గుండెజబ్బుతో బాధపడుతున్న ఆయనకు రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించారు. కిరణ్‌కుమార్ గత నాలుగు సంవత్సరాలుగా హృద్రోగంతో బాధపడుతున్నాడు. పుట్టపర్తిలోని సత్య సాయి సూపర్ స్పెషాలిటీస్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించారు. గుండె మార్పిడి చేస్తేనే బతుకుతాడని, అందుకు రూ.20 నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. లక్షల్లో ఖర్చు పెట్టుకునే స్తోమత లేదు. నంద్యాల నేత శిల్పామోహనరెడ్డి దగ్గరకు అనేక సార్లు వెళ్లివచ్చారు. "ఆయన అసలు పట్టించుకోలేదు" అని కిరణ్ తెలిపాడు. ఇంతలో ఉప ఎన్నిక రావడం, నంద్యాల ఇన్‌చార్జిగా అనంతపురం ఎమ్మెల్యే ప్రభాకర చౌదరి అక్కడకు వెళ్లడం జరిగింది. కిరణ్ పరిస్థితిని ప్రభాకరచౌదరి సానుకూలంగా అర్థం చేసుకొన్నారు. గురువారం కిరణ్ కుటుంబాన్ని వెంటబెట్టుకొని వెలగపూడి సచివాలయంలో సీఎంని ప్రభాకర్ కలిశారు. "నా బాధ విని సీఎం చలించిపోయారు. వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవాలని, ఖర్చు గురించి ఆలోచించవద్దు అని ధైర్యం చెప్పారు. అప్పటికప్పుడే రూ.15 లక్షలు మంజూరు చేశారు" అని కిరణ్ మీడియాకు తెలిపారు. తన బిడ్డ బతుకుతాడో లేదోనని బెంగపెట్టుకొన్న తల్లి రాజమ్మ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపింది.

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవ బాంబు దాడి కేసు కొట్టివేత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల క్రితం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవ బాంబు దాడి కేసును కోర్టు కొట్టివేసింది. ఈ కేసులోని 10 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ గురువారం నాంపల్లి మెట్రోపాలిటన్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నిందితులపై మోపిన నేరారోపణలను నిరూపించడంలో సిట్ పూర్తిగా విఫలమైందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 2005 అక్టోబరు 12వ తేదీ దసరా పండుగ రోజు బంగ్లాదేశ్ ఉగ్రవాది దలాన్ మానవ బాంబుగా మారి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో విధ్వంసం సృష్టించాడు. ఈ దాడిలో దలాన్‌తోపాటు హోంగార్డు సత్యనారాయణ మరణించారు. సిట్ సారథ్యంలో దర్యాప్తు చేపట్టిన అధికారులు బంగ్లాదేశ్, కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన 20 మందిని నిందితులుగా గుర్తించారు. 2005లో జరిగిన ఘటనపై 2010లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం నాంపల్లి న్యాయస్థానం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు నిందితులను కోర్టు ఎదుట హాజరుపరిచారు. మధ్యాహ్నం కోర్టు తీర్పుతో ఉత్కంఠకు తెరపడింది. కేసును కోర్టు కొట్టివేసినట్లు తెలియగానే బయట వున్న నిందితుల బంధువులు మిఠాయిలు పంచుకున్నారు. బాంబు పేలుడు కేసులో ఆధారాలు సరిగానే ఉన్నాయని సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి అన్నారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుని పై కోర్టుకు అప్పీల్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతామని చెప్పారు.



జగన్, పీకేల దుష్ప్రచారంపై టీడీపీ నిరసన

విశాఖట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా వైసీపీ వ్యూహకర్త ప్రశాంత కిశోర్, ముఖ్యమంత్రి చంద్రబాబుపై దుష్ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ టీడీపీ విశాఖ అర్బన్ నేతలు గురువారం ఇక్కడ ర్యాలీ జరిపారు. సోషల్ మీడియాకు సంబంధించి లోగోలను నోటికి కట్టుకుని, పార్టీ కార్యాలయం నుంచి గాంధీజీ విగ్రహం వరకు మౌన ప్రదర్శన చేశారు. ఉత్తరాది ప్రజలను సోషల్ మీడియా ద్వారా మోసం చేసిన ప్రశాంత కిశోర్‌ను తెలుగు ప్రజలు నమ్మరని నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వ్యాఖ్యానించారు.

జగన్ కుసంస్కారి!

- ఓటమి భయంతోనే అనుచిత వ్యాఖ్యలు: ఉమ
- సీఎంపై కుట్ర.. ఆయనకు ప్రాణహాని: సోమిరెడ్డి
- ఆయనతో అరాచకమే: ఆనంద్‌బాబు
- దిగజారుడుతనానికి నిదర్శనం: అఖిల
- కార్యకర్తలతో కలిసి మంత్రుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై మంత్రులు, టీడీపీ నేతలు భగ్గుమన్నారు. జగన్ కుసంస్కారి అని ఓటమి భయంతోనే నోటికొచ్చింది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత జగన్ వ్యాఖ్యలు చూస్తుంటే సీఎం చంద్రబాబు ప్రాణాలకు హాని కలిగించే కుట్ర జరుగుతోందన్న అనుమానాలు కలుగుతున్నాయని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నంద్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాక్షాత్తు రాష్ట్ర సీఎంను ఉద్దేశించి జగన్ బెదిరింపు ధోరణితో మాట్లాడుతుంటే ఎన్నికల సంఘం, పోలీసులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జగన్‌కు ఏమైనా ప్రత్యేక చట్టాలు ఉన్నాయా అని సోమిరెడ్డి ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించిన స్కీంలు జగన్‌కు తెలియవని, లక్షల కోట్లు దండుకొనే స్కామ్‌లే ఆయనకు తెలుసని మంత్రి ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. కర్నూలు జిల్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత్ కిషోర్ ఇచ్చిన స్క్రిప్టును బహిరంగ సభల్లో చదువుతూ స్క్రిప్టును మర్చిపోయినప్పుడల్లా ఏం మాట్లాడాలో తెలియక కాల్చేయాలి.. ఉరిశిక్ష వేయాలని పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. జగన్‌లాంటి నేతలు రాజకీయాల్లో ఉంటే రాష్ట్రంలో అశాంతి, అరాచకాలు రాజ్యమేలుతాయని మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. ఎన్నికల కమిషన్ తక్షణం స్పందించి జగన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తండ్రి వయసున్న సీఎంని కాల్చిపారేయాలని, ఉరితీయాలని జగన్ వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. జగన్ కుసంస్కారి అని మంత్రి దేవినేని ఉమ విమర్శించారు. విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నంద్యాలలో ఓడిపోతామనే అభద్రతా భావంతోనే జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటుతో జగన్‌కు ఉరివేయాలని వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ కోటేశ్వరరావు నంద్యాల ప్రజలకు పిలుపునిచ్చారు.



నంద్యాలలో కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించిన మంత్రి అఖిలప్రియ

జగన్‌పై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు

కర్నూలు జిల్లా గోస్పాడు మండలం పసురుపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రులు ఆదినారాయణ రెడ్డి, నక్కా ఆనంద్ బాబు, అఖిలప్రియ కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. అఖిల ప్రియ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జగన్ దిష్టిబొమ్మను స్థానిక టీడీపీ నేతలు దహనం చేశారు. అనంతరం జగన్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. జగన్ వ్యాఖ్యలపై నెల్లూరు టీడీపీ నేతలు వినూత్న నిరసన చేపట్టారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఓ వ్యక్తికి జగన్ వేషం వేయించి, అతని చేతిలో తుపాకీ పెట్టి మెడలో 'అందరినీ కాల్చేస్తా' అన్న ప్లకార్డును వేలాడదీశారు. టీడీపీ నేతలు జగన్ వేషధారిని టమోటాలతో కొడుతూ నగరంలో ఊరేగించారు. విశాఖపట్టణంలో సోషల్ మీడియా లోగోలను నోటికి కట్టుకొని టీడీపీ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తూ జగన్ రాజకీయ సలహాదారు ప్రశాంత్ కిషోర్ తెలుగు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టీడీపీ నేతలు విమర్శించారు.

బాబుకు ఉరిశిక్ష వేసినా తప్పులేదు

(మూడవ పేజీ తరువాయి)

క్రితం నంద్యాల ప్రచార సభలో సీఎం చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చిచంపినా తప్పులేదన్నందుకు ఎన్నికల కమిషన్ నుంచి షోకాజ్ నోటీసు అందుకున్న ఆయన... దానికి వివరణ ఇచ్చి రెండ్రోజులు గడిచాయో లేదో మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం నంద్యాల మండలం సాబోలు, గోస్పాడు మండలం సాంబవరం, దీబగుంట్ల, కానాలపల్లె, కె.నాగులవరం, నెహ్రూ నగర్, సత్యనారాయణపురం, జిల్లెల్ల, అయ్యలూరు, పెద్దకొట్టాల తదితర గ్రామాల్లో జగన్ రోడ్‌షోలో ప్రసంగించారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, ఇలాంటి సీఎంను ఏం చేయాలని ప్రశ్నించారు. డబ్బుందని ఎవరినైనా కొనుగోలు చేయవచ్చన్న అహంకారంతో చంద్రబాబుకు కళ్లు నెత్తికొచ్చాయని ధ్వజమెత్తారు. ఉప ఎన్నిక రాగానే మళ్లీ టేప్ రికార్డర్ ఆన్ చేసి అవే హామీలు గుప్పిస్తున్నారని విమర్శించారు.

ఓటర్ల కొనుగోలుకు డబ్బు మూటలు..

ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినట్లు ఓటర్లను కొనుగోలు చేసేందుకు డబ్బుల మూటలతో వస్తారని జగన్ అన్నారు. ఎన్నికలు రాగానే సీఎంకు కుట్టుమిషన్లు, ట్రాక్టర్ల పంపిణీ గుర్తుకొచ్చాయని ఎద్దేవాచేశారు. ఇసుక నుంచి మద్యం దాకా, రాజధాని భూముల నుంచి గుడి భూముల వరకు దేన్నీ వదలకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి హామీ ఇచ్చి పట్టించుకోలేదన్నారు. న్యాయం-అన్యాయం, ధర్మం-అధర్మం మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ధర్మం వైపు నిలబడాలని, వేసే ప్రతి ఓటూ జగన్‌కు వేస్తున్నామని గుర్తుంచుకోవాలని ప్రజలను కోరారు. చంద్రబాబులా డబ్బులు, పోలీసు బలం తనకు లేవని.. లేనిది ఉన్నట్లు రాసే టీవీలు, మీడియా, పత్రికలు వంటివి కూడా తనకు లేవన్నారు. తనకు నాన్న ఇచ్చిన ఆస్తి ఈ పెద్ద కుటుంబమేనన్నారు. నంద్యాలలో సామాజిక వర్గాలను బుజ్జగించడం, కొనుగోలు చేయడం,వినకపోతే బెదిరించడం వంటి వాటికి పాలక పక్ష నేతలు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ నాయకుల నుంచి గల్లీ స్థాయి నాయకుల వరకు కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారన్నారు.

శిక్షణ లేకుంటే బోధనకు అనర్హులు

- డీఎడ్ ఉన్నవారే అర్హులు
- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ స్కూళ్లలో బోధించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా డీఎడ్ చేసి ఉండాలని, లేదంటే వారు బోధనకు అనర్హులుగా ప్రకటించాలని రాష్ట్రాలకు అదేశం జారీ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ స్కూళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎంత మంది టీచర్లు పనిచేస్తున్నారు? వారి విద్యార్హతల వివరాలను మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 15లోగా పొందుపర్చాలని రాష్ట్రాలకు గడువు విధించింది. అయితే కేంద్రం ఆదేశాల మేరకు ఇప్పటికే వివరాలు సేకరించిన రాష్ట్ర విద్యాశాఖ ఏ స్కూల్‌లో ఎంతమంది ట్రైన్డ్, అన్ ట్రైన్డ్ టీచర్లు ఉన్నారనే లెక్కలు తేల్చింది. ఈ లెక్కల ప్రకారం.. ప్రైవేటు స్కూళ్లల్లో 30 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఈ లెక్కన గదికి ఒక టీచర్ చొప్పున ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు టీచర్లను నియమిస్తాయి. కానీ కేవలం 92,675 మంది మాత్రమే ఉన్నట్లు చూపిస్తుండటం, మిగతా 60 వేల మంది టీచర్లు కేవలం టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన వారితోనే బోధన చేయిస్తున్నట్టు స్పష్టమవుతోంది. దాంతో నాణ్యమైన విద్య అందడం గగనమవుతోంది. అయితే అన్ ట్రైన్డ్‌గా ఉండి ప్రస్తుతం టీచర్‌గా పనిచేస్తున్న వారికి కేంద్రం చివరి అవకాశం ఇచ్చింది. 2017 సెప్టెంబరు 15లోగా డీఎడ్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలనే షరతు విధించింది. దాంతోపాటు ఇంటర్‌లో 50% మార్కులు తప్పనిసరిగా సాధించి ఉండాలని స్పష్టం చేసింది. కాగా, ఇప్పటికే డీఎడ్ కోర్సులు పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇచ్చారు. వీరికి ఇంటర్‌లో 50% మార్కులు లేకున్నా సరిపోతుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, విద్యా హక్కు చట్టం ప్రకారం.. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు బోధించాలంటే టెట్ పేపర్-1 అర్హత సాధించి ఉండాలనే నిబంధన విధించారు. అయితే ప్రైవేటు స్కూళ్లలో దీన్ని అమలు చేయటం లేదు. టెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులతో బోధన చేయించటం వల్ల నాణ్యమైన విద్యను అందించవచ్చని చెబుతున్న విద్యాశాఖ.. ప్రైవేటు స్కూళ్లలో టెట్‌ను తప్పనిసరి చేయటంలో విఫలం అవుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతా సిద్ధం!

- నంద్యాలలో ఏర్పాట్లు పూర్తి
- బరిలో 15 మంది.. 255 పోలింగ్ స్టేషన్లు: భన్వర్‌లాల్

హైదరాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఉప ఎన్నికకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ తెలిపారు. ఉప ఎన్నికకు సంబంధించిన సమాచారాన్ని గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. ఉప ఎన్నికలో 15 మంది పోటీ చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ నెల 23న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. 28న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నిక కోసం 255 పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, గతంలోకంటే ఈ సారి 17 పోలింగ్ సెంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల 5వ తేదీ వరకూ ఓటరుగా నమోదు చేసుకున్నవారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని, మొత్తం 2,19,108 ఓటర్లు ఉన్నారని భన్వర్‌లాల్ చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా నిఘా ఉంటుందని, ప్రతి ఓటరు పోలింగ్ స్టేషన్‌కు వచ్చిన వెంటనే ఫొటో తీస్తామన్నారు. 55 పోలింగ్ స్టేషన్లలో లైవ్ వెబ్ కాస్టింగ్‌తోపాటు అన్ని పోలింగ్ స్టేషన్లలో వీడియోగ్రాఫీ తీస్తామన్నారు. 173 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు భన్వర్‌లాల్ చెప్పారు. జిల్లాలో 63 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా సరిహద్దుల వెంటకూడా పెద్దమొత్తంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు భన్వర్‌లాల్ చెప్పారు. 8 కంపెనీల కేంద్ర బలగాలు పంపాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఓటరు తన పోలింగ్ స్టేషన్ ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు ఏపీ స్పేస్ ఓటు స్పేస్ ఓటరు ఐడీ నెంబరును 9223166166 ఫోన్ నెంబరుకు ఎస్ఎంఎస్ పంపితే ఓటు హక్కు ఏ పోలింగ్ స్టేషన్‌లో వినియోగించుకోవాలనే సమాచారం తిరిగి ఎస్ఎంఎస్ రూపంలో ఓటరుకు పంపుతామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా అక్రమాలు, నగదు పంపిణీ వంటి అంశాలపై ఫిర్యాదు చేసేందుకు ఇదే నంబరుకు ఏపీ స్పేస్ ఎంసీసీ స్పేస్ కంప్లైంట్ రాసి ఎస్ఎంఎస్ పంపించాలని భన్వర్‌లాల్ సూచించారు. ఫిర్యాదులకు సంబంధించి వచ్చే ఎస్ఎంఎస్‌ల వివరాల్ని పూర్తి గోప్యంగా ఉంచుతామన్నారు.



జగన్ సంజాయిషీ అందింది

సీఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి జగన్ సంజాయిషీ అందిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ సంజాయిషీపై నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరామని, కలెక్టర్ నుంచి నివేదిక అందిన తర్వాత కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తామన్నారు. ఉప ఎన్నికకు సంబంధించి ఇప్పటి వరకూ 44 కేసులు నమోదు చేయడంతోపాటు రూ.11 లక్షలు సీజ్ చేసినట్లు వెల్లడించారు. కొందరు మంత్రులపైనా ఫిర్యాదులు అందాయని, అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. హుందాగా వ్యవహరించాలని అభ్యర్థులకు భన్వర్‌లాల్ సూచించారు.

నంద్యాల ఫలితం తర్వాతే చక్రపాణిరెడ్డి రాజీనామాపై నిర్ణయం?

అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి శాసనమండలి సభ్యత్వానికి చేసిన రాజీనామాను ఆమోదిస్తారా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన కర్నూలు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఇటీవల గెలిచారు. తన సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి టీడీపీని వదిలి వైసీపీలో చేరడంతో చక్రపాణిరెడ్డి కూడా అదే పార్టీలో చేరారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా మండలికి పంపారు. ఆ తర్వాత తన తరపున శాసనసభ కార్యదర్శికి లేఖ పంపించారు. దీనిపై మండలి ఛైర్మన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మండలికి ఛైర్మన్ లేరు. డిప్యూటీ ఛైర్మన్‌గా రెడ్డి సుబ్రమణ్యం ఉన్నారు. ఆయన ప్రస్తుతం తిరుమలలో ఉన్నారు. కొద్ది రోజుల్లో విజయవాడ వస్తారని, అప్పుడు నిర్ణయం తీసుకుంటారని శాసన మండలి వర్గాలు అంటున్నాయి. రాజీనామా చేసిందీ లేనిదీ చక్రపాణిరెడ్డిని పిలిపించి మాట్లాడడం లేదా ఫోన్‌లో మాట్లాడి నిర్ధారించుకోవలసి ఉంటుంది. నంద్యాల ఎన్నికలు ముగిశాక ఈ ప్రక్రియ చేపడతారా.. లేక ఈ లోపే జరుగుతుందా అన్నది వేచి చూడాలి. నంద్యాల ఉప ఎన్నికలో తన అన్నకు సానుకూలంగా లేకపోతే.. చక్రపాణి తన రాజీనామాపై పట్టు బట్టకపోవచ్చని, అందువల్ల వేచిచూస్తే మంచిదని కొందరు టీడీపీ నేతలు అంటున్నారు. ఒకసారి పార్టీని వీడుతున్నానని ప్రకటించాక.. ఎదురుచూడాల్సిన పనిలేదని, రాజీనామా ఆమోద ప్రక్రియను పూర్తి చేయడం మంచిదని మరికొందరు సూచిస్తున్నారు. కొద్ది రోజుల్లో దీనిపై స్పష్టత రావచ్చని అంటున్నారు.



వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

ఉపాధి పెండింగ్ నిధులివ్వండి

- గ్రామీణ రోడ్లకు 3185 కోట్లు కావాలి
- రాష్ట్రం ఖర్చుచేసిన మొత్తం తిరిగివ్వండి
- కేంద్ర మంత్రి తోమర్‌కు లోకేశ్ వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను విడుదల చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో తోమర్‌ను, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అమర్‌జిత్ సిన్హా, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి జితేంద్ర శంకర్ మాథుర్‌లను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. '2017-18 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి జూన్ నెలకు సంబంధించి రూ.560 కోట్లు నిధులు రాష్ట్రానికి రావలసి ఉంది. 2016-17లో కేంద్రం నిధులు విడుదల చేయనందున రాష్ట్ర ఖజానా నుంచి రూ.1300 కోట్లు ఖర్చు చేశాం. వాటిని కూడా తిరిగివ్వాలి. 4772 ఆవాసాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించడానికి రూ.3185 కోట్లు ఇవ్వండి' అని అభ్యర్థించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు కేంద్రం నుంచి రావాల్సిన రెండో విడత నిధులు రూ.165 కోట్లు త్వరగా విడుదల చేయాలని, సిమెంట్ రోడ్లకు నిధులు, జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా పథకం, సోలార్ ఆధారిత నీటి పథకం, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ... తన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి వారం రోజుల్లో రూ. 1300 కోట్లు విడుదల చేస్తామని, జూన్ నెల బకాయిలను 24 గంటల్లో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. కాగా.. రాష్ట్ర మంత్రి అయ్యాక లోకేశ్ మొదటిసారి పార్లమెంటు సముదాయానికి వచ్చారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఎంపీలు సీఎం రమేశ్, కొనకళ్ల నారాయణ, మాగంటి బాబు, మాల్యాద్రి శ్రీరామ్, నిమ్మల కిష్టప్ప, కేశినేని నాని, రామ్మోహన్‌నాయుడు తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంటు భవనంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

మహోన్నత వ్యక్తి వెంకయ్య

ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించనున్న వెంకయ్యనాయుడిని లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి తిరుమల వెంకన్న ప్రసాదాన్ని అందజేశారు. దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి వెంకయ్యనాయుడని, ఆయన ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడం ఏపీకి గర్వకారణమని లోకేశ్ అన్నారు. వెంకయ్యను కలిసినవారిలో టీడీపీ ఎంపీలు సీఎం రమేశ్, మాగంటి బాబు, అవంతి శ్రీనివాసరావు, జేసీ దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గాలి శ్రీనివాసులనాయుడు, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ కూడా ఉన్నారు.

నడవలేకపోతే ఉద్యమం వదిలేస్తా..

- నడిస్తే సీఎం రాజీనామా చేయాలి
- చంద్రబాబుకు ముద్రగడ మరో సవాల్

కిర్లంపూడి/ప్రత్తిపాడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 'చలో అమరావతి పాదయాత్రలో తాను నడవలేకపోతే కాపు ఉద్యమాన్ని వదిలివేసుకుంటా.. నడిస్తే సీఎం పదవికి చంద్రబాబు రాజీనామా చేయాలి' అని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సవాల్ విసిరారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన స్వగృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాపులను బీసీల్లో చేరుస్తామని ఇచ్చిన హామీలను సీఎం అమలుచేయాలని లేనిపక్షంలో తన పాదయాత్రకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ఇమేజ్, మైలేజ్‌లు పెంచుకోవడం కోసం ఉద్యమం చేయడం లేదని కేవలం జాతి ప్రయోజనాల కోసమే చేస్తున్నామని చెప్పారు. తుని ఘటనను భూతద్దంలో చూపిస్తూ పాదయాత్రకు ఆటంకాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని మార్లు అడ్డుకున్నా పాదయాత్రను ఆపబోమని, రద్దు చేయబోమని, వాయిదా వేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఎప్పుడు తమను వదిలివేస్తే అప్పుడు పాదయాత్ర కొనసాగిస్తామన్నారు. కాగా, వాసిరెడ్డి ఏసుదాసు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కాపు జేఏసీ సమావేశంలో ముద్రగడ మాట్లాడుతూ కీలకదశకు చేరుకున్న కాపు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సూచించారు. కాపుల ఆకలి మంటల సెగ ముఖ్యమంత్రికి తగిలేవిధంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో మహిళలను భాగస్వాములను చేయాలని చెప్పారు. కాపు నాయకుల ఫోన్లపై నిఘా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటి ఆవరణలో కాపు జేఏసీ సమావేశం

ఈ వివక్షకు అంతే లేదా ?

క్రికెటర్ అభినవ్ ముకుంద్ ఆవేదన


న్యూఢిల్లీ : సెలెబ్రిటీలను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో కొందరు అవాకులు చవాకులు పేలడం పరిపాటైంది. ఈ మీడియా బాధితుల్లో టీమిండియా టెస్ట్ ఓపెనర్ అభినవ్ ముకుంద్ కూడా ఒకడు. ఈ విషయాన్ని అతడు స్వయంగా, ఓ సుదీర్ఘ లేఖ ద్వారా ట్విట్టర్‌లో వెల్లడించాడు. తన శరీర ఛాయను కించపరుస్తూ మాట్లాడడంపై ఆవేదన చెందాడు. అయితే తన ఈ లేఖకు భారత జట్టులోని ఏ క్రికెటర్‌కూ సంబంధంలేదని స్పష్టంజేశాడు. ప్రస్తుతం టీమిండియాతో శ్రీలంకలో పర్యటిస్తున్న ఈ తమిళనాడు ఎడమచేతి బ్యాట్స్‌మన్..తొలి టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. రెండో ఇన్నింగ్స్‌లో అతడు 81 పరుగులతో సత్తా చాటాడు. 'అభిమానుల సానుభూతి పొందేందుకో లేదా ప్రజల దృష్టిని నావైపు తిప్పుకొనేందుకో ఈ లేఖ రాయడంలేదు. ప్రజల ఆలోచనా తీరు మారుతుందన్న ఆశాభావంతోనే రాస్తున్నా. 15 ఏళ్ల ప్రాయంనుంచే నేను దేశంలో, వెలుపలా విస్తారంగా పర్యటిస్తున్నా. అయితే అప్పటినుంచీ నా శరీర వర్ణాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు వెల్లువెత్తుతుండడం ఇప్పటికీ అంతుబట్టకుండా ఉంది. ఎన్నాళ్లీ వివక్ష' అని ఆ లేఖలో ముకుంద్ వాపోయాడు. 'దేశంలోనే అత్యంత వేడిమి ప్రాంతమైన చెన్నై నుంచి నేను వచ్చాను. యుక్త వయస్సులో ఎక్కువ భాగం క్రికెట్ గ్రౌండ్‌లో గడిపాను' అని వివరించాడు. 'నాకు పెద్ద లక్ష్యాలుండడంతో ఆ వ్యాఖ్యలను భరించాను. యుక్త వయస్సులో ఒక్కోసారి బాధపడినా..ఆ తర్వాత రాటుదేలిపోయాను. ఆ కువిమర్శలు నా కెరీర్‌కు అడ్డు



కాలేకపోయాయి' అని ముకుంద్ స్పష్టంజేశాడు. 'ఆ అవాకులు చవాకులకు బదులిచ్చి నా స్థాయిని దిగజార్చుకోదలుచుకోలేదు. ఇప్పుడు కూడా ఈ లేఖను నాకోసం రాయడంలేదు. దేశంలో చాలామంది నాలాగానే అవమానాలు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలిపేందుకే రాస్తున్నా. సోషల్ మీడియా ప్రవేశంతో ఈ విమర్శలకు హద్దులు లేకుండా పోయింది' అని ఆవేదన చెందాడు. 'మిసమిసలాడే దేహఛాయ కలిగిన వారే అందమైన వారు కాదు మిత్రులారా. నిజాయతీగా ఉండండి. మీ శరీర రంగుతో మీరు సంతృప్తి చెందుతున్నారా లేదా అన్నదే ముఖ్యం' అని హితవు పలుకుతూ ముకుంద్ తన లేఖ ముగించాడు. అయితే తన ఈ వేదనను రాజకీయం చేయవద్దని కోరాడు.

అపూర్వ మద్దతు: ముకుంద్ ఉద్వేగభరిత లేఖకు సహచరులు కోహ్లీ, అశ్విన్, హార్దిక్ పాండ్యా, మనోజ్ తివారీలతోపాటు అభిమానుల నుంచి అపూర్వ మద్దతు లభించింది.

తలైవాస్ బోణీ



నాగ్‌పూర్: ప్రొ కబడ్డీ లీగ్ అయిదో అంచెలో కొత్త జట్టు తమిళ్ తలైవాస్ బోణీ కొట్టింది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో 29-24 స్కోరుతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. ప్రపంజన్ ఆరు పాయింట్లు సాధించగా, వినీత్ కుమార్ (4), అమిత్ హుడా (4) రాణించారు. బెంగళూరు జట్టులో రోహిత్ కుమార్ (12) సత్తా చాటినా జట్టును విజయపథాన నిలపలేకపోయాడు. అంతకుముందు హోరాహోరీగా జరిగిన తొలి మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 30-28 స్కోరుతో పుణెరి పల్టన్‌ను చిత్తు చేసింది. కాగా లీగ్ రెండో దశ ముగిసింది. మూడో దశ శుక్రవారం అహ్మదాబాద్‌లో ప్రారంభమవుతుంది. రెండో దశ ముగిసే సరికి జోన్ ఏలో పుణె (11), ముంబై (10) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. జోన్ బీలో బెంగళూరు (20), పట్నా (15) మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. తెలుగు టైటాన్స్ 11 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. మంజిత్ చిల్లార్ తొమ్మిది పాయింట్లతో జైపూర్ జట్టును విజయపథంలో నడిపాడు. తుషార్ పటేల్, దీపక్ హుడా తొలి రైడ్‌లలోనే పాయింట్లు రాబట్టడంతో ఆరంభంలోనే ఇరు జట్లూ ఖాతా తెరిచాయి. కానీ డిఫెండర్లు వరుసగా టాకిల్ పాయింట్లు రాబట్టడంతో పుణె తొలుత 3-1కి అనంతరం 5-2 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. ఈ దశలో తుషార్ పాటిల్ తన రెండో పాయింట్ సాధించడంతో జైపూర్ పింక్ పాంథర్స్ ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తొమ్మిదో నిమిషంలో రోహిత్ కుమార్‌కు అంపైర్ గ్రీన్‌కార్డ్ చూపగా అప్పటికి జైపూర్ 6-6తో స్కోరు సమం చేయగలిగింది. ఆపై పుంజుకున్న పుణె 13వ నిమిషానికి 9-6 ఆధిక్యం ప్రదర్శించడంతో ఇక విజయం ఆ జట్టుదేనని అంతా అంచనా వేశారు. సరిగ్గా ఈ దశలో సత్తాచాటిన జైపూర్..9-9తో సమవుజ్జీగా నిలిచింది. ఇక పుణె మరింతగా పుంజుకొని మ్యాచ్‌ను సొంతం చేసుకోవడం ఖాయమని అంతా భావించగా..జైపూర్ ఒక్కసారిగా జూలు విదిల్చింది. వరుసగా పాయింట్లు రాబట్టి విజయంతో మ్యాచ్‌ను ముగించింది.

అశ్విన్, జడేజాకు విశ్రాంతి!

- మేనేజ్‌మెంట్ ఆలోచన
- 13న వన్డే టీమ్ ఎంపిక

కాండీ: శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారత బౌలింగ్ భారాన్ని మోస్తున్న స్పిన్నర్లు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలకు వన్డే సిరీస్‌కు విశ్రాంతి కల్పించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈనెల 20 మొదలయ్యే వన్డే సిరీస్‌కు పేసర్ మహ్మద్ షమికి కూడా రెస్ట్ ఇవ్వాలనే యోచనలో టీమిండియా ఉంది. టెస్ట్ సిరీస్ అనంతరం భారత్ ఆతిథ్య శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్ ఆడాల్సి ఉంది. అయితే ఈ వన్డేల కోసం ఈనెల 13న భారత జట్టును ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం కాండీలో ఉన్న చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ఇతర సభ్యులు దేవాంగ్ గాంధీ, శరణ్‌దీప్ సింగ్‌తో కలిసి ఆదివారం టీమ్‌ను ప్రకటించనున్నాడు. శ్రీలంకతో తొలి రెండు టెస్టుల్లో అశ్విన్ 108.3, జడేజా 108.2 ఓవర్లు బౌలింగ్ చేశారు. అశ్విన్ 13 వికెట్లు, జడేజా 11 వికెట్లు పడగొట్టారు. అయితే డీ మెరిట్ పాయింట్ల కారణంగా ఒక టెస్టు నిషేధానికి గురైన జడేజా శనివారం మొదలయ్యే మూడో మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో అశ్విన్‌పైనే భారం పడనుంది. ఈ నేపథ్యంలో ఇద్దరు ప్రధాన స్పిన్నర్లకు విశ్రాంతి అవసరమని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. దీంతో యువ స్పిన్నర్లు అక్షర్ పటేల్, యజ్వేంద్ర చాహల్, క్రునాల్ పాండ్యాలకు వన్డేలకు చాన్స్ లభించవచ్చు. షమికి విశ్రాంతి ఇవ్వనున్న నేపథ్యంలో యార్కర్ల స్పెషలిస్ట్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా వన్డే జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే గత కొంతకాలంగా అలుపెరగని క్రికెట్ ఆడుతున్న కెప్టెన్ విరాట్ కోహ్లీ విశ్రాంతి కోరుకోవడం లేదు.

చమీర, గమగెలకు పిలుపు

భారత్‌తో మూడో టెస్టుకు లంక జట్టు ప్రకటన

కాండీ: గాయాల కారణంగా భారత్‌తో మూడో టెస్టుకు దూరమైన స్పిన్నర్ రంగన హెరాత్, పేసర్ నువాన్ ప్రదీప్‌ల స్థానంలో పేసర్లు దుష్మంత చమీర, లహిరు గమగెలను శ్రీలంక జట్టులోకి తీసుకుంది. కాగా.. పేలవ ప్రదర్శన చేస్తున్న దనుష్క గుణతిలకను జట్టు నుంచి తప్పించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో శనివారం మొదలయ్యే ఆఖరి టెస్టుకు శ్రీలంక జట్టులో ఈ మూడు మార్పులు చోటుచేసుకున్నాయి. చమీర, గమగె ఎంపికతో లంక జట్టులో పేసర్ల సంఖ్య నాలుగుకి చేరింది.

శ్రీలంక జట్టు వివరాలు: చాందిమల్ (కెప్టెన్), తరంగ, కరుణరత్నె, కుశాల్ మెండిస్, మాథ్యూస్, తిరిమన్నె, ధనంజయ డిసిల్వ, డిక్‌వెలా (వికెట్‌కీపర్), దిల్‌రువాన్ పెరీర, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, చమీర, గమగె, సండకన్, పుష్పకుమార.



ఫిలిస్ ఫ్రాన్సిస్

ఫ్రాన్సిస్ కేక..

- మహిళల 400 మీ.లో స్వర్ణం
- కాంస్యంతో నిరాశపర్చిన ఫెలిక్స్
- 400 మీ. హర్డిల్స్ విజేత వార్‌హోమ్
- ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్

ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో సంచలనాల పర్వం కొనసాగుతూనే ఉంది. మహిళల 400 మీటర్ల రేసులో టైటిల్ ఫేవరెట్ అలీసన్ ఫెలిక్స్, ఒలింపిక్ విజేత మిల్లర్‌లకు షాకిస్తూ.. అమెరికా రన్నర్ ఫిలిస్ ఫ్రాన్సిస్ టైటిల్ సాధించింది. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లోనూ డిఫెండింగ్ చాంప్ క్లెమెంట్‌కు షాక్ తగిలింది. మహిళల షాట్‌పుట్‌లో చైనా స్టార్ గాంగ్ పసిడి అందుకుంది. కాగా.. పురుషుల 5000 మీటర్ల రేసులో భారత ఏకైక ఆశాకిరణం లక్ష్మణన్ గోవిందన్ 15వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

లండన్: మహిళల 400 మీటర్ల రేసులో సంచలనం నమోదైంది. అమెరికాకు చెందిన ఫిలిస్ ఫ్రాన్సిస్ ఈ విభాగంలో సరికొత్త చాంపియన్‌గా అవతరించింది. బుధవారం రాత్రి ఇక్కడ జరిగిన ఫైనల్లో ఒలింపిక్ చాంపియన్ షాన్ మిల్లర్, టైటిల్ ఫేవరెట్, డిఫెండింగ్ చాంపియన్ అలీసన్ ఫెలిక్స్‌లను వెనక్కునెట్టిన 25 ఏళ్ల ఫిలిస్ ఫ్రాన్సిస్ 49.92 సెకన్ల టైమింగ్‌తో వ్యక్తిగత బెస్ట్ నమోదు చేస్తూ.. స్వర్ణం కొల్లగొట్టింది. హీట్స్‌లో ఫాస్టెస్ట్ టైమ్ నమోదు చేసిన బహ్రెయిన్ సంచలనం సాల్వా ఇద్ నాసెర్ (50.06) రజతం సాధించింది. అయితే ఈ రేసులో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అలీసన్ ఫెలిక్స్ (అమెరికా) మూడో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. కాగా.. గతేడాది రియో ఒలింపిక్స్‌లో ఫినిషింగ్ లైన్‌పైకి అమాంతం దూకేసి స్వర్ణం ఎగరేసుకుపోయిన మిల్లర్ (బహామస్) రేస్ ఆసాంతం స్పష్టమైన ఆధిక్యం కనబర్చినప్పటికీ.. చివరి 20 మీటర్లలో ఎడమకాలి కండరాలు పట్టేయడంతో తడబడింది. ఇదే సమయంలో అసాధారణంగా పుంజుకున్న ఫ్రాన్సిస్ తొలుత ఫెలిక్స్, ఆపై మిల్లర్‌ను వెనక్కునెట్టేసి చాంపియన్‌గా నిలిచింది. మిల్లర్ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. కాగా.. ఈ రేసులో ముగ్గురు జమైకా అథ్లెట్లు పోటీపడినప్పటికీ ఒక్కరు కూడా టాప్-4 లో చోటు దక్కించుకోలేకపోయారు.



వార్‌హోమ్

వార్‌హోమ్ సంచలనం

పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్, రియో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కెరోన్ క్లెమెంట్‌కు ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్స్‌లో మూడోసారి 400 మీటర్ల హర్డిల్స్ స్వర్ణం సాధించాలని చూసిన క్లెమెంట్‌కు నార్వే సంచలనం కార్‌స్టెన్ వార్‌హోమ్ చెక్‌పెట్టాడు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో వార్‌హోమ్ 48.35 సెకన్ల టైమింగ్‌తో రేసును పూర్తి చేసి గోల్డ్ అందుకున్నాడు. టర్కీకి చెందిన యస్మాని కాపెలో (48.49) రజతం సాధించగా.. టైటిల్ ఫేవరెట్ క్లెమెంట్ (48.52) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

షాట్‌పుట్‌లో గాంగ్‌కు స్వర్ణం

మహిళల షాట్‌పుట్‌లో చైనా అమ్మాయి లిజియావో గాంగ్ స్వర్ణం సాధించింది. ఫైనల్లో గాంగ్ తన ఐదో ప్రయత్నంలో గుండును 19.94 మీటర్లు విసిరి స్వర్ణం చేజిక్కించుకుంది. హంగేరీకి చెందిన అనిటా మార్టన్ ఆఖరిదైన ఆరో ప్రయత్నంలో 19.49 మీటర్లు విసిరి రజతం అందుకోగా.. మిచెలీ కార్టర్ (అమెరికా) 19.14 మీ.తో కాంస్యం సాధించింది. ఈ పోరులో చైనా అథ్లెట్ గాంగ్‌కు ఎవరూ పెద్దగా పోటీఇవ్వలేదు.



లిజియావో గాంగ్

మరో స్వర్ణం వేటలో ఫరా

బ్రిటన్ దిగ్గజ అథ్లెట్ మో ఫరా వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో 11వ స్వర్ణంపై గురిపెట్టాడు. పోటీల ఆరంభంలో 10 వేల మీటర్ల పరుగులో విజయంతో ఈ మెగా ఈవెంట్‌లో పదో స్వర్ణం సాధించిన ఫరా.. 5 వేల మీటర్ల పరుగులోనూ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. 5 వేల మీటర్ల తొలి హీట్స్‌లో ఫరా 13:30.18 టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి తుది పరుగుకు అర్హత సాధించాడు. ఇథియోపియా రన్నర్లు యోమిఫ్ కెజెల్చా (13:30.07), ముక్తర్ ఎడ్రిస్ (13:30.22) తొలి, మూడో స్థానం దక్కించుకున్నారు. జస్టిన్ నైట్ (కెనడా), ఆరోన్ కిఫ్లే (ఇరిత్రియా) నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.

లక్ష్మణన్‌కు 15వ స్థానం

వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ పతకం ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. ఐదు వేల మీటర్ల పరుగు తొలి హీట్స్‌లో భారత్ నుంచి బరిలోకి దిగిన లక్ష్మణన్ గోవిందన్ 15వ స్థానంలో నిలిచాడు. తొలి హీట్స్‌లో మొత్తం 21 మంది పోటీపడగా.. లక్ష్మణన్ చివరి నుంచి ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. అయితే ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయినప్పటికీ అతడు 13:35.69 టైమింగ్‌తో పర్సనల్ బెస్ట్ నమోదు చేశాడు. కాగా.. రెండో హీట్స్‌లో ఇథియోపియా రన్నర్ సెలెమన్ బరెగా 13:21.50 టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్లో అడుగుపెట్టాడు. బిర్హాను బాలె (13.21.91), సైరస్ రటో (13:22.45), ప్యాట్రిక్ టియర్‌నన్ (13:22.52), ర్యాన్ హిల్ (13:22.79) కూడా ఫైనల్‌కు అర్హత సాధించారు.

డబుల్‌పై నీకెర్క్ గురి

పురుషుల 400 మీటర్ల టైటిల్ నెగ్గి జోరుమీదున్న సఫారీ సంచలనం వేడ్ వాన్ నీకెర్క్ 200 మీటర్ల రేసులోనూ స్వర్ణంపై గురిపెట్టాడు. ఉత్కంఠగా సాగిన మూడో సమీస్‌లో నీకెర్క్ 20.28 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు.

లోక్‌సభలో క్రీడా 'వర్సిటీ' బిల్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయతలపెట్టిన దేశ మొట్టమొదటి క్రీడా విశ్వవిద్యాలయ బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 'ప్రస్తుతం స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ టెక్నాలజీ, అత్యున్నత స్థాయి శిక్షణకు సంబంధించి లోటును ఈ విశ్వవిద్యాలయం భర్తీ చేస్తుంది' అని పార్లమెంటరీ వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రులు ఎస్ఎస్. అహ్లూవాలియా, విజయ్ గోయల్ ప్రవేశపెట్టిన ఈ బిల్లులో పేర్కొన్నారు. మణిపూర్‌లో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది.

భారత హాకీ జట్టు పరాజయం

న్యూఢిల్లీ: యూరప్ పర్యటనను భారత యువ హాకీ జట్టు పరాజయంతో ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల టూర్‌లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన ఆరంభ పోరులో భారత్ 0-1తో బెల్జియం చేతిలో పోరాడి ఓడింది. అనుభవంలేని టీమిండియా యువ ఆటగాళ్లు చివర్లో ఒత్తిడికి గురయ్యారు. నాలుగో క్వార్టర్‌లో ఏకాగ్రత కోల్పోయి ఓటమి ఎదుర్కొన్నారు. 60వ నిమిషంలో టామ్ బూన్ కొట్టిన గోల్‌తో బెల్జియం గట్టెక్కింది. ఈ మ్యాచ్‌లో మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టులో ఆరుగురు ఆటగాళ్లు అరంగేట్రం చేయడం విశేషం.



'ఐదు'లోనే సింధు

- బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (డబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్ మహిళల సింగిల్స్‌లో స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు ఐదో స్థానంలోనే కొనసాగుతోంది. సైనా నెహ్వాల్ కూడా తన 16వ స్థానాన్ని నిలబెట్టుకుంది. పురుషుల్లో హెచ్ఎస్ ప్రణయ్ రెండు ర్యాంకులు మెరుగుపరుచుకొని 15వ స్థానానికి ఎగబాకాడు. కశ్యప్ ఒక స్థానం మెరుగుపరుచుకొని 46వ ర్యాంక్ కేవసం చేసుకున్నాడు. ఇండోనేసియా, ఆస్ట్రేలియా టైటిళ్లు గెలిచిన కిడాంబి శ్రీకాంత్ 8వ ర్యాంక్‌లోనే కొనసాగుతున్నాడు. అజయ్ జయరామ్, సమీర్ వర్మ ఒక్కో స్థానం దిగజారి వరుసగా 17, 29 ర్యాంకుల్లో నిలిచారు. డబుల్స్‌లో అశ్వినీ, సిక్కిరెడ్డి 25వ ర్యాంక్ చేజిక్కించుకుంది.

రాజకీయ అ'సామాన్యుడు'



అందమైన అంత్యప్రాసలకు.. అనర్గళ ఉపన్యాసాలకు.. పెట్టింది పేరు! మాతృభాష కాని హిందీలోనూ అనితరసాధ్యమైన మాటల తూగు.. పదాల విరుపుతో ఉత్తరాది వారినీ ఆకట్టుకున్న మాటల మాంత్రికుడు!! అనేకానేక రాజకీయ యుద్ధముల ఆరితేరిన యోధుడు!! పార్టీ అగ్రనేతల పోస్టర్లు అతికించే స్థాయి నుంచి అదే పార్టీకి రెండుసార్లు అధ్యక్షుడైన రాజకీయ కృషీవలుడు. కేంద్ర మంత్రిగా జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన అచ్చ తెనుగింటి బిడ్డ.. ముప్పవరపు వెంకయ్యనాయుడు!! ఎక్కడో నెల్లూరు జిల్లా చవటపాలెంలో పుట్టిపెరిగి.. విద్యార్థి నేతగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి.. దేశ రెండో అత్యున్నత పదవిని అధిష్ఠించే స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు ప్రస్థానంలో ఎన్నో మెరుపులు! మరెన్నో సవాళ్లు!! అడగకుండానే పలు పదవులు వరించి వచ్చినప్పుడు పొంగిపోకుండా.. సవాళ్లు ఎదురైనపుడు కుంగిపోకుండా నిబ్బరంగా నిలవడమే వెంకయ్య నాయుడు ఇంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కారణం. ఆరెస్సెస్ ప్రచారక్ బోగాది దుర్గాప్రసాద్ స్ఫూర్తితోనే వెంకయ్య సంఘ్ వైపు అడుగులు వేశారు. 1967లో ఏబీవీపీలో చేరారు. కళ్ల ముందు జరిగే అన్యాయాల పట్ల దుందుడుకుగా వ్యవహరించే వెంకయ్యలో ఆవేశాన్ని తగ్గించి ఆలోచనను పెంచింది.. తెన్నేటి విశ్వనాథం, రావిశాస్త్రి, దివాకర్ల వేంకటావధాని వంటి సాహితీమూర్తుల పరిచయమే. ఆంధ్ర యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చేసేటప్పుడు వెంకయ్యకు వారితో పరిచయమైంది. రాజకీయ సభల్లో ఎలా మాట్లాడాలో, ఎలాంటి పదప్రయోగాలు చేస్తే ప్రజల హృదయాలను చూరగొనవచ్చో తనకు బోధించింది తెన్నేటి విశ్వనాథమేనని వెంకయ్య ఎప్పుడూ చెబుతారు. ఇక, ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష.. వెంకయ్య నాయుడు జీవితాన్ని మలుపుతిప్పిన మరో ఘట్టం. ఆ సమయంలో దాదాపు ఏడాదిన్నరపాటు ఆయన జైల్లో ఉన్నారు. గౌతు లచ్చన్న, తెన్నేటి విశ్వనాథం, చలసాని ప్రసాద్ తదితరులు జైల్లో ఆయన సహఖైదీలు. ఆ సమయంలో వారి జీవితానుభవాల నుంచి వెంకయ్య ఎంతో నేర్చుకున్నారు. 1978లో ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1983లో మరోసారి ఉదయగిరి నుంచే పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. మూడోసారి ఆత్మకూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కర్ణాటక నుంచి మూడుసార్లు, రాజస్థాన్ నుంచి ఒకసారి రాజ్యసభ సభ్యుడయ్యారు. దక్షిణాదిన బీజేపీకి ఎలాంటి పట్టూ లేని రోజుల నుంచీ పార్టీనే అంటిపెట్టుకుని ఉండి.. దక్షిణాదిన పార్టీ ముఖం ఆయనే అయ్యారు. 1993 నుంచి జాతీయ రాజకీయాల్లోకి వెళ్లారు. క్రమంగా పార్టీ జాతీయ అధ్యక్ష స్థాయికి ఎదిగారు. వాజ్‌పేయీ హయాంలో ఆయనకు విద్యుత్ శాఖ, ఉపరితల రవాణా వంటి కీలక శాఖలు ఇస్తానన్నా వద్దని.. గ్రామీణాభివృద్ధి శాఖను పట్టుబట్టి తీసుకున్నారు. గ్రామీణ సడక్ యోజన, స్వజలధార యోజన వంటి పథకాలు ఆయన చలవే. మళ్లీ మోదీ హయాంలో పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాలు, సమాచార ప్రసార శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడు కీలక బిల్లులు ఆమోదం పొందడంలో ఆయన కృషి చాలా కీలకమైనది. వెంకయ్యనాయుడుకు ఏడాదిన్నర వయసులో.. ఎద్దు పొడవడంతో ఆయన మాతృమూర్తి కన్నుమూశారు. అందుకే ఆయన ఎప్పుడూ పార్టీనే తన తల్లిగా భావిస్తున్నట్టు చెబుతారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినప్పుడు కూడా.. "నేను చిన్నప్పుడే తల్లిని కోల్పోయాను. పార్టీనే తల్లిగా భావించి ఎదిగాను. నేనీ స్థాయికి చేరుకోవడానికి పార్టీయే కా రణం. ఉపరాష్ట్రపతిగా వెళ్తే తల్లిలాంటి పార్టీకి రాజీనామా చేయాల్సి వస్తుంది. పార్టీ వదిలి వెళ్లాంటే నాకు మనసు రావట్లేదు" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అయినా పార్టీ ఆదేశాన్ని శిరసావహించి.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొని విజయం సాధించి శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తున్నారు.

రిటైర్ కాబోతున్న ఏచూరికి ప్రశంసలు

రిటైర్ కాబోతున్న సీతారాం ఏచూరి(సీపీఎం) మరో ఇద్దరు సభ్యులకు రాజ్యసభ గురువారం వీడ్కోలు పలికింది. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు శుక్రవారం ముగుస్తున్న నేపథ్యంలో...వారి సేవలను ఘనంగా కొనియాడుతూ ప్రసంగా లు కొనసాగాయి. ఏచూరి గొప్ప పార్లమెంటేరియన్ అని డిప్యూటీ చైర్మన్ కురియన్ అన్నారు.

పీయూసీ ఉంటేనే బీమా రెన్యువల్

న్యూఢిల్లీ, ఆగస్టు 10: వాహనదారులు తమ వాహనాలకు కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు(పీయూసీ) సమర్పిస్తేనే వారి వాహనాలకు ఇకనుంచి బీమా కంపెనీలు ఇన్సూరెన్స్ రెన్యువల్ చేస్తాయి. కాలుష్య నియంత్రణకు పలు చర్యలలో భాగంగా సుప్రీంకోర్టు గురువారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ఢిల్లీలోని అన్ని పెట్రోలు పంపు స్టేషన్లలో పీయూసీ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జస్టిస్ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర రోడ్డు రవాణా శాఖను ఆదేశించింది. ఢిల్లీలో పీయూసీ కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి నెల గడువిచ్చింది.



నేడు వెంకయ్య ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారత 15వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు శుక్రవారం ప్రమాణం స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. శుక్రవారం ఉదయం 10.15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఉప రాష్ట్రపతి పదవికి ఈనెల 5న జరిగిన ఎన్నికల్లో వెంకయ్యనాయుడు ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. కాగా, ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, సీనియర్ నేతలు ఆడ్వాణీ, మురళీమనోహర్ జోషి కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ వెళ్లగా, తెలంగాణ సీఎం కేసీఆర్ అనివార్యకారణాల వల్ల వెళ్లట్లేదని తెలిసింది.

రాజ్యసభ చైర్మన్‌గానూ..

రాజ్యసభ చైర్మన్ బాధ్యతలను కూడా వెంకయ్యనాయుడు శుక్రవారమే స్వీకరించనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు శుక్రవారం చివరి రోజు కావడంతో స్వాగతం అనంతరం నిరవధికంగా రాజ్యసభను వాయిదా వేసే అవకాశాలున్నాయి.

మైనారిటీలు భద్రమే!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే. ప్రపంచంలోని అన్ని దేశాలకంటే భారత్‌లోనే మైనారిటీలు భద్రంగా ఉన్నారు" అని స్పష్టం చేశారు. వెంకయ్య గురువారం పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడారు. దేశంలో అసహనం పెరుగుతోందన్న వాదనను కూడా తిప్పికొట్టారు. "ప్రపంచంలోనే భారతీయ సమాజం అత్యంత సహనశీలమైనది. ఈ దేశ ప్రజలు, నాగరికతే దీనికి కారణం. మన దేశంలో సహనం ఉంది కాబట్టే ప్రజాస్వామ్యం విజయవంతమైంది" అని తెలిపారు. "వారు (మైనారిటీలు) రాజ్యాంగబద్ధ పదవులతో సహా అనేక ముఖ్య స్థానాలను అలంకరిస్తున్నారు. వారిపై వివక్ష లేకపోవడం.. వారిలోని ప్రతిభా సామర్థ్యాలే దీనికి కారణం. భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ ప్రత్యేకత. లౌకికవాదం మన దేశ ఆత్మలో, రక్తంలోనే ఇమిడి ఉంది. భారత్ సెక్యులర్‌గా ఉందంటే దానికి కారణం నాయకులు కాదు. ప్రజలు, ప్రజల నాగరికతే" అని వెంకయ్య తెలిపారు. మతం ప్రాతిపదికన తోటి పౌరులను చంపడాన్ని ఎవ్వరూ సమర్థించలేరని స్పష్టం చేశారు. అయితే... ఇలాంటి సంఘటనలను కొంతమంది రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అతి చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మరికొందరైతే అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఒక వర్గాన్ని ఓటు బ్యాంకుగా భావిస్తూ చేస్తున్న రాజకీయాలే అసలు సమస్య అని వెంకయ్య అభిప్రాయపడ్డారు.

వెంకయ్య కార్యదర్శిగా ఐవీ సుబ్బారావు



అమరావతి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించనున్న వెంకయ్యనాయుడికి కార్యదర్శిగా రాష్ట్రానికి చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు నియమితులు కానున్నారు. సౌమ్యుడు, మృదుభాషి అయిన సుబ్బారావు.. ప్రభుత్వంలో పలు హోదాల్లో పనిచేశారు. విద్యా శాఖలో ఉన్నత స్థాయిలో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ప్రకాశం జిల్లాకు చెందిన ఆయన పూర్తి పేరు ఇలపావులూరి వెంకట సుబ్బారావు. మరోవైపు వెంకయ్యనాయుడి ప్రైవేట్ ఓఎస్డీగా సత్యను నియమిస్తున్నట్లు తెలిసింది.

ముస్లింలలో అభద్రత: అన్సారీ

న్యూఢిల్లీ, ఆగస్టు 10: "ముస్లింలలో అభద్రతాభావం నెలకొంది. అందరినీ కలుపుకొనిపోవాలన్న ఆమోద భావన ఇప్పుడు ప్రమాదంలో పడింది"... అని పదేళ్లు ఉపరాష్ట్రపతిగా పని చేసిన హమీద్ అన్సారీ ఆందోళన వ్యక్తం చేశారు. 'మాజీ'గా మారడానికి ఒక్కరోజు ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బుధవారం 'రాజ్యసభ టీవీ' కోసం కరణ్ థాపర్‌కు అన్సారీ ఇంటర్వ్యూ ఇచ్చారు. "ఘర్ వాపసీలు, మూకగా కొట్టి చంపడాలు, హేతువాదుల హత్యలు... ఇవన్నీ భారతీయ విలువలను దిగజార్చేవే" అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి (మతం ప్రాతిపదికన) భారతీయతను ప్రశ్నించడమనేది తీవ్ర ఆందోళనకరమన్నారు. తమకు వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో ముస్లింలు అభద్రతాభావంలో ఉన్నారన్న అంచనాతో ఏకీభవిస్తారా అని ప్రశ్నించగా... "అవును. ఇది అక్షరాలా నిజం. దేశంలోని వివిధ ప్రాంతాల వారు నాతో ఈ అభిప్రాయం పంచుకున్నారు. ముస్లింలలో అభద్రతాభావం, ఇబ్బందికర భావన పెరుగుతోంది" అని అన్సారీ పేర్కొన్నారు. కొందరు బీజేపీ నేతలు మైనారిటీలపై చేసిన వ్యాఖ్యల గురించి ప్రశ్నించగా... "అలా మాట్లాడిన వ్యక్తి ఏమీ తెలియనివాడై ఉండాలి. లేదా... దురుద్దేశపూరితం తో మాట్లాడే వాడై ఉండాలి" అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకొచ్చారా అని ప్రశ్నించగా... 'ప్రధానికీ, మంత్రులకూ చెప్పాను' అని బదులిచ్చారు.

విమర్శ లేకపోతే నిరంకుశత్వమే..

దేశ విభిన్నతకు ప్రతీకగా రాజ్యసభను రాజ్యాంగకర్తలు ఏర్పాటు చేశారని అన్సారీ అన్నారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలను అనుమతించాలని, లేనట్టయితే ప్రజాతంత్రం నుంచి నిరంకుశత్వంలోకి వ్యవస్థ దిగజారిపోతుందన్న తొలి ఉప రాష్ట్రపతి ఎస్.రాధాకృష్ణన్ వ్యాఖ్యలను గుర్తు చేసుకున్నారు. అన్సారీకి గురువారం రాజ్యసభలో ఎంపీలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. సభలో విమర్శించే హక్కు ఎంత ఉంటుందో, సభ సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యతా అదేస్థాయిలో సభ్యులపై ఉంటుందని చెప్పారు. సభలో తక్కువ సంఖ్యలో (మైనారిటీ) ఉన్నవారి రక్షణకు ప్రజాస్వామ్యం ఉన్నదన్న ఆయన, అదే సమయంలో తమ బాధ్యతలను వారూ విస్మరించరాదని స్పష్టం చేశారు. "సభాపతి స్థానం క్రికెట్ అంపైర్, హాకీ రిఫరీల్లాంటిది. ఆటలో భాగం కాదు. ఆటగాడూ కాదు. ఆటని, ఆటగాళ్లని పర్యవేక్షించడమే చైర్మన్ చేయాల్సింది. దీనంతటికీ రూల్స్ బుక్కే ప్రమాణం" అని వివరించారు.

అన్సారీకి.. అల్విదా!

- జీవితమంతా మీరు బంధనాల్లో ఉన్నారు
- ఇక మీరు స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు
- ప్రధాని మోదీ నర్మగర్భ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10 : ఉపరాష్ట్రపతిగా పదేళ్ల పదవీకాలాన్ని పూర్తిచేసుకొన్న హమీద్ అన్సారీకి రాజ్యసభ ఘనమైన వీడ్కోలు పలికింది. ఆయన చైర్మన్‌గా జరిగిన చివరిరోజు సభలో అన్సారీ సేవలను అన్నిపార్టీల సభ్యులూ కొనియాడారు. అన్సారీ వరుసగా రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతిగా పనిచేశారు. దౌత్యవేత్తగా పనిచేసిన అనుభవంతో ఆయన సభని సమర్థంగా నడపగలిగారని ప్రధాని మోదీ అన్నారు. అయితే, ముస్లింలు అభద్రతలో ఉన్నారన్న అన్సారీ వ్యాఖ్యలకు.. 'జీవితంలో చాలా భాగం మీరు బంధనాల్లో ఉన్నారు' అంటూ మోదీ నర్మగర్భ వ్యాఖ్యలతో సమాధానమిచ్చారు. "రాయబారిగా మీ కెరీర్‌లో చాలా భాగం పశ్చిమాసియాతో అనుబంధం కలిగి ఉంది. అలాంటి హద్దులు, వాతావరణం, ఆలోచనతీరు, చర్చల నడుమ, అలాంటి వ్యక్తుల మధ్య మీ జీవితంలో చాలాకాలం గడిపేశారు" అంటూ.. ఇండియన్ ఫారిన్ సర్వీసు అధికారిగా అన్సారీ తన కెరీర్‌లో ఎక్కువ భాగం ముస్లిం దేశాల్లో విధులు నిర్వర్తించడాన్ని పరోక్షంగా గుర్తుచేశారు. అంతేకాదు.. రిటైర్ అయిన తర్వాత.. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వీసీగా, జాతీయ మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా ఆయన పరిధి 'పరిమితం'గానే ఉన్నదని వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతిగా భిన్నమైన విధులు నిర్వర్తించేందుకు ఆయన ఎంతగా ప్రయత్నించినా ఆయనలో ఎంతోకొంత అశాంతి నెలకొన్నదని నర్మగర్భంగా అన్నారు. ఉపరాష్ట్రపతి పదవీకాలం ముగుస్తున్నందున ఇకపై ఆయన ఆ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన పని లేదని.. తన మౌలిక ఆలోచనా ధోరణికి తగ్గట్టుగా ఆలోచించడానికి, చర్చించడానికి, వ్యవహరించడానికి ఆయనకు స్వేచ్ఛ లభిస్తుందని అన్నారు. కాగా.. ప్రతిబంధనాల్లోంచి సైతం దేశం ముందుకు అడుగులు వేయడానికి అన్సారీ వంటి నేతలే కారణమని మన్మోహన్ సింగ్ అన్నారు.



డోక్లాంపై యుద్ధ మేఘాలు!

- సరిహద్దు గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్న భారత్
- డోక్లాం దిశగా కదులుతున్న 33 కార్ప్స్ దళాలు
- చెరో 100 మీటర్ల వెనక్కి వెళుదామన్న చైనా
- నిర్ద్వంద్వంగా తిరస్కరించిన భారత సైన్యం
- 250 మీటర్లకు అయితే సిద్ధమని ప్రకటన

బీజింగ్, ఆగస్టు 10: డోక్లాం చిచ్చు యుద్ధం దిశగా సాగుతోందా? చైనాతో తాడోపేడో తేల్చుకొనేందుకే భారత్ సిద్ధమవుతోందా? ఈ ప్రశ్నలకు తాజా పరిణామాలు ఔననే సమాధానమిస్తున్నాయి. డోక్లాంకు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాతాంగ్ గ్రామాన్ని భారత సైనికులు ఖాళీ చేయిస్తున్నారు. గ్రామంలో సుమారు 200 మంది వరకు నివసిస్తున్నారు. అదే సమయంలో సుక్నా నుంచి డోక్లాంకు 33 కార్ప్స్ సైనికులను తరలిస్తున్నారు. మరోవైపు డోక్లాంపై చైనా తాజాగా చేసిన ఓ ప్రతిపాదనను కూడా భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. డోక్లాంలో ప్రస్తుతమున్న స్థానం నుంచి ఇరుదేశాలకు చెందిన సైనికులను 100 మీటర్ల మేర వెనక్కి ఉపసంహరించుకుందామని చైనా గురువారం ప్రతిపాదించింది. రెండు దేశాల నడుమ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఈ చర్య దోహదపడుతుందని సూచించింది. అయితే, ఈ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యం కాదని, కనీసం 250 మీటర్ల మేర వెనక్కి వెళ్లే పక్షంలో ఆమోదం తెలుపుతామని భారత్ సైన్యం స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలాఉండగా డోక్లాం తమదేనని చైనా ప్రకటించడాన్ని భూటాన్ ప్రభుత్వం తిరస్కరించింది. తమ భూభాగమైన డోక్లాంలో చైనా రహదారిని నిర్మిస్తోందని, ఇది ఇరుదేశాల నడుమ సరిహద్దు ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. పీఎల్ఏకి చెందిన సీనియర్ కల్నల్ జౌబో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈమేరకు వ్యాఖ్యానించారు. డోక్లాంలో భారత్ వైఖరి పట్ల చైనా ప్రభుత్వం, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని జౌ అన్నారు. ఇరుదేశాల నడుమ సమస్య పరిష్కారం కావాలంటే, భారత్ తన సైనికులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని జౌ స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఒప్పందం 1890లో గ్రేట్ బ్రిటన్, చైనా నడుమ కుదిరినదని అన్నారు. ఇదిలా ఉండగా, చైనాలో భూకంపం నేపథ్యంలో బాధితులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సానుభూతి ప్రకటించారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas, *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.***